www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 29-7-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 104
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం; తిథి: నవమి సా. 5.56 తదుపరి దశమి; నక్షత్రం: భరణి ఉ. 10.55 తదుపరి కృత్తిక; వర్జ్యం: రా. 10.39-12.12; దుర్ముహూర్తం: మ. 12.47-1.38, మ. 3.20-4.12; అమృతఘడియలు: ఉ. 6.17-7.50; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 5.57; సూర్యాస్తమయం: 6.45
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

క్యాన్సర్‌ను జయించి.. శిశువుకు జన్మనిచ్చి..

గర్భసంచి తొలగింపునకు వచ్చిన యువతికి వైద్యుల భరోసా

పిండాలను ఫ్రీజ్ చేసి.. హిస్టరెక్టమీ చేయకుండానే చికిత్స

తల్లీ బిడ్డ ఇద్దరూ క్షేమం



2

శెభాష్ రామయ్యా!

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటి విధులు

ఈపీడీసీఎల్ లైన్‌మన్‌ను అభినందించిన గొట్టిపాటి

తోటి ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసలు

12



మను మురిపించెన్!

10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో కాంస్యం

పారిస్‌లో భారత్‌కు తొలి పతకం



ఎదురుచూపులకు తెరపడింది.. పుష్కరం తర్వాత విశ్వక్రీడల్లో భారత గన్ గర్జించింది. 'మను' చరిత్రతో దేశం పులకించింది. భారీ అంచనాలతో బరిలోకి దిగిన 22 ఏళ్ల మను భాకర్.. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో కంచు మోత మోగించింది. పాయింట్ల పట్టికలో భారత్‌కు చోటు కల్పించింది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో విజయ్ కుమార్, గగన్ నారంగ్ రజత, కాంస్యాల తర్వాత.. గత రెండు మెగా ఈవెంట్లలో మన షూటర్లు డీలాపడ్డారు. టోక్యో క్రీడల్లో తుపాకీ మొరాయించడంతో నిరాశగా వెనుదిరిగిన భాకర్.. ఈసారి గురి తప్పలేదు. అర్హత రౌండ్‌లో నిలకడగా రాణిస్తూ మూడో స్థానంలో నిలిచి ఫైనల్ చేరిన మను.. పతక పోరులోనూ అదే ఆత్మవిశ్వాసంతో కాంస్యం కొల్లగొట్టింది. ఈ క్రమంలో ఒలింపిక్ షూటింగ్‌లో మెడల్ సాధించిన తొలి భారత మహిళగా చరిత్ర సృష్టించింది.

9

పీవీ సింధు శుభారంభం

తొలి మ్యాచ్‌లో అలవోకగా విజయం

మదనపల్లె డివిజన్‌లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి బాధితుల నుంచి ప్రభుత్వం వినతులు స్వీకరించడం ప్రారంభం కావడంతోనే, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు కూడా ముందుకొస్తున్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో బాధితులు అక్కడి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి తమ భూములను వైసీపీ నేతల పేరిట ఎలా రిజిస్ట్రేషన్ చేశారంటూ నిలదీస్తున్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం, ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసం వద్ద ఏర్పాటుచేసిన ప్రజాదర్బార్‌కు రాష్ట్రం నలుమూలల నుంచీ బాధితులు తరలివస్తున్నారు. అలాగే, పలు జిల్లాల్లో కలెక్టర్లు, ఆర్డీవోలను కలిసి తమ భూమి అన్యాక్రాంతమైందంటూ జనం ఫిర్యాదులు ఇస్తున్నారు.



విజయనగరం జిల్లా భోగాపురంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పోటెత్తిన బాధితులు (ఫైల్)

న్యాయం కావాలి

రాష్ట్రవ్యాప్తంగా రోడ్డెక్కుతున్న వైసీపీ భూ బాధితులు

సరైన విచారణ జరిగితే కోకొల్లలుగా అక్రమాలు

న్యాయం చేయాలంటూ మదనపల్లె సహా అన్ని ప్రాంతాల నుంచీ చీమలదండులా జనం బయటికి

భూ అక్రమాలపై సీరియస్‌గా విచారిస్తారా?

చర్యలదాకా పోకుండా మధ్యలోనే ఆపేస్తారా?

ప్రభుత్వ స్పందనపైనే బాధితుల ఆశలు

నేడు రెవెన్యూ శాఖపై చంద్రబాబు కీలక సమీక్ష

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ సర్కారులో వైసీపీ కార్యకర్తల ఆగడాలకు బలై నోరుతెరిచే సాహసం కూడా చేయలేక ఇన్నాళ్లూ దాక్కొనిపోయిన బాధిత జనాలు ఇప్పుడు పుట్టలు పగిలినట్టు రోడ్డెక్కుతున్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వ పెద్దల ముందు ఉంచుతున్నారు. స్థిర, చరాస్తులు ఎలా కాజేశారో సవివరంగా చెబుతున్నారు. అన్నీ ఓపిగ్గా వింటున్న ప్రభుత్వం... ప్రస్తుతానికి అయితే తాత్కాలిక ఉపశమన చర్యలు

మిగతా 11వ పేజీలో...



మాజీ ఎమ్మెల్యే నవాజ్ బాషా ఇంట్లో సోదాల అనంతరం కారులో వెళుతున్న పోలీసులు

సర్కారు చేతికి పెద్దిరెడ్డి గుట్టు?

హైదరాబాద్‌లో మాజీ మంత్రి సన్నిహితుడి ఇంట్లో తనిఖీలు

నాలుగు ట్రంకు పెట్టెల్లోని కీలక ఫైళ్లు, డాక్యుమెంట్లు సీజ్

శశికాంత్ కోసం పోలీసు బృందం గాలింపు

పెద్దిరెడ్డి పీఏ తుకారాం ఇంట్లో కీలక డాక్యుమెంట్లు స్వాధీనం

పోలీసుల అదుపులో తుకారాం.. మదనపల్లె తరలింపు

వైసీపీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ఇళ్లలోనూ సోదాలు

మాధవరెడ్డితో భూ లావాదేవీలపై ఆరా

మదనపల్లె భూ రికార్డుల దహనం కేసులో పురోగతి

11

కబ్జాదారులపై కొరడా!

వైసీపీ భూ దోపిడీపై హైకోర్టు జడ్జి నేతృత్వాన విచారణ

ముగ్గురు సభ్యులతో కమిటీ

కమిటీలో సీనియరు ఐఏఎస్, ఐపీఎస్

రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రతిపాదన

నేడు చంద్రబాబు సమీక్షలో నిర్ణయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో విలువైన ప్రభుత్వ భూముల పరాధీనం, ప్రైవేటు భూములను రాజకీయ నేతలు చెరపట్టడంపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర హైకోర్టు సిటింగ్ జడ్జి నేతృత్వంలో ముగ్గురు సభ్యులతో కూడిన విచారణ కమిటీని ఏర్పాటు చేయాలనుకుంటోంది. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద జరిగే సమావేశంలో కమిటీతో విచారణను రెవెన్యూశాఖ ప్రతిపాదించనుంది. ఒక సీనియర్ ఐఏఎస్, సీనియర్ ఐపీఎస్ ఉండేలా కమిటీ కూర్పును ప్రతిపాదించనున్నట్లు

మిగతా 11వ పేజీలో...

'క్రిటికల్ రివర్'పై విచారణ

ఆస్తుల రిజిస్ట్రేషన్ సాఫ్ట్‌వేర్‌పై ప్రజల్లో వ్యతిరేకత.. సర్కారు దృష్టి

ఎన్ఐసీని తప్పించడం వెనుక కుట్ర జరిగి ఉంటుందనే అనుమానాలు

వేలిముద్రలు, ఆస్తుల వివరాల భద్రతపైనా పలు సందేహాలు

అప్పటి ఐటీ సలహాదారు శేషిరెడ్డిదే 'క్రిటికల్ రివర్' సాఫ్ట్‌వేర్ కంపెనీ

11



బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలతో మోదీ

ఆశించిన ఫలితాలు ఎందుకు రాలేదు?

కారణాలు ఏమిటో సమీక్షించాలి

పునరావృతం కాకుండా కార్యాచరణ

బీజేపీ సీఎంల సమావేశంలో నిర్ణయం

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

కొత్తవి ప్రారంభించి పర్యవేక్షించాలి

సీఎంలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు

న్యూఢిల్లీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అనుకున్న విధంగా ఫలితాలను సాధించపోవడానికి కారణాలను సమీక్షించుకుని, భవిష్యత్‌లో ఓటమి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని రెండు రోజులపాటు ఢిల్లీలో జరిగిన బీజేపీ ముఖ్యమంత్రుల సమావేశం నిర్ణయించింది. శనివారం నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ భేటీ తర్వాత ఈ సమావేశం జరిగింది. ఆదివారం జరిగిన రెండోరోజు సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర పథకాలను కిందిస్థాయి వరకు

మిగతా 2వ పేజీలో...

ఆశలు జల సమాధి



ఢిల్లీలోని రావూస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లోకి భారీగా పోటెత్తిన వరద నీరు

ఘటనలో ముగ్గురు సివిల్స్ అభ్యర్థుల మృతి

మృతుల్లో.. బిహార్‌కు చెందిన తానియా సోని

24 ఏళ్లుగా సింగరేణిలో పనిచేస్తున్న ఆమె తండ్రి

2



విద్యుద్దీపాల వెలుగుల నడుమ తుంగభద్ర వద్ద జల సవ్వడి

కరువు తీరేలా వరద

శ్రీశైలం, తుంగభద్రకు కొనసాగుతున్న జలాలు

నేడు శ్రీశైలం 6 గేట్లను ఎత్తనున్న మంత్రి నిమ్మల

12



శ్రీశైలం జలాశయంలోకి చేరిన వరద

జగన్ ఇంత పిరికితనమా.. సిగ్గు సిగ్గు



ప్రజాస్వామ్య హేళన దివాలాకోరుతనం.. ప్రజలను మోసం చేయడం మీకే చెల్లు

ఎమ్మెల్యే అంటే మెంబర్ ఆఫ్ మీడియా అసెంబ్లీ కాదు

ప్రతిపక్ష హోదాకే కాదు.. ఎమ్మెల్యేకీ అర్హులు కారు

అసెంబ్లీకి వెళ్లని మీరు తక్షణమే రాజీనామా చేయాలి: షర్మిల డిమాండ్

12

ఎడారి జీవితం!

చుట్టూ పచ్చటి చేలు, నదులూ, నీళ్లు, చక్కటి ఇల్లు, చల్లని కాపురం! ఇవన్నీ వదిలేసి.. 'మంచి బతుకు' కోసం గల్ఫ్ దేశాలకు వెళతాడు! ఎడారి పాలవుతాడు! బతుకు దుర్భరమవుతుంది. ఇది.. 'ఆడుజీవితం' చిత్రం! నిజానికి... ఇది అనేక మంది యథార్థ జీవిత కథ! పచ్చటి కోనసీమ నుంచి ఎడారి దేశాలకు వెళ్లి బాగా సంపాదించి స్థిరపడిన వారున్నారు! నానా ఇక్కట్లు పడుతూ.. 'కాపాడండి' అని వేడుకుంటున్న వారూ ఉన్నారు.

ఒకప్పుడు గల్ఫ్‌లో కూలి పనికి వెళ్లినా లక్షలు సంపాదించవచ్చన్న భరోసా ఉండేది!. ఇప్పుడు నకిలీ వీసాలు ఏజెంట్ల మోసాలతో గల్ఫ్ బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. అసలు ఉపాధి మాట దేవుడెరుగు.. వెళ్లినవారు మళ్లీ స్వదేశానికి తిరిగొస్తారోలేదోనన్న దుర్భరమైన పరిస్థితులు దాపురించాయి. తాజాగా.. ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లి ఏజెంట్ మోసం.. యజమాని కర్కశంతో.. ప్రాణాపాయ స్థితిలో చిక్కుకున్న అంబాజీపేట మండలం, ఇసుకపూడి గ్రామానికి చెందిన వీరేంద్ర అనే యువకుడు.. మంత్రి లోకేశ్ చొరవతో బతుకుజీవుడా అంటూ తిరిగి స్వదేశంలోకి అడుగుపెట్టాడు. అంతకుముందు అన్నమయ్య జిల్లాకు చెందిన శివ అనే వ్యక్తి ఎడారిలో సెల్ఫీ వీడియోతో తన కష్టాలు చెప్పుకోవడంతో.. అతనినీ స్వదేశానికి రప్పించారు. ఇలా రోజుకో బాధితుడి కథ తెరపైకి వస్తోంది.

ఏజెంట్ల మోసాలు.. నకిలీ వీసాలు

ప్రాణాలు దక్కితే చాలనే ఆశ

పాస్‌పోర్టు లాక్కుంటారు.. జీతాలివ్వరు

చెప్పే పని ఒకటి.. చేయించేది మరొకటి

యజమాని దయాదాక్షిణ్యాలపైనే జీవితం

ఎడారి విధుల్లో గొంతు తడవడమూ కష్టమే

సక్రమమైన విధానంలో వెళ్లడమే మేలు

నకిలీ ఏజెంట్ల మోసాలకు బలి కావొద్దు



గల్ఫ్‌లో చిన్న గదుల్లోనే జీవనం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఏదో చేద్దామనుకుని వెళ్లి.. ఇంకేదో చేస్తూ... ఎలా బయటపడాలో తెలియని దైన్యంలో కొట్టుమిట్టాడే జీవితాలు! సక్రమమైన విధానంలో, సరైన ఉద్యోగంలో చేరితే అంతా మేలే! ఏజెంట్ల మోసాల వలలో పడితే మాత్రం కష్టాలు చుట్టుముడతాయి. గల్ఫ్ వెళ్లాలనుకునే వారి అమాయకత్వాన్ని, బలహీనతను ఆసరాగా చేసుకుంటున్న ఏజెంట్లు లక్షల రూపాయలు వసూలు చేసి మోసం చేస్తున్నారు. కంపెనీల్లో ఉద్యోగాల పేరిట వీసాలు సృష్టించి గల్ఫ్ పంపిన తర్వాత అక్కడ పనులు లేక చాలామంది ఎడారుల్లో గొర్రెలు, ఒంటెలు కాపరులుగా ఒంటరిగా మగ్గిపోతున్నారు. ఉండటానికి నీడలేక ఎడారుల్లో వేసే గుడారాల్లో ఏళ్ల తరబడి జీవనం సాగిస్తూ బాహ్య ప్రపంచంతో

మిగతా 12వ పేజీలో...

క్యాన్సర్‌ను జయించి.. శిశువుకు జన్మనిచ్చి..

- గర్భసంచి తొలగింపునకు వచ్చిన యువతికి వైద్యుల భరోసా
- పిండాలను ఫ్రీజ్ చేసి.. హిస్టరెక్టమీ చేయకుండానే చికిత్స
- క్యాన్సర్ ఉన్న ప్రాంతాన్ని గుర్తించి జాగ్రత్తగా తొలగింపు
- పూర్తి ఆరోగ్యంతో పుట్టిన పాప.. తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమం


క్యాన్సర్‌ను జయించి బిడ్డకు జన్మనిచ్చిన యువతి మౌనికతో వైద్యురాలు వసుంధర

రాయదుర్గం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ సోకడంతో.. గర్భసంచి తొలగింపు కోసం వచ్చిన యువతికి వైద్యులు కొత్త భరోసా ఇచ్చారు! గర్భసంచి తొలగించకుండానే క్యాన్సర్‌కు చికిత్స చేయడమే కాక.. ఆమె మళ్లీ మాతృత్వ మధురిమను పొందేలా చేశారు. హైదరాబాద్‌లోని కొండాపూర్ కిమ్స్ కడల్స్ ఆస్పత్రి వైద్యుల ఘనత ఇది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన మౌనిక (27)కు తొలుత ఒకసారి గర్భం వచ్చింది. కానీ, కొన్నాళ్ల తర్వాత గర్భస్థశిశువుకు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తడంతో గర్భస్రావం చేయించారు. కొన్నాళ్ల తర్వాత.. ఆమె అనారోగ్యం బారిన పడడంతో పరీక్షలు చేయించగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చినట్టు తేలింది. దీంతో.. తప్పనిసరిగా ఆమె గర్భసంచి తొలగించాలని (హిస్టరెక్టమీ) అక్కడి వైద్యులు చెప్పారు. అందుకోసం ఆమె కొండాపూర్‌లోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రికి వచ్చారు. కానీ.. 'క్యాన్సర్ ఉన్నంత మాత్రాన గర్భసంచి తొలగించాల్సిన పనిలేదు. అలా తొలగిస్తే ఇక జీవితాంతం పిల్లలు పుట్టే అవకాశం ఉండదు. దాన్ని తొలగించకుండానే క్యాన్సర్ చికిత్స చేయొచ్చు. ఆ తర్వాత పిల్లలను కూడా పొందవచ్చు' అని ఆ ఆస్పత్రిలోని సీనియర్ కన్సల్టెంట్ గైనకాలజిస్ట్, రోబోటిక్ అండ్ ల్యాప్రోస్కోప్ సర్జన్ డాక్టర్ వసుంధర చీపురుపల్లి ఆమెకు ధైర్యం చెప్పారు. క్యాన్సర్ ఒకచోటే ఉన్నదని.. అది ఇతర ప్రాంతాలకు విస్తరించలేదని.. కాబట్టి భవిష్యత్తులో పిల్లలు పుట్టే అవకాశం ఉంటుందని ఆమెకు వివరించారు. వైద్యుల కౌన్సెలింగ్‌తో మౌనిక దంపతులు చికిత్సకు ఒప్పుకొన్నారు. దీంతో వైద్యులు తొలుత ఆమె పిండాలను ఫ్రీజ్ చేసి.. క్యాన్సర్ చికిత్స ప్రారంభించారు. చికిత్స పూర్తైన తర్వాత.. ఫ్రీజ్ చేసిన రెండు పిండాలను ఆమె గర్భసంచిలో ప్రవేశపెట్టారు. అయితే.. కుట్లు వేయడం వల్ల గర్భసంచి రెండు పిండాలను మోసే పరిస్థితి ఉండకపోవచ్చని భావించి, ఒక పిండాన్ని తీసేశారు. 32వారాల తర్వాత.. ముందుజాగ్రత్త చర్యగా లోపలున్న శిశువు ఊపిరితిత్తులు బలంగా ఉండేందుకు ఇంజెక్షన్లు చేశారు. 37 వారాల తర్వాత.. అంతా బాగుండటంతో ఆమెకు శస్త్రచికిత్స చేశామని, సంపూర్ణ ఆరోగ్యంతో చక్కటి పాప పుట్టిందని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని డాక్టర్ వసుంధర తెలిపారు. మౌనిక కుటుంబ సభ్యులు ఆస్పత్రి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. "ఒకదశలో.. మాకు అసలు పిల్లలు పుట్టే అవకాశం లేదనుకున్నాం. కానీ, డాక్టర్ వసుంధర, కిమ్స్ కడల్స్ ఆస్పత్రి బృందం మాకు ఎంతగానో నచ్చజెప్పారు. ఇప్పుడు మాకో చక్కటి పాప పుట్టింది. మేమంతా ఎంతో సంతోషంగా ఉన్నాం" అని మౌనిక భర్త మహేశ్ ఆనందం వ్యక్తం చేశారు.

అయోధ్య మసీదుకిచ్చిన స్థలం నాది!

- సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానన్న ఢిల్లీ మహిళ

లఖ్‌నవూ, జూలై 28: రామజన్మభూమి-బాబ్రీ మసీదు వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు మేరకు అయోధ్యలోని ధన్నీపూర్ గ్రామంలో మసీదు నిర్మాణానికి ప్రభుత్వం కేటాయించిన ఐదెకరాల స్థలం తన కుటుంబానికి చెందినదని ఢిల్లీకి చెందిన మహిళ రాణీ పంజాబీ చెప్పారు. ధన్నీపూర్ గ్రామంలో తమ కుటుంబానికి 28.35 ఎకరాల భూమి ఉందని, అందులోనే 5 ఎకరాలను మసీదు కోసం ప్రభుత్వం కేటాయించిందని ఆమె తెలిపారు. స్థల యాజమాన్యానికి సంబంధించిన అన్ని పత్రాలూ తమ వద్ద ఉన్నాయని, స్థలాన్ని తిరిగి సొంతం చేసుకునేందుకు సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని ఆమె పీటీఐకి తెలిపారు. దేశ విభజన సమయంలో తన తండ్రి జ్ఞాన్‌చంద్ పంజాబీ ఆస్తులన్నీ పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రాంతంలో ఉండిపోయాయని, అందుకు ప్రత్యామ్నాయంగా ధన్నీపూర్ గ్రామంలో 28.35 ఎకరాల భూమిని కేటాయించారని రాణి తెలిపారు. 1983వ సంవత్సరం వరకు ఆ భూమిలో తాను, తన కుటుంబం వ్యవసాయం చేశామని, తన తండ్రి ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స కోసం ఢిల్లీకి వచ్చి స్థిరపడ్డామని చెప్పారు. అప్పటి నుంచి ఆ భూమి ఆక్రమణలకు గురవుతోందన్నారు. ఆ భూమిలో మసీదు నిర్మించడంపై తనకేమీ అభ్యంతరం లేదని, అయితే ప్రభుత్వం తనకూ న్యాయం చేయాలని కోరుతున్నానని చెప్పారు. అయితే, మసీదు నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ఇండో-ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షుడు, సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డు చైర్మన్ జుఫర్ ఫారూఖీ ఆమె వాదనను తోసిపుచ్చారు. ఆమె వాదనను 2021లోనే అలహాబాద్ హైకోర్టు కొట్టివేసిందన్నారు. తాము ఇప్పటికే అనేకసార్లు రాణిని కలిసి, ఆధారాలు చూపించాలని కోరామని, అయితే, ఆమె చూపలేదని ఫౌండేషన్ సభ్యుడొకరు చెప్పారు. కాగా, మసీదు నిర్మాణం ప్రాజెక్టు పనులు ఈ ఏడాది అక్టోబరులో ప్రారంభం కానున్నట్టు జుఫర్ ఫారూఖీ తెలిపారు. ఆ స్థలంలో మసీదు, ఇతర భవనాల నిర్మాణం ఈ ఏడాది మేలోనే ప్రారంభిస్తామని ఫౌండేషన్ గతంలో చేసిన ప్రకటనను పీటీఐ ప్రస్తావించగా.. మొత్తం ప్రాజెక్టుకు సంబంధించిన డిజైన్లు తిరిగి రూపొందించడం వల్ల కొంత జాప్యం జరిగిందని, నిధుల సమీకరణకు సంబంధించి ఎఫ్‌సీఆర్ఏ(విదేశీ చందాల నియంత్రణ చట్టం) సర్టిఫికెట్ కూడా ఇంకా రాలేదని చెప్పారు.

క్రీస్తుపూర్వం నాటి రాతి సమాధులు!

- బాపట్ల జిల్లా ధేనువకొండలో తవ్వకాలతో వెలుగులోకి


ధేనువకొండలో బయటపడిన రాతి సమాధులు

అద్దంకి టౌన్, జూలై 28 : బాపట్ల జిల్లా అద్దంకి మండలం ధేనువకొండ గ్రామ కొండప్రాంతంలో మట్టి తవ్వకాలలో క్రీస్తుపూర్వం 7, 8 శతాబ్దాల నాటి రాతి సమాధులు బయటపడ్డాయి. గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న చరిత్ర పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళి ఆదివారం వచ్చి వాటిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుమారు 50 సెంట్ల భూమిలో 15 వరకు రాతి సమాధులను గుర్తించామన్నారు. వాటిలో రెండు జంట సమాధులు ఉన్నాయని చెప్పారు. దీన్ని బట్టి క్రీస్తుపూర్వం 7, 8 శతాబ్దాల నాటికే ఈ ప్రాంతంలో జన సంచారం ఉన్నట్లు తెలుస్తోందన్నారు. కొండ ప్రాంతాల్లో ఉండే సంచార జాతుల వారు పోడు వ్యవసాయం చేసేవారని ఈ ఆనవాళ్ల ద్వారా తెలుస్తోందని చెప్పారు. చనిపోయినవారి కోసం నాలుగు వైపులా పెద్దపెద్ద బండరాళ్లతో మూడు అడుగుల వెడల్పు, ఆరు అడుగుల పొడవున సమాధులను నిర్మించేవారని తెలిపారు.

సీదిరి పేరు చెప్పి భూములు లాక్కున్నారు

- నల్లబొడ్లూరు కొండపై రైతుల ఆందోళన

హరిపురం, జూలై 28: మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు పేరు చెప్పి వైసీపీ నాయకులు తమ భూములను బలవంతంగా లాక్కున్నారని పలువురు రైతులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ.. శ్రీకాకుళం జిల్లా మందస మండలం బహాడపల్లి పంచాయితీ నల్లబొడ్లూరు గ్రామానికి చెందిన రైతులు ఆదివారం కొండపై ఆందోళన చేశారు. '25ఏళ్ల కిందట ఈ కొండపై సుమారు పది కుటుంబాలకు 10 ఎకరాల స్థలం పట్టాలు ఇచ్చారు. ఇక్కడ జీడి, మామిడి తోటలు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. నాలుగేళ్ల కిందట వైసీపీ నాయకులు, స్థానిక సర్పంచ్, ఎంపీపీ దానయ్య.. అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు పేరుచెప్పి మా భూములు బలవంతంగా స్వాధీనం చేసుకున్నారు' అని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నాటి ప్రభుత్వం అందజేసిన పట్టాలతో ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

టీఆర్టీసీ చార్జీల్లో ఫ్లాట్ 10 శాతం డిస్కౌంట్

విజయవాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ-హైదరాబాద్‌ల మధ్య రాకపోకలు సాగించే తెలంగాణ హై ఎండ్ బస్సు చార్జీల్లో ఫ్లాట్ 10 శాతం డిస్కౌంట్‌ను కల్పిస్తూ తెలంగాణ ఆర్టీసీ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత స్లాక్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఆదాయం పెంచుకునే దిశగా సెప్టెంబరు 30వ తేదీ వరకు ఈ డిస్కౌంట్ అమలు చేయనుంది. తెలంగాణాకు చెందిన సూపర్ లగ్జరీ బస్సులతో పాటు ఏసీ శ్రేణిలో నడుపుతున్న రాజధాని బస్సుల్లో ఈ డిస్కౌంట్‌ను ఇస్తోంది. తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తున్నందున డిమాండ్ ఉన్న రూట్లలో ఆదాయాన్ని పెంచుకునేందుకు టీఎస్ఆర్టీసీ కసరత్తు చేస్తోంది.

ఆశలు జల సమాధి

- ఢిల్లీలోని రావూస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ బేస్‌మెంట్‌లోకి వరద నీరు
- ముగ్గురు సివిల్స్ అభ్యర్థుల మృతి


ఢిల్లీలోని కరోల్‌బాగ్ మెట్రో స్టేషన్ దగ్గర అభ్యర్థుల నిరసన ప్రదర్శన


నెవిన్ డాల్విన్


శ్రేయ యాదవ్

న్యూఢిల్లీ, హైదరాబాద్, శ్రీరాంపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ సాధించాలనే తమ కలలను సాకారం చేసుకునేందుకు దేశ రాజధాని ఢిల్లీ బాట పట్టారా ముగ్గురూ! ఐఏఎస్, ఐపీఎస్ వంటి సర్వీసుల్లో చేరి ఏదో సాధించాలని ఆశ పడ్డారు. కానీ.. తమ లక్ష్యాన్ని చేరుకునేలోపే.. చదువులో నిమగ్నమై జలసమాధి అయిపోయారు. దేశరాజధాని ఢిల్లీలో శనివారం జరిగిందీ దుర్ఘటన. ఈ విషాదంలో.. ముగ్గురు సివిల్స్ అభ్యర్థులు మృతి చెందారు. సెంట్రల్ ఢిల్లీలోని పాత రాజేంద్ర నగర్ కోచింగ్ సెంటర్లకు ప్రధాన కేంద్రం. దేశం నలుమూలల నుంచి సివిల్స్ సహా ఇతర కోచింగ్‌ల కోసం విద్యార్థులు వస్తుంటారు. అక్కడే రావూస్ ఐఏఎస్ అకాడమీ కూడా ఉంది. శనివారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో.. కోచింగ్ సెంటర్‌లోకి వరద నీరు పోటెత్తింది. ఆ సమయంలో కొందరు విద్యార్థులు ఆ కోచింగ్ సెంటర్‌లోని బేస్‌మెంట్‌లో ఉన్న లైబ్రరీలో చదువుకుంటున్నారు. వారంతా చదువులో నిమగ్నమై ఉండగా వరద నీరు చుట్టుముట్టింది. అక్కడ ఉన్న వారిలో కొంతమంది తప్పించుకోగా.. బిహార్‌కు చెందిన తానియా సోని (25), ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్రేయ యాదవ్ (25), కేరళకు చెందిన నెవిన్ డాల్విన్ (28) మృతి చెందారు. విషయం తెలియగానే ఢిల్లీ పోలీసులు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అక్కడికి చేరుకుని.. వరదలో చిక్కుకున్న విద్యార్థులను బయటికి తీసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. కాగా తానియా సోని.. తండ్రి విజయ్ కుమార్ బిహార్‌లోని ఔరంగాబాద్ ప్రాంతవాసి. 24 సంవత్సరాలుగా ఆయన సింగరేణిలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం మంచిర్యాల్ జిల్లా శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్పీ1 గనిలో సీనియర్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కుమార్తె తానియా సోని డిగ్రీ, పీజీ ఢిల్లీలోనే పూర్తిచేసింది. సివిల్స్ కోచింగ్ కోసం ఈ ఏడాదే రావూస్‌లో చేరింది. ఈ ప్రమాదంలో ఆమె మరణించిందన్న విషయం తెలియగానే విజయ్‌కుమార్ కుటుంబసభ్యులు ఢిల్లీకి చేరుకున్నారు. కాగా.. ఈ ప్రమాదం నేపథ్యంలో కోచింగ్ సెంటర్ యజమాని అభిషేక్ గుప్తా, సెంటర్ కో-ఆర్డినేటర్ దేశ్‌పాల్‌సింగ్‌ను అదుపులోకి తీసుకొని వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాలను.. కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. కాగా.. ఈ ఘటనలో శ్రేయ యాదవ్ మరణించిన విషయాన్ని తాను న్యూస్ చానళ్ల ద్వారానే తెలుసుకున్నానని ఆమె బంధువు ధర్మేందర్ యాదవ్ తెలిపారు. 'ఆమెతో ఫోన్‌లో మాట్లాడడానికి నేను ప్రయత్నించాను. కానీ స్విచాఫ్ వచ్చింది. కోచింగ్ సెంటర్ నంబర్ కూడా పనిచేయలేదు. దీంతో వెంటనే ఘజియాబాద్ నుంచి బయల్దేరి ఢిల్లీకి చేరుకుని ఆమె రూమ్‌కు వెళ్లాను. ఆ గదికి తాళం వేసి ఉంది. ఆమె కోసం అకాడమీకి వెళ్తే.. తనను ఆస్పత్రికి తీసుకెళ్లారని పోలీసులు చెప్పారు. అక్కడికి వెళ్తే.. ఆమె మృతదేహాన్ని చూపార'ని వాపోయారు. ప్రమాదం శనివారం సాయంత్రం జరిగితే.. ఆదివారం మధ్యాహ్నం దాకా మృతదేహాలను చూపలేదని మృతుల కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.


మృతులకు తోటి సివిల్స్ అభ్యర్థుల నివాళి

పార్కింగ్ స్థలంలో లైబ్రరీ

రావూస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ నిర్మాణంలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్టు అధికారులు గుర్తించారు. ఈ కోచింగ్ సెంటర్‌కు సంబంధించి 2021లో మూడంతస్తుల భవన నిర్మాణ ప్లాన్‌కు అనుమతి తీసుకున్నారు. సెల్లార్‌ను పార్కింగ్, సరకు నిల్వ (స్టోర్ రూమ్) కోసమే వినియోగిస్తామని చెప్పి.. అగ్నిమాపక శాఖ నుంచి నిరభ్యంతర పత్రం కూడా తీసుకున్నారు. కానీ, నిబంధనలకు విరుద్ధంగా అక్కడ లైబ్రరీ ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్పారు. శనివారం సాయంత్రం 7.10 గంటల సమయంలో ఈ ఘటన గురించి తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఐదుగురు నీటిని తోడిపోసే యంత్రాలతో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. కానీ, లోపలి నుంచి నీరు తోడి బయటకు పోద్దామంటే.. అప్పటికే వాననీటితో రోడ్డు నిండిపోయింది. దీంతో ఆ నీరు పోయే దాకా వేచి ఉండి, ఆ తర్వాత బేస్‌మెంట్‌లోంచి నీటిని బయటకు పంప్ చేశామని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. కాగా, ఈ ఘటనపై స్పందించిన ఢిల్లీ మేయర్ షెల్లీ ఒబెరాయ్.. రాజకీయాలకు అతీతంగా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. దీనిపై న్యాయ విచారణకు ఆదేశించినట్టు ఆప్ మంత్రి అతిశీ తెలిపారు. మరోవైపు.. ఢిల్లీలో నిబంధనలకు ఉల్లంఘిస్తున్న కోచింగ్ సెంటర్లపై ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ కొరడా ఝుళిపించడం ప్రారంభించింది.

రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి పరామర్శ

ముగ్గురు సివిల్స్ అభ్యర్థులు వరదనీటిలో చిక్కుకొని చనిపోవడంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తానియా సోని తండ్రి విజయ్‌కుమార్‌తో కిషన్‌రెడ్డి ఫోన్లో పరామర్శించారు. ఢిల్లీ పోలీసులు, ఇతర అధికారులతో మాట్లాడి.. పెండింగ్ లో ఉన్న అన్ని ఫార్మాలిటీసన్నింటినీ త్వరగా పూర్తిచేయడంలో చొరవ తీసుకోవాలని ఢిల్లీలోని తన కార్యాలయాన్ని కిషన్ రెడ్డి ఆదేశించారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌తో మాట్లాడిన రేవంత్.. బాధిత కుటుంబాల్లో తెలంగాణవాసులు ఉంటే అవసరమైన సహాయం అందించాలని ఆదేశించారు.

లోకం తీరు



వ్యవస్థల వైఫల్యంవల్లే!: రాహుల్



రావూస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌ను వరద నీరు ముంచెత్తిన ఘటనలో ముగ్గురు విద్యార్థులు మృతి చెందడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వ్యవస్థల వైఫల్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆయన ఆరోపించారు. "ఢిల్లీలోని ఓ భవనం బేస్‌మెంట్‌లో నీరు చేరి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు మృతి చెందడం చాలా బాధాకరం. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. వ్యవస్థల వైఫల్యం వల్లే ఈ ఘటన జరిగింది. నిర్మాణం సరిగా లేకపోవడం, ప్రణాళికలోపం, సంస్థల బాధ్యతారాహిత్యం వల్ల సామాన్యులు ప్రాణాలు కోల్పోతున్నారు. సురక్షితంగా, సౌకర్యవంతంగా జీవించడం ప్రతి పౌరుడి హక్కు. దానిని అందించడం ప్రభుత్వాల బాధ్యత" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

స్వాతి మలివాల్‌కు చేదు అనుభవం

రావూస్ కోచింగ్ సెంటర్ విషాదం గురించి తెలియగానే ఆప్ ఎంపీ స్వాతి మలివాల్ ఘటనా స్థలానికి వెళ్లారు. విద్యార్థుల ఆందోళనకు సంఘీభావం ప్రకటించేందుకు వెళ్లగా ఆమెకు చేదు అనుభవం ఎదురైంది. పలువురు విద్యార్థులు ఆమెపై మండిపడ్డారు. ఈ అంశానికి రాజకీయ రంగు పులమవద్దని నినాదాలు చేశారు. ఆ తర్వాత స్వాతి మలివాల్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ మరణాలు ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగినవి కావని, వీటిని 'హత్య'లుగానే భావించాలని అన్నారు. బాధ్యులైన ప్రభుత్వ అధికారులందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, మృతుల కుటుంబానికి రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని ఆమె డిమాండ్ చేశారు.

ఆశించిన ఫలితాలు ఎందుకు రాలేదు?


(మొదటిపేజీ తరువాయి)

అమలయ్యేలా చూడాలని ముఖ్యమంత్రులను కోరారు. నీతీఆయోగ్ సమావేశంలో నిర్ణయించిన విధంగా 2047 కల్లా వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా ప్రభుత్వ పథకాలను వేగంగా అమలు చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై), హర్ ఘర్ జల్ వంటి పథకాల ప్రయోజనాలను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త పథకాలను ప్రారంభించాలని, వాటి అమలును నిరంతరం పర్యవేక్షించాలని, సుపరిపాలన విభాగాలను ఏర్పాటు చేయాలని మోదీ సూచించారు. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రులు తమ అభిప్రాయాలను వెల్లడించడంతోపాటు ఆయా రాష్ట్రాల్లో తాము అమలు చేస్తున్న పథకాల గురించి వివరించినట్లు తెలిసింది. రెండ్రోజుల సీఎంల సమావేశంలో సంస్థాగత వ్యవహారాలను, రాజకీయాలను పెద్దగా చర్చించలేదని.. పథకాల అమలుపైనే దృష్టి కేంద్రీకరించారని పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీకి, ప్రభుత్వానికి మధ్య సమన్వయం ఉండేలా చూడాలని పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రధానిని కోరినట్లు తెలిసింది. అదేవిధంగా కేంద్ర పథకాలను రాష్ట్రాల్లో మార్చవద్దని సూచించినట్లు సమాచారం. మధ్యప్రదేశ్‌లో అమలు చేస్తున్న లాడ్లీ బీమా యోజన, మహారాష్ట్రలో ప్రారంభించిన లడ్కీ బీమా యోజన పథకాలను, యూపీలో గ్రామ సచివాలయాల డిజిటలీకరణ వంటి కార్యక్రమాలను ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా అమలు చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. కాగా, సమావేశం తర్వాత.. "సుపరిపాలనతో ప్రజల ఆకాంక్షలను తీర్చేందుకు బీజేపీ అవిశ్రాంతంగా పని చేస్తోంది. బీజేపీ పాలిత రాష్ట్రాలు సుపరిపాలనకు ఉదాహరణలు" అని ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు.

నల్లమల చెంచులే టైగర్ ట్రాకర్లు

వన్యప్రాణుల సమాచారమంతా సేకరించారు

- ప్రపంచంలోని 70% పులులు భారత్‌లోనే
- ఒలింపిక్స్‌లో మన ఆటగాళ్లకు మద్దతివ్వండి
- 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ పిలుపు



న్యూఢిల్లీ, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నల్లమల అడవుల్లో నివసించే చెంచులు టైగర్ ట్రాకర్లని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఆదివారం 'మన్ కీ బాత్' 112వ ఏపిసోడ్‌లో భాగంగా ఆయన మాట్లాడారు. జూలై 29న పులుల దినోత్సవాన్ని ప్రపంచమంతా జరుపుకుంటోందని తెలిపారు. పులులు మన సంస్కృతిలో అంతర్భాగంగా ఉన్నాయని, వాటికి సంబంధించిన కథలను వింటూ మనమంతా పెరిగామని పేర్కొన్నారు. పులితో సామరస్యంగా ఎలా జీవించాలో అడవి చుట్టూ ఉన్న గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ తెలుసని చెప్పారు. మనుషులు, పులుల మధ్య ఎప్పుడూ ఘర్షణలు జరగని ప్రాంతాలు కూడా దేశంలో ఉన్నాయని తెలిపారు. "ఆంధ్రప్రదేశ్‌లో నల్లమల కొండలపై నివసించే 'చెంచు' తెగ కృషి చూసి మీరు కూడా ఆశ్చర్యపోతారు. వారు టైగర్ ట్రాకర్లుగా, అడవిలో వన్యప్రాణుల సంచారం గురించి ప్రతి సమాచారాన్ని సేకరించారు. దీంతో పాటు ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమాలపైనా నిఘా పెట్టారు" అంటూ మోదీ కొనియాడారు. ఇటువంటి చర్యలతో దేశంలో పులుల సంఖ్య ఏటా పెరుగుతోందని, ప్రస్తుతం ప్రపంచంలోని 70 శాతం పులులు మన దేశంలోనే ఉన్నాయని ప్రధాని వివరించారు.

రూ.1.5 లక్షల కోట్లు దాటిన ఖాదీ వ్యాపారం

ఖాదీ గ్రామోద్యోగ్ వ్యాపారం తొలిసారి రూ.1.5 లక్షల కోట్లు దాటిందని, దేశవ్యాప్తంగా ఖద్దరు, చేనేత విక్రయాలు 400శాతం పెరగడం ద్వారా పెద్ద సంఖ్యలో కొత్త ఉద్యోగావకాశాలు ఏర్పడుతున్నాయని మోదీ అన్నారు. ఇప్పటి వరకూ ఖద్దరు దుస్తులు కొనుగోలు చేయనివారు వెంటనే వాటిని కొనడం ప్రారంభించాలని కోరారు. పారిస్ ఒలింపిక్స్‌లో బరిలోకి దిగుతున్న భారత క్రీడాకారులకు మద్దతుగా నిలబడాలని దేశ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. అలాగే అసోంలోని 'మొయిదమ్స్'ను యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చడం ప్రతి భారతీయుడు సంతోషించాల్సిన అంశమని అన్నారు. మాదకద్రవ్యాలపై పోరాటంలో భాగంగా ప్రభుత్వం 'మానస్' పేరుతో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, డ్రగ్స్‌కు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా 1933 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేసి చెప్పాలన్నారు. ప్రపంచంలోని పులుల్లో 70శాతం భారత్‌లోనే ఉన్నాయని ఇది మనమంతా గర్వపడాల్సిన విషయమని చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సమీపిస్తున్న నేపథ్యంలో జాతీయ జెండాతో సెల్ఫీలు దిగి హర్‌తిరంగా డాట్ కామ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ దేశ ప్రజలను మోదీ కోరారు.

బెయిల్ పిటిషన్లలో జడ్జిలకు కామన్ సెన్స్ అవసరం

- సీజేఐ జస్టిస్ చంద్రచూడ్



బెంగళూరు, జూలై 28 (ఆంధ్రజ్యోతి): బెయిల్ పిటిషన్ల విచారణ సందర్భంగా న్యాయమూర్తులకు కామన్ సెన్స్ అవసరమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. కొన్ని ముఖ్యమైన కేసుల్లో ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే వారు బెయిల్ మంజూరు చేయకుండా 'సేఫ్'గా తప్పుకోవడానికే ఇష్టపడుతున్నారని వ్యాఖ్యానించారు. అయితే ప్రతి కేసునూ నిస్సందేహంగా పరిశీలించడానికి దృఢమైన ఇంగిత జ్ఞానం కావాలని పేర్కొన్నారు. బెంగళూరు లా యూనివర్సిటీ ఆధ్వర్యంలో 'కంపారిటివ్ ఈక్వాలిటీ అండ్ యాంటీ డిస్క్రిమినేషన్' అనే అంశంపై ఆదివారం జరిగిన సదస్సులో న్యాయవాదులు, విద్యార్థులను ఉద్దేశించి చీఫ్ జస్టిస్ ప్రసంగించారు. ట్రయల్ కోర్టుల్లో బెయిల్ పొందాల్సిన వ్యక్తులు అక్కడ సాధ్యం కాకపోవడంతో హైకోర్టులకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. అక్కడా బెయిల్ లభించకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తున్నారని అన్నారు. ఈ జాప్యం వలన ఏకపక్ష అరెస్టులను ఎదుర్కొంటున్న వారికి మరిన్ని ఇబ్బందులు తప్పడం లేదని చెప్పారు. ప్రతిపక్షాల ముఖ్యులు, కార్యకర్తలు, విద్యావేత్తలు, జర్నలిస్టులను నిర్బంధించడం ద్వారా రాజకీయ ప్రేరేపిత విధానంలో ప్రభుత్వ అధికారులు ప్రవర్తించినట్టు కనిపిస్తోందని అన్నారు.

హెజ్‌బొల్లా దాడిలో చనిపోయిన చిన్నారులకు కన్నీటి వీడ్కోలు

- దాడికి ప్రతీకారం తప్పదని ఇజ్రాయెల్ హెచ్చరిక
- లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలు ధ్వంసం



టెల్అవీవ్, జూలై 28: ఇజ్రాయెల్‌లోని గోలన్ హైట్స్‌లో సాకర్ ఆడుతూ శనివారం హెజ్‌బొల్లా రాకెట్ దాడిలో ప్రాణాలు కోల్పోయిన చిన్నారుల, యువత మృతదేహాలకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. వీరి మృతదేహాలను కడసారి చూసేందుకు భారీ సంఖ్యలో జనాలు వీధుల్లోకి వచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రులను ప్రజలు నిలదీశారు. 9 నెలలుగా హెజ్‌బొల్లా దాడులు జరుగుతున్నా తమను పట్టించుకోలేదని, ఏ మొహం పెట్టుకుని ఇక్కడకు వచ్చారని ప్రశ్నించారు. కాగా, లెబనాన్‌వైపు నుంచి హెజ్‌బొల్లా ప్రయోగించిన రాకెట్లు గోలన్ హైట్స్‌లో ఫుట్‌బాల్ గ్రౌండ్‌పై పడడంతో అక్కడ ఆడుతున్న ఐదుగురు చిన్నారులు, ఏడుగురు యువత ప్రాణాలు కోల్పోగా.. మరో 20మంది గాయపడ్డారు. ఈ ఘటన జరిగినప్పుడు అమెరికా పర్యటనలో ఉన్న ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు దాడి గురిం చి తెలుసుకుని అర్ధంతరంగా తన పర్యటన ముగించుకొని తిరిగి వస్తున్నట్లు ప్రకటించారు. కాగా ఈ దాడితో తమకు సంబంధం లేదని హెజ్‌బొల్లా చెబుతుండగా, పిల్లల ప్రాణాలకు ప్రతీకారం తప్పదని ఇజ్రాయెల్ హెచ్చరించింది. ఇజ్రాయెల్ ఇక యుద్ధంలోకి దిగుతుందని రక్షణ రంగ నిపుణులు పేర్కొన్నారు. ఆదివారం తూర్పు లెబనాన్‌లోని బక్కా వ్యాలీ, షబ్రిహా, బుర్జ్ అల్- షెమలీ, కఫార్ కిలా సహా పలు ప్రాంతాల్లోని హెజ్‌బొల్లా స్థావరాలను ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ ఆదివారం ప్రకటించింది.

నిత్యకల్యాణం... నగలతో పలాయనం

- 20 మంది మహిళలతో వివాహం
- మహారాష్ట్ర పోలీసులకు చిక్కిన నిత్య పెళ్లికొడుకు

పాల్ఘర్, జూలై 28: విడాకులు తీసుకున్న మహిళలు, ఒంటరి వితంతువులే లక్ష్యంగా మ్యాట్రిమోని వెబ్‌సైట్‌లో అతను వివరాలు పెడతాడు. ఎవరైనా ఆకర్షితులైతే స్నేహం చేసి పెళ్లి చేసుకుంటాడు. ఆపై భాగస్వామికి చెందిన నగానట్రా తీసుకుని పరారవుతాడు. ఇలా ఏకంగా 20మంది మహిళల్ని మోసం చేసి పెళ్లిచేసుకున్నాక విలువైన వస్తువులతో ఉడాయించిన ఓ నిత్య పెళ్లికొడుకుని మహారాష్ట్ర పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల ఓ బాధితురాలు ఫిర్యాదుతో ఈ విషయం వెలుగులో కొచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఫిరోజ్ నియాజ్ షేక్ (43)ను బాధిత మహిళ మ్యాట్రిమోని వెబ్‌సైట్ ద్వారా కలిసింది. తర్వాత అతన్ని పెళ్లిచేసుకుంది. 2023 నవంబరులో ఆమె తాలూకు నగదు, ల్యాప్‌టాప్, ఇతరత్రా రూ.6.5లక్షల విలువైన వస్తువులతో షేక్ ఉడాయించాడు. నిందితుడు థానేలోని కల్యాణ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించిన పోలీసులు... పాల్ఘర్ జిల్లాలో అదుపులోకి తీసుకున్నట్లు ఆదివారం తెలిపారు. 2015నుంచి ఇప్పటి దాకా 20 మందిని అతను పెళ్లిచేసుకున్నాడన్నారు.

వారంలోనే 1,674 కోట్లు

కమలా హారిస్‌కు వెల్లువెత్తుతున్న విరాళాలు



వాషింగ్టన్, జూలై 28: అమెరికా అధ్యక్ష రేసులోకి కమలా హారిస్ వచ్చాక వారం వ్యవధిలోనే ఆమె ప్రచారం కోసం రూ.1,674.45 కోట్ల(200 మిలియన్ డాలర్ల) విరాళాలు వచ్చాయి. ఆమె ప్రచార బృందం ఆదివారం ఈ విషయాన్ని వెల్లడించింది. గతంలో ఎన్నడూ ఇంత తక్కువ వ్యవధిలో అంత ఎక్కువ విరాళాలురాలేదని, ఆమె అభ్యర్థిత్వానికి వెల్లువెత్తుతున్న మద్దతును ఇది తెలియజేస్తోందని ఆ బృందం పేర్కొంది. అందులో 66శాతం వరకు తొలిసారిగా విరాళాలిస్తున్న దాతల నుంచే వచ్చాయని హారిస్ ఫర్ ప్రెసిడెంట్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ మైకేల్ టేలర్ చెప్పారు. వచ్చే నెల చికాగోలో నిర్వహించే డీఎన్‌సీ(డెమొక్రటిక్ జాతీయ సదస్సు)లో కమల అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. 'క్షేత్రస్థాయి కార్యాలయాలకు జనం, వలంటీర్లు పోటెత్తుతున్నారు. కమల బృందం చేతిలో డొనాల్డ్ ట్రంప్, జేడీ వాన్స్‌కు ఓటమి తప్పదు'అని టేలర్ అన్నారు. అయితే ఈ హోరాహోరీ పోటీలో గెలుపు-ఓటముల మధ్య ఓట్ల తేడా చాలా స్వల్పంగా ఉంటుందని పేర్కొన్నారు. కమలకు విశేషంగా మద్దతు పెరగడం నూతనోత్తేజాన్ని కలిగిస్తోందన్నారు. యువ ఓటర్లు, కార్మికులు, న్యాయవాదులు, బరాక్, మిషెల్ ఒబామా దంపతులు, అనేకమంది నాయకుల నుంచి కమలకు మద్దతు వెల్లువెత్తుతోందని చెప్పారు. పార్టీలోనూ ఆమె అభ్యర్థితానికి మద్దతు పెరుగుతోందన్నారు. గత వారంలోనే కమల బృందంలో 1,70,000 మంది కొత్త వలంటీర్లు చేరారని చెప్పారు. అమెరికావ్యాప్తంగా 2,300 కంటే ఎక్కువ కార్యక్రమాల ద్వారా క్షేత్రస్థాయిలో కమలకు మద్దతు కూడగడతామన్నారు. ఆన్‌లైన్, సాంప్రదాయ మీడియా ద్వారానూ ఆమెకు మద్దతు కూడగడుతున్నామని, కమల స్వయంగా టిక్‌టాక్‌లో చేరి లక్షలాదిమంది ఫాలోవర్లను పొందారని చెప్పారు.



పాపను తల్లికి అప్పగిస్తున్న వైద్యాధికారులు

మూడు గంటల్లోనే తల్లి ఒడికి

- 'అనంత' ప్రభుత్వాస్పత్రిలో పాప అదృశ్యం.. రంగంలోకి పోలీసులు
- 5 రోజుల పసికందును ఎత్తుకెళ్లిన మహిళ

అనంతపురం టౌన్, జూలై 28: అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో 5 రోజుల పసికందు కనిపించకుండా పోవడం ఆదివారం కలకలం రేపింది. పోలీసులు మూడు గంటల్లో పాపను స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం నాగలూరు గ్రామానికి చెందిన అమృత, అనిల్‌కుమార్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. అమృత మూడోసారి గర్భం దాల్చగా ప్రసవం కోసం ఈ నెల 23న అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకురాగా అదే రోజు ఆమెకు పాప పుట్టింది. ఐసీయూ నుంచి సాధారణ లేబర్ వార్డుకు రెండు రోజుల క్రితం మార్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున పసిపాప కనిపించకపోవడంతో అమృత.. గట్టిగా అరుస్తూ ఏడవటంతో ఒక్కసారిగా ఆస్పత్రిలో కలకలం రేగింది. వెంటనే వైద్యాధికారులు.. పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు ఆస్పత్రిలో సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించి, మరో బాలింతను చూడడానికి వచ్చి రాత్రి అక్కడే ఉన్న ఆమని అనే మహిళ పాపను తీసుకెళ్లినట్టు గుర్తించారు. వెంటనే డీఎస్పీ ప్రతాప్, సీఐలు క్రాంతికుమార్, ప్రతాప్‌రెడ్డి ఆమె వివరాలు సేకరించి, అదుపులోకి తీసుకున్నారు. ఆమెను విచారిస్తున్న సమయంలో అనంతపురం రూరల్ మండలం నారాయణపురం గ్రామంలోని ఓ ఇంటిలో పాపను ఉంచినట్టు ఆ ఇంటి యజమానులు.. పోలీసులకు తెలిపారు. పోలీసులు చిన్నారిని స్వాధీనం చేసుకుని, ఆస్పత్రికి తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. పాపను ఎస్ఎన్‌సీయూలో ఉంచి వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. చిన్నారి ఆరోగ్యంగా ఉన్నట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు స్టాఫ్‌నర్సులను సస్పెండ్ చేయగా.. ఓ ఎఫ్ఎన్‌ఓ, మహిళా సెక్యూరిటీ గార్డును విధుల్లో నుంచి తొలగించారు.

ముగ్గురు బిడ్డలూ దుర్మరణం!

మురారి హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం

- బైక్‌పై నుంచి పడిపోయిన వారిపై దూసుకెళ్లిన గుర్తుతెలియని వాహనం
- ముగ్గురన్నదమ్ములూ అక్కడికక్కడే మృతి
- తల్లికి తీవ్రగాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- కూలి పనులకు వెళ్లి తిరిగొస్తుండగా ఘటన



రాజు, యేసు, అఖిల్

గండేపల్లి, జూలై 28: రోడ్డు ప్రమాదం పచ్చని కుటుంబాన్ని చిదిమేసింది. ఆ నిరుపేద తల్లికి తీరని శోకాన్ని మిగిలిచ్చింది. వర్షంలో వెళ్తూ బైక్‌పై నుంచి పడిపోయిన తల్లి, ముగ్గురు కుమారుల పైనుంచి గుర్తుతెలియని వాహనం దూసుకుపోవడంతో ముగ్గురు కుమారులు అక్కడికక్కడే మృతిచెందారు. తల్లి తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామ శివారున ఆదివారం తెల్లవారుజామున ఈ ఘోరం చోటుచేసుకుంది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన నంగలం దుర్గ తన కుమారులైన నంగలం రాజు(20), నంగలం యేసు(18), నంగలం అఖిల్(10) తో కలిసి ఉపాధి నిమిత్తం అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీపాన ఉన్న కుంతలం గ్రామానికి ఈనెల 17న వెళ్లారు. పామాయిల్ గెలలు కోసే పనిలో చేరారు. అక్కడ పది రోజులు పాటు పని చేసుకుని తిరిగి తమ సొంతూరుకు శనివారం సాయంత్రం 6.30 గంటలకు తల్లితో పాటు ముగ్గురు కుమారులు పల్సర్‌బైక్‌పై బయలుదేరారు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో వారు గండేపల్లి శివారు మురారి ప్రాంతానికి రాగా వర్షం పడుతుండడంతో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. జాతీయ రహదారి కావడంతో ఆ సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం వారిపై నుంచి దూసుకెళ్లింది. ముగ్గురు అన్నదమ్ములు రాజు, యేసు, అఖిల్ అక్కడికక్కడే మృతిచెందారు. హైవే మొబైల్ పోలీసులకు అక్కడికి చేరుకుని తీవ్రగాయాల పాలైన దుర్గను రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహాలను రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జగ్గంపేట సీఐ లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దైవ దర్శనానికి వెళ్తుంటే కబళించిన మృత్యువు

- ట్రాక్టర్ బోల్తాపడి ముగ్గురు దుర్మరణం
- 11 మందికి తీవ్రగాయాలు, ఇరువురి పరిస్థితి విషమం



సంఘటన స్థలంలో బోల్తాపడిన ట్రాక్టర్, చెల్లాచెదురుగా క్షతగాత్రులు, మృతదేహాలు

బాపట్ల, జూలై 28: పోలేరమ్మతల్లికి మొక్కుబడి చెల్లించుకునేందుకు ట్రాక్టర్‌లో వెళుతున్న భక్తులు ప్రమాదానికి గురయ్యారు. ఎదురొచ్చిన బస్సును తప్పించబోయి ట్రాక్టర్ బోల్తాపడిన సంఘటనలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. బాపట్ల డీఎస్పీ సి.హెచ్.మురళీకృష్ణ కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా నగరం మండలం గట్టువారిపాలెం గ్రామానికి చెందిన గట్టు వెంకటేశ్వరమ్మ మొక్కుబడి కోసం కాకుమాను మండలం కొండపాటూరు పోలేరమ్మతల్లి గుడికి ఆదివారం బయలుదేరారు. ట్రాక్టర్‌లో వస్తుండగా కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ట్రాక్టర్ తొట్టిలో కూర్చొన్న గట్టు కోటేశ్వరరావు (65), గడ్డం శివనాగులు (60), గడ్డం లక్ష్మి(40) అక్కడికక్కడే మృతి చెందారు. మరో 11 మందికి తీవ్రగాయాలు కావడంతో క్షతగాత్రులను, మృతదేహాలను బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుల్లో ఐదుగురిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ఆసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబాలకు మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ రూ.15 వేల చొప్పున, క్షతగాత్రులకు రూ.5 వేల చొప్పున తక్షణ సాయం అందజేశారు.

మోహిత్ రెడ్డికి 41ఏ నోటీసు జారీ

- ఎస్వీయూ పోలీస్‌స్టేషన్‌లో గంటపాటు విచారణ
- జిల్లా దాటి వెళ్లరాదన్న షరతు... విడుదల
- పోలీసుస్టేషన్ ఎదుట అనుచరులతో చెవిరెడ్డి నిరసన

తిరుపతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీపై హత్యాయత్నం కేసులో నిందితుడిగా ఉన్న తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని శనివారం అర్ధరాత్రి బెంగళూరులో అదుపులోకి తీసుకున్న జిల్లా పోలీసులు ఆయన్ను ఆదివారం ఉదయం 6.50 గంటలకు తిరుపతి ఎస్వీయూ పోలీసుస్టేషన్ తీసుకువచ్చారు. సుమారు గంటపాటు మోహిత్‌ను విచారించారు. టీడీపీ నేత పులివర్తి నానీపై హత్యాయత్నం ఘటనకు సంబంధించి ఆయన ప్రమేయంపై ప్రధానంగా ప్రశ్నించారు. అలాగే దుబాయ్ ప్రయాణం గురించి కూడా ప్రశ్నించారు. అనంతరం ఎనిమిది గంటలకు 41ఏ నోటీసు జారీ చేశారు. ఎపుడు విచారణకు పిలిచినా హాజరు కావాలని, కేసు దర్యాప్తు పూర్తయ్యే వరకూ జిల్లాలోనే ఉండాలన్న షరతు విధించి విడిచిపెట్టారు. కాగా, తన కుమారుడు మోహిత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో స్టేషన్ ఎదుట అనుచరులతో కలసి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన కుమారుడిని ఏ చట్టం కింద అదుపులోకి తీసుకున్నారు? ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించారు. పులివర్తి నానీ కారుపై దాడి జరిగింది వాస్తవమేనని అంగీకరించిన ఆయన నానీపై మాత్రం దాడి జరగలేదన్నారు.

మంత్రి స్వామికి త్రుటిలో తప్పిన ప్రమాదం



ముందుకు పడబోతున్న మంత్రి స్వామి

జరుగుమల్లి (కొండపి), జూలై 28: రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామికి త్రుటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఆదివారం ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలం పాలేటిపాడు గ్రామంలోని పోలేరమ్మ తల్లి కొలుపుల కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కొందరు అమ్మవారి ఊరేగింపు ఎద్దుల బండి ముందు తమతో ఫొటో దిగాలని మంత్రిని కోరారు. ఈ క్రమంలో ఆకస్మాత్తుగా బాణసంచా శబ్దాలకు బెదిరిన ఎద్దులు ముందుకు దూకడంతో స్వామి తూలి ముందుకు పడిపోయారు. ఈ క్రమంలో మంత్రి చేతికి స్వల్ప గాయమవగా, గన్‌మన్‌తో పాటు పలువురు గాయపడ్డారు.

మంత్రాలయంలో పంప్‌హౌస్ ధ్వంసం

- 4,200 ఎకరాలకు నిలిచిన సాగునీటి సరఫరా
- కసి, కుట్ర, పగతోనే ఘాతుకం.. పోలీసులకు ఏఈ ఫిర్యాదు



పంప్‌హౌస్‌లో దుండగులు ధ్వంసం చేసిన స్టార్టర్లు

మంత్రాలయం, జూలై 28: తుంగభద్ర నది ఒడ్డున ఉన్న గురు రాఘవేంద్ర ప్రాజెక్టు(జీఆర్‌పీ)లోని పంప్‌హౌస్‌లో కీలక పరికరాలను దుండగులు ధ్వంసంచేశారు. కర్నూలు జిల్లా మంత్రాలయంలోని మాధవరం పంప్‌హౌస్‌లో రైతులకు సాగునీరు అందించేందుకు సిద్ధంగా ఉన్న బ్రేకర్లు, స్టార్టర్లు, ఇన్సులేటర్లను దుండగులు తొలగించి సుత్తితో పగులగొట్టారు. అయితే, అందులో ఏమీ దోచుకెళ్లిన దాఖలాలు లేవు. రైతులకు సాగునీరు అందకూడదన్న కసి, పగ, కుట్రతోనే ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. దీనిపై ఏఈ హరిప్రసాద్ మాధవరం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ పంప్‌హౌస్ పనులను 2005లో ప్రారంభించగా, 2013లో పనులు పూర్తిచేసి 2016 నుంచి 2021 వరకు సంబంధిత కాంట్రాక్టర్లే పర్యవేక్షించేవారు. 2019 నుంచి వైసీపీ ప్రభుత్వం పైసా నిధులు ఇవ్వకపోవడంతో జీఆర్‌పీ కనీస మరమ్మతులకు నోచుకోలేదు. ఇటీవల ఎన్నికల్లో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఈ ఏడాది ముందస్తుగా తుంగభద్ర నదికి నీటి విడుదల విషయం తెలుసుకున్న జీఆర్‌పీ ఈఈ భాస్కర్ రెడ్డి, డీఈ కృపానిధి, ఏఈ హరిప్రసాద్, లస్కర్లు రాంబాబు, రమేష్ ఈ నెల 24న మాధవరం పంప్‌హౌస్ స్టేజ్-1ను పరిశీలించారు. ఆదివారం బెళగల్, రచ్చుమర్రి, మాధవరం గ్రామాలకు చెందిన 20 మంది రైతులు నీరు విడుదల చేసేందుకు పంప్‌హౌస్ ప్రధాన డోర్‌ను తెరిచారు. అయితే, అప్పటికే వెనుక డోర్ తెరిచి ఉండటం, హెచ్‌పీ ప్యానెల్, ఎల్‌టీ ప్యానెళ్లు చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని గమనించి జీఆర్‌పీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇందులో 6.6 కేవీ మూడు బ్రేకర్లు, 33 కేవీ మూడు బ్రేకర్లు, రెండు స్టార్టర్లు, మూడు ఇన్సులేటర్లలో ఉన్న 9 పీటీలను దుండగులు సుత్తితో ధ్వంసం చేశారు. ఈ పంప్‌హౌస్ ద్వారా 4,200 ఎకరాలకు సాగునీరు విడుదలయ్యేది. 885 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన రెండు మోటార్లతో బెలగల్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయాల్సి ఉంది.

జగన్ సంపద మాత్రమే పెరిగింది.. ప్రజలకు పెరగలేదు

- జగన్ మీడియాకు సభా హక్కుల నోటీసు ఇస్తాం: యనమల

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల సీఎంగా ఉన్న సమయంలో జగన్ సంపద విపరీతంగా పెరిగిపోయింది. ప్రజల సంపద మాత్రం పెరగలేదు. తన ఆస్తులు చూసుకొని రాష్ట్రం అంతా అభివృద్ధి జరిగిందని జగన్ అనుకుంటున్నారు.' అని శాసన మండలిలో టీడీపీ పక్ష నేత, ఆర్థిక శాఖ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు వ్యాఖ్యానించారు. ప్రజలు తన పార్టీని ఎందుకు తిరస్కరించారో అర్థం చేసుకోకుండా జగన్ మాట్లాడుతున్నారని, తన హయాంలో రాష్ట్రం బ్రహ్మాండంగా అభివృద్ధి అయిందని ప్రజలను నవిష్మించాలని తాపత్రయపడుతున్నారని యనమల విమర్శించారు. 'అయినకాడికి అప్పులు తేవడం తప్ప వాటి ద్వారా జగన్ రాష్ట్రాన్ని బాగు చేసిందేమీ లేదు. ఇదే మాదిరిగా అప్పులు చేసిన కేరళ అభివృద్ధి లక్ష్యాల సాధనలో దేశంలో తొలిస్థానంలో నిలిచింది. మన రాష్ట్రం పదో స్థానానికి పడిపోయింది. అప్పులు సద్వినియోగం చేస్తే కేరళ మాదిరిగా ఏపీ అగ్రస్థానంలో ఉండేది'అన్నారు. శ్వేతపత్రాలపై ఆమోదయోగ్యం కాని భాషలో జగన్ పత్రిక రాసిన వార్తలపై సభా హక్కు ల నోటీసు ఇవ్వనున్నట్లు తెలిపారు.



తెలంగాణి కవితా సంపుటి

జూపాక సుభద్ర తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో రాసిన కవిత్వాన్ని (2010-2024) 'తెలంగాణి కైతల దొంతులు' పేరుతో పుస్తకంగా ప్రచురించారు. ఈ పుస్తకాన్ని ఆగస్టు 3 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయితీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డి. అనసూయ సీతక్క ఆవిష్కరిస్తారు. ముఖ్య అతిథి కె. శ్రీనివాస్; అధ్యక్షత జిలుకర శ్రీనివాస్; విశిష్ట అతిథులు మామిడి హరికృష్ణ, బి.ఎస్. రాములు, కంచ ఐలయ్య, సూర్యధనుంజయ, అంబటి సురేంద్ర రాజు, కొండవీటి సత్యవతి, గోగు శ్యామల, కోయి కోటేశ్వర రావు తదితరులు.

దండోరా పబ్లికేషన్స్

అంగర సూర్యారావు జయంతి సభ

అంగర సూర్యారావు 97వ జయంతి సభ ఆగస్టు 3 సాయంత్రం 5.30కు వి శాఖ పౌర గ్రంథాలయం, ద్వారకా నగర్, ఏసీ హాల్‌లో జరుగుతుంది. అంగర సూర్యారావు జీవన సాఫల్య పురస్కారాన్ని భళ్ళమూడి రామమూర్తి స్వీకరిస్తారు. అంగర సూర్యారావు రచన '60ఏళ్ళ ఆంధ్ర సాహిత్య చరిత్రలో పురిపండా' పుస్తకావిష్కరణ జరుగుతుంది. సభలో అడపా రామకృష్ణ, అత్తిలి సుధాకర్, బాదంగిర్, పి.టి. మాధవ్ తదితరులు పాల్గొంటారు.

విశాఖ రచయితల సంఘం

అడిగోపుల సంస్మరణ సభ

ఇటీవల దివంగతులైన అడిగోపుల వెంకటరత్నం సంస్మరణ సభ ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో జూలై 29 సాయంత్రం వి జయవాడలోని ప్రెస్ క్లబ్‌లో జరుగుతుంది. అడిగోపులను అభిమానించే ప్రతి ఒక్కరు ఈ సభలో పాల్గొని ఆయనకు ఘన నివాళి అర్పించవలసిందిగా కోరుతున్నాం.

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం

దీపావళి కథల పోటీ

జాగృతి వారపత్రిక, భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీకి రచనలను ఆహ్వానిస్తున్నాం. మొదటి, రెండవ, మూడవ బహుమతులు వరుసగా: రూ. 12వేలు, రూ.7వేలు, రూ.5వేలు. ఇవి కాక వెయ్యి రూపాయల చొప్పున మరొక ఎనిమిది ప్రత్యేక బహుమతులు. కథలను ఆగస్టు 31లోగా ఈమెయిల్: jagriticompetition @gmail.com కు పంపాలి. పోస్ట్/ కొరియర్ లో పంపదలిస్తే చిరునామా: 'కథల పోటీ', జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, జాగృతి భవన్, కాచిగూడ, హైదరాబాద్ - 500027కు పంపవచ్చు. వివరాలకు: 99593 10103.

కె. దుర్గారెడ్డి

ఇయ్యాల వొస్తవనుకున్న



"ఇయ్యాల వొస్తవనుకున్న..." అంటుంది అమ్మ.

అనుకున్నవి జరిగే కాలమాన పరిస్థితులు కావు; ప్రపంచం అంతకన్నా కాదు. దౌడ్ టైటిల్ సాంగ్ మన జాతీయగీతం. లౌడ్‌గా చెప్పలేని నిస్సహాయులం.

ఇల్లు రాత్రి పడుకోవడానికి మాత్రమే పనికొచ్చే లాడ్జి. ఉదయం అనేది రేపటికి తయారవ్వడానికి తగిలించుకునే బ్యాడ్జి.

మరయంత్రం మనం. తంత్రం పట్టుబడని విఫల వీరులం. వికటాట్టహాసం చేసే మనుషులకు వినోద సాధనాలం.

డస్సిపోయి ఇంటికి చేరతాం. డల్‌నెస్‌నంతా పక్కకు తోసి ఫోన్ చేసి పలకరిస్తాం కదా...

"ఇయ్యాల వొస్తవనుకున్న..." అంటుంది అమ్మ.

ఎవరి రావడం పోవడం ఇప్పుడు వాళ్ళ చేతుల్లో లేదని చెప్పడానికి గొంతు పెగలదు. అది విని కలతతో ఆమె పడే కొత్త బాధకు
కారణం కాకూడదని
మనకు మనం చెప్పుకునే సంజాయిషీలోనే...

మరోరోజు మరణిస్తుంది!

మోహన్ రుషి

సినిమా తీయగలిగే నవలలేవీ?

మూడు ప్రశ్నలు

వేణు ఊడుగుల



మలయాళం హిట్ సినిమాలు 'జల్లికట్టు', 'ఆడు జీవితం' నుంచి తమిళంలో 'అసురన్', 'పొన్నియన్ సెల్వన్' సినిమాల దాకా పుస్తకాల నుంచి అడాప్ట్ చేసుకున్నవే. ఒకప్పుడు తెలుగులోనూ పాపులర్ నవలలు కొన్ని తెరకెక్కాయి. ఇపుడు ఏదీ లేదు. పక్క రాష్ట్రాలతో పోలిస్తే తెలుగులో సినిమా - సాహిత్య రంగాల మధ్య సంబంధం ఇంత తక్కువగా ఎందుకు ఉంది?

తమిళ మలయాళ చిత్ర పరిశ్రమల్లో లిటరేచర్ - సినిమాల మధ్య అనుబంధం చాలా బలంగా, ఆత్మీయంగా ఉంది. జల్లికట్టు, పొన్నియన్ సెల్వన్, అసురన్ వంటి వైవిధ్యమైన అనుసరణలను మనం ఈమధ్యనే చూశాం. ఇలాంటి నెరెటివ్స్‌ని ఇష్టపడే ప్రేక్షకులు మన తెలుగు బాషలో కంటే ఆ రెండు రాష్ట్రాల్లో ఎక్కువగా ఉన్నారు. పూర్వం నుండే వారికి ఒక రిచ్ లిటరరీ కల్చర్, సపోర్టివ్ ఎకో సిస్టమ్ ఉంది. వీటికి తోడు సాహిత్య నేపథ్యం నుంచి వచ్చిన దర్శక నిర్మాతలు అక్కడ ఎక్కువ ఉన్నారు. ఈ కల్చరల్ ఇంటిగ్రేషన్ వల్లే వారి సినిమాటిక్ నెరెటివ్స్ ఈస్తటికల్ వాల్యూస్‌తో పరిణతి చెందాయి. ఇందుకు విరుద్ధంగా, తెలుగు సినిమాలో సాహిత్య అనుసరణలు చాలా తక్కువ. ఇందుకు తెలుగు సినిమా వ్యాపార దృష్టే కారణం. తరాలుగా ప్రేక్షకుల టేస్ట్ కూడా అలాగే షేప్ అవుతూ వచ్చింది. ఈ తరం ప్రేక్షకుల్లో ఈ 'స్ట్రీమింగ్ ఎరా' వల్ల ఫిల్మ్ లిట్రసీ పెరిగి 'ఛాయిస్ ఆఫ్ సినిమా' కొంతవరకు మారింది. ఐనా కూడా ఇక్కడ 'కథ'ని పెట్టుబడే నిర్ణయిస్తోంది. అందుకే ఇక్కడ మార్కెటబుల్ కంటెంట్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఉంటోంది. అదనంగా, సినిమాటిక్ అడాప్షన్‌కి తగిన కాంటెంపరరీ నవల కొరత కూడా ఉంది. మరీ ముఖ్యంగా మన తెలుగు ఫిల్మ్ మేకర్స్‌లో చాలావరకు సాహిత్యంతో తక్కువ రిలేట్ అవటం వల్ల కూడా లిటరరీ వర్క్స్‌ని ఐడెంటిఫై చేసి అడాప్ట్ చెయ్యటం కష్టం అవుతోంది.

"స్ట్రీమింగ్ ఎరా వల్ల పెరుగుతున్న ఫిల్మ్ లిటరసీ.." ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి? కథని పెట్టుబడి, పెట్టుబడిని రాబడి, రాబడిని ప్రజల అభిరుచి నిర్ణయిస్తున్నాయి అనుకుంటే, అల్టిమేట్‌గా ప్రజల అభిరుచి దగ్గరకే ప్రశ్న వెళ్ళి ఆగుతుంది. ప్రజల అభిరుచి మారాలంటే ఎలా?

ప్రపంచంలో జరిగిన అనేక సాహిత్య పరిణామాలకు అనుగుణంగా ఫ్రెంచ్ ఇంప్రెషనిజం, జెర్మన్ ఎక్స్‌ప్రెషనిజం, సోవియట్ మాంటెజ్, డాగ్మా 95 వంటి ఫిల్మ్ మూమెంట్స్ 21వ శతాబ్దం వరకు సాగాయి. వీటి వల్లే ఫిల్మ్ మేకింగ్ ఎప్పటికప్పుడు మార్పుచెందుతూ వచ్చింది. ముఖ్యంగా ఇప్పుడు ఉన్న "స్ట్రీమింగ్ యుగం" వల్ల ఫిల్మ్ మేకింగ్, ఫిల్మ్ వ్యూయింగ్ రెండు రంగాలలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. వైడ్ రేంజ్ గ్లోబల్ కంటెంట్‌ని చూడ్డానికి ప్రేక్షకులకు గొప్ప ఆక్సెస్ దొరికింది. ఈ షిఫ్ట్ ప్రేక్షకులను మరింత వివేకవంతంగా ఇన్ఫ్లుయెన్స్ చేసే స్థాయికి వెళ్లింది. మన తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఇప్పుడిప్పుడే ఈ మార్పు కనిపిస్తోంది. కథ - పెట్టుబడి - రాబడిల సైకిల్ పూర్తిగా ఈ మార్పు మీదే ఆధారపడి ఉంది. అందుకే ప్రేక్షకుల అభిరుచిని మెరుగుపరచేందుకు వారికి విభిన్న సినిమాటిక్ స్టైల్స్, టెక్నిక్స్ గురించి అవగాహన కల్పించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. అదనంగా ఫిల్మ్ ఫెస్టివల్స్, వివిధ ఆర్ట్ ఫామ్స్‌ని హైలైట్ చేసే చర్చల ద్వారా సినిమాటిక్ కల్చర్ డెవలప్ అవుతుంది. భవిష్యత్తులో తెలుగు సినిమా 'కథ' సబర్బన్ లైఫ్స్‌లో లొకేట్ అవుతుంది. రకరకాల ప్రాంతాల, మనుషుల బతుకులను అడ్రస్ చేసే వేదికవుతుంది. తమిళ మలయాళ సినిమాల్లా తెలుగు సినిమా కూడా డైవర్సిటీతో వికసిస్తుంది.


సాహిత్యాన్ని సినిమాకి అడాప్ట్ చేసుకునే దిశగా ఒక సినిమా దర్శకుడిగా మీ ఆలోచనలు ఎలా ఉన్నాయి. మీరు చదివిన తెలుగు సాహిత్యంలో సినిమాకు అడాప్ట్ కాగలిగే పుస్తకాలేమిటి?


సినిమా దర్శకుడిగా, నేను సాహిత్యాన్ని సినిమాకి అడాప్ట్ చేసుకోవడం చాలా సున్నితమైన, సృజనాత్మకమైన ప్రక్రియగా భావిస్తాను. మంచి సాహిత్యంలో కథా విస్తృతి, లోతైన తాత్వికత, భావోద్వేగాలు గాఢంగా ఉంటాయి. అలా అని ప్రతీదీ సినిమాకి అనువైనది కాకపోవచ్చు. మనం ఎంచుకునే సాహిత్యంలో ఉండే పాత్రలు రక్త మాంసాలతో సజీవంగా, శక్తివంతంగా ఉండాలి. కథ వాస్తవికంగా, భావోద్వేగాలతో ఉంటూనే ఆసక్తికరంగా ఉండాలి. సెన్స్ ఆఫ్ ఎమర్జెన్సీ ఉండాలి, లేకపోతే క్రియేట్ చేసుకోవాలి. సోషల్ రియాలిటీస్‌ని ఆవిష్కరించే కథా వస్తువులైతే మరీ మంచిది. నేను చదివిన తెలుగు సాహిత్యంలో, కల్యాణ్ రావు రాసిన 'అంటరాని వసంతం', కేశవరెడ్డి నవలలు సినిమాటిక్ అడాప్టేషన్‌కి ఉత్తమంగా సరిపోతాయి. ఈ కథలు మన సంస్కృతిలో ద్రవిస్తూనే, ఒక ప్రవాహంలా వేగంగా సాగిపోతూ ఉంటాయి. గ్లోబల్ ఆడియన్స్‌ని ఆకట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటాయి. ఈ కథలు మనుషుల అనుభవాలపై, సోషల్ డైనమిక్స్‌పై డిఫరెంట్ పెర్స్పెక్టివ్‌ని అందిస్తాయి. భవిష్యత్తులో నేను కూడా ఒక నవల ఆధారంగా సినిమా చేయబోతున్నాను. అది ప్రేక్షకులకు ఒక విశేష అనుభవాన్ని అందించే అరుదైన సినిమా అవుతుంది.

(వేణు ఊడుగుల కవి, సినిమా దర్శకుడు)

నా మొదటి పుస్తకం

నన్ను లెఫ్టిస్ట్‌ని చేసింది






కె. శివారెడ్డి

నా తొలి కవితా సంపుటి 'రక్తం సూర్యుడు' గురించి ఆంధ్రజ్యోతి మిత్రులు నాలుగు మాటలు రాయమంటే నా మనసు గతంలోకి వెళ్ళిపోయింది. ఒక సంక్షోభ దశలో, నక్సల్బరీలో మొదలైన సాయుధ పోరాట ఉద్యమం ఉత్తరాంధ్ర దాకా పాకి గోదావరి లోయలోకి ప్రవేశించిన తొలి రోజుల్లో, 1966లో నేను హైదరాబాద్ వచ్చాను. అప్పటికి దాకా పద్యాలు రాసుకునేవాడ్ని. రాజకీయాలతో అంతంతమాత్రం పరిచయం ఉన్న నేను హైదరాబాద్‌కి వచ్చీ రాగానే సరాసరి విద్యార్థి ఉద్యమంలోకి ప్రవేశించాను. పాత వాసనలు వదిలించుకున్న తర్వాత కొత్త రాజకీయాల సాయుధ పోరాట ఉద్యమం నా దృక్పథ, కవిత్వ రూప రేఖల్ని మార్చివేసింది. 70లలో విరసం ప్రారంభమైంది. అది కూడా నాకు పూర్తి స్ఫూర్తి. విరసంతో పుట్టిపెరిగిన వాడ్ని అని చెబుతుండేవాడ్ని. అప్పటిదాకా రాసి పత్రికల్లో అచ్చయిన పద్యాల్నించి ఏరి వాటిని అన్ని రకాల మార్పుల తర్వాత 'రక్తం సూర్యుడు'గా అచ్చేశాను. ఈ పుస్తకం ముఖచిత్రం డిజైన్‌కు శీలా వీర్రాజుగారు పడ్డ శ్రమ మామూలైంది కాదు. ఖైరతాబాద్‌లోని మా ఇంటికి వచ్చి నన్ను దగ్గర్లో ఉన్న ఫొటో స్టూడియోకి తీసుకుపోయి రకరకాల భంగిమల్లో ఫొటోలు తీయించి దాంట్లో ఒకటి సెలెక్ట్ చేసి మెరుగులు దిద్ది ఆ కవర్ ఫొటో తయారు చేశారు. బ్రౌన్ పేపరు మీద 500 కాపీలు, ప్యూర్ వైట్ 90 జిఎస్ఎమ్ మీద మరో 500 కాపీలు అచ్చు వేశాం. ఆ కాయితం కోసం సికింద్రాబాద్ అంతా నన్ను తిప్పి విసిగించారు. అక్కడ్నించి పది రీముల పేపర్‌ని ఆటోలో వేసుకొచ్చి, ఖైరతాబాద్‌లో ఉన్న వరలక్ష్మి ప్రెస్‌లో వేశాం. వీర్రాజు గారు లేకపోతే ఆ పుస్తకం అలా వచ్చేది కాదు. 1973లో అచ్చయిన ఆ పుస్తకం 74లోనో 75లోనో ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు పొందింది. కుందుర్తి గారు పేపరుకి ఆ సమాచారాన్ని ఇస్తూ నాకు 'రాడికల్ పొయెట్' అని కితాబు ఇచ్చారు. నూట పదహారు రూపాయలు బహుమతి ఇచ్చారు. ఆంధ్రజ్యోతిలో 'నిజం', విశాలాంధ్రలో అంపశయ్య నవీన్ మంచి రివ్యూలు రాశారు. ఈ స్పందనలన్నీ ఆనాటి పరిస్థితుల్లో నాకు గొప్ప ఊతమిచ్చాయి. అనుకున్నదానికంటే ఎక్కువ రెస్పాన్స్ వచ్చింది. వెనక్కి తిరిగి చూసుకుంటే, ఆ కవిత్వం నా ఐడియలాజికల్ స్టాన్స్‌ని మార్చింది. నన్ను లెఫ్టిస్ట్‌ని చేసింది. అది నా బీజప్రాయపు దశ. నా పునాది. అక్కడి నుంచి ఈనాటి శివారెడ్డి లేచాడు. నలుదిక్కులకీ విస్తరించాడు. అప్పటి చాలామంది మిత్రులు ఇప్పటికీ దాన్ని చాలామంది పుస్తకంగా గుర్తు పెట్టుకున్నారు. ఆ సమయం, ఆ సందర్భం, ఆ కాలం గొప్పతనమది. అప్పుడు అక్కడ ఉండటమే నేను చేసుకున్న అదృష్టం. నేను ఆ కాలపు స్ఫూర్తిని పూర్తిగా అందుకున్నాను అనుకుంటాను. అక్కడి నుంచి ఈనాటి శివారెడ్డి చాలా దూరం ప్రయాణం చేశాడు.

"కవులు మర్యాదస్తులైపోయారు"

\- జూకంటి జగన్నాథం



జీవితాన్నీ, సాహిత్యాన్నీ వేరు వేరుగా దర్శించని కవి జూకంటి. నడి చౌరస్తాలో నిటారుగా సామాన్యుడి వైపు నిలబడి నిరంతరం ప్రశ్నిస్తారు, కవిత్వం ద్వారా నిఖార్సైన ధిక్కార స్వరం వినిపిస్తారు. ప్రపంచీకరణ, పెట్టుబడి మనిషిని నలువైపుల నుండి దాడిచేస్తూ తల్లడం మల్లడం చేస్తున్న సందర్భాన్ని తన సాహిత్యం ద్వారా బట్టబయలు చేస్తున్నారు. ఈ ఏడాదికి దాశరథి కృష్ణమాచార్య పురస్కారం అందుకున్న సందర్భంగా ఆయనతో ఇంటర్వ్యూ...

మీ జీవిత నేపథ్యం సాహిత్య ప్రస్థానం?

నేను హైస్కూల్ మాత్రమే చదివాను. మా ఊరు తంగళ్ళపల్లికి సమీపంలో ఉన్న సిరిసిల్ల పట్టణ గ్రంథాలయం లోని పుస్తకాలను జిజ్ఞాసతో దాదాపుగా చదివాను. అలాగే సినారె అంతేవాసి కనపర్తిగారి సొంత గ్రంథాలయంలో అభ్యుదయ సాహిత్యాన్ని చదివాను. నేను మిక్కిలి గౌరవించే నాటి సీనియర్ కవి జక్కని వెంకటరాజం, నిజాం వెంకటేశం గారల మార్గదర్శనం చేయూతతో సామాజిక రాజకీయ ఆర్థిక దృక్పథంతో నా చుట్టూ ఉన్న సమాజాన్ని వ్యక్తులను అధ్యయనం చేశాను. ముఖ్యంగా దేన్ని రాయాలి అనే దాని కన్నా ఏది రాయకూడదనే దాన్ని నేర్చుకున్నాను. దేశంలో అత్యవసర పరిస్థితి 1975-1977ల పిదప ఒక స్పష్టమైన ప్రజా సంస్కృతి దృక్పథంతో నిబద్ధతతో నా సాహిత్య జీవన గమనాన్ని కొనసాగిస్తూ వస్తున్నాను.

దేశంలో 90వ దశకంలో మొదలైన ప్రపంచీకరణ పరిణామాలను చూసిన మొట్టమొదటి కవి మీరు. ఆ పరిణామాలు మిమ్మల్ని ఎలా ప్రేరేపించాయి?

1991లో నాటి కేంద్ర ప్రభుత్వం దేశీయ మార్కెట్‌ను ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానించింది. తద్వారా అప్పుడు ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ (ఐఎంఎఫ్) గాట్, ప్రపంచ బ్యాంకు, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, ఎంఓయు లు, కన్సల్టెన్సీలు, క్విడ్ ప్రో కోలు... ఇలాంటి కొత్త పదాలు దేశ సామాజిక నిఘంటువులోకి వచ్చిచేరాయి. కవులు మర్యాదస్తులైపోయారు, మేధావులు మెతక వైఖరి అనుసరించారు. మీడియా కార్పోరేటీకరణ జరిగి సమాజానికి పూడ్చలేని నష్టం జరిగింది. ఇటువంటి దశలో గ్రామీణ మూలాల నుంచి ఎదిగి వచ్చిన సృజనకారునిగా 1986 నుండి 1993 వరకు మనిషి అతలాకుతులమై కోల్పోతున్న పరాయికరించబడిన విలువలను వెతికి పట్టుకునేందుకు రాసిన కవిత్వాన్ని 'పాతాళగరిగె', 'ఇండియా ప్రైవేట్ లిమిటెడ్', 'వాస్కోడిగామా డాట్ కామ్'లతో పాటు ఇప్పటివరకు 16 సంపుటాలను తీసుకువచ్చాను. నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వాలు అనుసరిస్తున్న లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్.పి.జి.) వలన గ్రామీణ జీవన విధానం, సంస్కృతిలో ఊహించని అంతరాలు పెరిగాయి. గ్రామీణ ప్రాంత మూలాల నుంచి వచ్చిన కవిగా కరిగిపోయి కదిలిపోయి కన్నీళ్ల పర్యంతమై నన్ను నేను మట్టిని మర్లేసుకుని కాళ్లతో తొక్కి కుమ్మరి సారెపై సున్నితమైన భావన కళాకృతులను వినిర్మించాను. అది నేటికీ రెలవెంట్‌గా అనేక వాదాల పాయల రూపంలో ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతూనే ఉంది. చేవ ఉన్న కవికి ఇది సకాలం. యావ ఉన్న కవికి ఫ్రాంచీస్ అసందర్భ సమయం.

సామాజిక ఆర్థిక రాజకీయ సాంకేతిక రంగాలలో వేగంగా మారుతున్న వాతావరణం, సాహిత్యంలో దాని ప్రతిఫలనాలను మీరు ఏ విధంగా చూస్తారు?

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞాన శాస్త్రీయ సౌకర్యాలను వాడుకుంటూనే, అందిపుచ్చుకుంటూనే మనిషి మొద్దుబారి పోయి అశాస్త్రీయంగా గతంలో చింతిస్తూ బతుకుతున్నాడు. పక్షు వినియోగదారుడిగా అందమైన ప్యాక్ బార్‌కోడ్‌లో తన విలువను నిక్షిప్తం చేసుకుని సూపర్ బజార్లో లేబర్ అడ్డాలలో గోస గోసోలే కూలీగా నిలబడుతున్నాడు. ఇది అత్యంత విషాదకరం. సాహిత్యంలో వీటి బింబ ప్రతిబింబాలు భళ్ళున ముక్కలైన దర్పణంలో అనేక విధ్వంస దృశ్యాలుగా విభజించబడుతున్నాయి. అందుకే కవి రచయిత వెనులు బాటు గతంలోకి వెన్నుచూపి పారిపోతున్నాడు. ఒక ప్రాయోజకత్వం ఊడిగం చేస్తున్నాడు. అందుకే అన్ని వాదాలు మేన్‌స్ట్రీమ్ రణస్థలంలో ఐడెంటిటీ సంక్షోభంలో సంక్లిష్టంగా తెంపులు తెంపులుగా పెనుగులాడుతున్నాయి. కమ్యూనిస్టు మేనిఫెస్టోలో ఉటంకించిన విధంగా మేధావులు కవులు రచయితలు డాక్టర్లు ఇంజనీర్లు ప్రభుత్వ ఆస్థానంలో కొలువు తీరడం వైపు మొగ్గు చూపుతున్నారు. దేశాల మధ్యనే కాదు మనిషికి మనిషికి మధ్య ఒక ఉద్రిక్త ఆందోళనకర యుద్ధంగా విపరిణామం చెందుతుంది.

ఇటీవల కవిత్వం, ఇతర సాహిత్య ప్రక్రియలు నోస్టాల్జియా వైపు మొగ్గు చూపడంపై మీ దృక్కోణం?

వర్తమానం విసిరిన సవాళ్లను స్వీకరించలేని, నిలబడలేని, కలెబడలేని సృజనకారుడికి ఒక కన్వీనియంట్ స్థలం నోస్టాల్జియా. అన్ని సాహిత్య ప్రక్రియలు నిమాయిష్‌లో మనిషి కళ్ళల్లో దుమ్ము కొట్టి పురావస్తువుగా రూపెత్తుతున్నాయి. మళ్లీ దీనికి కారణాలు అకారణాలు కూడా ప్రపంచీకరణ చేనులో బెరికి మొక్కలుగా ఏపుగా పెరిగి మోస పుచ్చుతున్నాయి. సాహిత్యంలో దృక్కోణాన్ని ఆర్థిక సామాజిక రాజకీయ అధ్యయనంతో ప్రాంతీయ జాతీయ అంతర్జాతీయ పరిస్థితులను కవీ రచయిత అవగాహన ఆవాహన చేసుకుంటేనే నేటి సాహిత్యంలో మూలాలు దొరుకుతాయి. అందుకోసం నేడు తనను తను పోగొట్టుకొని వెతుక్కుంటున్నాడు. అందుకోసం సమాజానికి రాజకీయాలకు అతీతం కాని కవిత్వం జవసత్వాలను కన్నీటి చెమ్మను కాకుండా ఒకే ఒక్క చెమక్కును కవిత్వంగా ఫేస్‌బుక్‌లో బ్లాగులలో వాట్సాప్ గ్రూపుల్లో జూమ్ మీటింగ్‌లో మూకుమ్మడిగా ఆత్మహననంలోకి యాంత్రికంగా యాత్రిస్తున్నాడు. చూస్తూ చూస్తుండగానే దీపం చేతిలో పట్టుకొని బాయిలో పడుతున్నాడు.

> **వర్తమానం విసిరిన సవాళ్లను స్వీకరించలేని, నిలబడలేని, కలెబడలేని సృజనకారుడికి ఒక కన్వీనియంట్ స్థలం నోస్టాల్జియా. సాహిత్యంలో దృక్కోణాన్ని ఆర్థిక సామాజిక రాజకీయ అధ్యయనంతో ప్రాంతీయ జాతీయ అంతర్జాతీయ పరిస్థితులను కవీ రచయిత అవగాహన ఆవాహన చేసుకుంటేనే నేటి సాహిత్యంలో మూలాలు దొరుకుతాయి.**

2024 డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య పురస్కారం అందుకున్న సందర్భంగా మీ ప్రతిస్పందన?

దాశరథి అవార్డు నా బాధ్యతను సమాజం పట్ల నిబద్ధతను మరింత పెంచిందనుకుంటున్నాను. కొంచెం ప్రజాస్వామ్య స్వేచ్ఛ ప్రాణవాయువు ఊపిరి ఆడుతున్న సందర్భంలో ఈ అవార్డు గ్రహించడం నాకు అత్యంత సంబురాన్ని కలిగించింది.

ఇంటర్వ్యూ **మద్దికుంట లక్ష్మణ్**

94416 77373

ప్రియ పద్యం

analysis

1.
ఈ శవాగారపు గోడల మీదే పారాడుతున్నరా తండ్రీ
జీనా కహా? మర్నా కహా?
మహా దిగ్మండలమంతా మరణపు వాసన
వయోలిన్ తీగల కల ఆమె జ్ఞాపకమై
వెంటాడుతూనే ఉంటే
భయభయంగా అమ్మ కొంగులోకి ముడుచుకుంటున్న...

2.
కబూతర్ ఖానాల రెక్కతెగిన పావురమై
పెనుగులాడిన నా రక్తపు నమూనా
వెతుక్కుంటూ, వెతుక్కుంటూ వస్తాడా ఒక
అలెక్స్ హేలీ ఏనాటికైనా?
నిద్రలోకి తెరుచుకోవు కండ్లు
డొక్కలోకి ముడుచుకురావు మోకాళ్ళు
రగిలి రగిలీ
దుఃఖ వలపోతల గుండెకాయ ఒక్కటే బెంగటిల్లి
కురిసిన వానలన్నీ కాగితం పడవలై
ఏ గలివర్ గాన్ని ఏ తీరానికి చేర్చినవో
లిల్లీపుట్ దీవులల్ల మహాకాయున్నయి
వెతికి వెతికి ఇట్లా....

3.
మెట్రోరైలు వంతెన కింద ఈ ఉక్కపోత రాత్రి
చెరువు నీల్లల్ల అల్లి పువ్వు వాసనై ఆమె కల
బీడీ వాసన పద్యమై ఆమె నవ్వు
సినీమాక్స్ లోంచి తెరలు తెరలుగా ఆమె స్వరం
సమస్తాధార భూమండలమంతా ఒక్కసారిగా
నా ఒడిలోకి చేరినట్టు
ఫ్రాయిడోషోలిద్దరూ ఫుట్పాత్ మీద నిదురిస్తున్న పిల్లలై...
ఎవరినీ ప్రేమించలేక నన్ను నేను ద్వేషించనూ లేక
రెండో ప్రతిపాదన చేయువాడేవాడునూ కనరాక
త్రోవ నుంచీ తావో (Tao) దాకా తాగి తాగి
నన్ను నేను విశ్లేషించుకొని,
నన్ను నేను విభాగించుకొని
నాతో నేనే విభేదించుకొని....

4.
ఇక ఇప్పుడంతా ఒకే పదం
ఇక ఇప్పుడు జీవితమంటే ఒకే వాక్యం
ఇక మొత్తంగా బతుకంటే...
చీకటీ వెలుగు కలిసిపోయిన light pollution
ద్వైతాద్వైతాల యుద్ధరంగమై నెత్తిన ఎత్తిన బోనపుకుండ
జహన్నుమ్, జన్నత్ లదాకా
పక్కటెముకల మీదుగా చర్మాన్ని చీల్చిన మోహర్రమ్ వేడుక
ఈ నగరమంతా పండీ పండని వగరురుచుల
సీమచింతకాయ...

నరేష్కుమార్ సూఫీ

95736 09460



నరేష్కుమార్ సూఫీ ఈ కాలపు కవి. వాస్తవంలో జీవిస్తూ వాక్యానికి ఎక్కడా సొగసు అంటనీయకుండా నిశ్చలమైన, నిక్కమైన వాక్యాన్ని రాయడం అతని శైలి. మనిషి జీవిత ప్రయాణంలో ఎన్నోసార్లు దుఃఖాన్ని భరిస్తూ జీవితాన్ని వెళ్లదీస్తూ ఉంటాడు, సూఫీ వాళ్ళందరి తరపున తానొక్కడై నిలబడి ఈ 'analysis' కవితను బహిరంగంగా చదివి వినిపిస్తున్నాడా అనిపిస్తుంది. అమ్మకొంగులోకి ముడుచుకోవడం, రక్తపు నమూనాలను వెతుక్కుంటూ వెళ్లడం, సమస్త భూమండలం ఒక్కసారిగా ఒడిలోకి చేరినట్టు కలగనడం, ఇదంతా జ్ఞాపకాల నుంచి నడుస్తూ వర్తమానం మీదుగా భవిష్యత్ తలపోతల భావ సంఘర్షణ.

సరిగ్గా చూస్తే తప్ప ఈ కవితా వైశాల్యాన్ని మనం ఊహించలేం. కాల్పనిక క్యారెక్టర్‌ని కాగితం పడవ మీద తీరాలని చేర్చడంలో కవి ఊహని మెచ్చుకోకుండా ఉండలేం. ఇందులో ఉన్న ఆమె మనకి చెరువులో పూసిన అల్లిపూవు వాసన వేస్తుంది. ఇటువంటి అరుదైన వ్యక్తీకరణ గుండెల్లో భారంతో కూడిన దిగులు అనుభవం ఉంటే తప్పా అది కాగితం మీద కవితలా మారదు.

కవి తనని తనతో విభేదించుకుంటూ తన ప్రేమకి తనకి ఎదురైన ప్రేమరాహిత్యానికి మధ్యలో నలిగిపోయిన గుండెని ప్రపంచానికి చూపిస్తాడు. జీవితంలో దుఃఖమొక్కటే ఉందా ఆశ లేదా అని అడిగే ప్రశ్నకి ఆఖరి లైన్‌ని సమాధానంగా ఇస్తాడు. హైదరాబాద్ జీవితం, పక్కా తెలంగాణ భాషతో కూడిన భావ సాంద్రత ఊపిరి సలప నివ్వదు. జీవితం అంటే చీకటి వెలుగు కలిసిన లైట్ పొల్యూషన్ అనే మాట వెనక ఉన్న జీవన తాత్పర్యం అర్థం ఐతే ఈ కవిత పండినట్టే, ఈ కవి మనకి అందినట్టే.



అనిల్ డ్యాని

97033 36688

(ఈ 'ప్రియపద్యం' శీర్షికలో సాహిత్యకారులు తమకు నచ్చిన ఇటీవలి కవిత ఒకటి ఎన్నుకుని ఎందుకు నచ్చిందో వివరిస్తారు.)

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు

సోమవారం 29 జూలై 2024





భారీ సొర..!

గిలకలదిండి జాలర్లకు చిక్కిన సొర చేప

మచిలీపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం జాలర్లకు భారీ సొరచేప చిక్కింది. గిలకలదిండి హార్బర్ నుంచి సోనాబోటులో సముద్రంలో చేపల వేటకు వెళ్లిన క్యాంప్‌బెల్‌పేట జాలర్లకు టన్నున్నర బరువున్న ఈ చేప చిక్కింది. దీనిని అతికష్టం మీద క్రేన్‌సాయంతో ఆదివారం హార్బర్‌కు చేర్చారు. ఆయుర్వేద మందుల్లో వాడే పదార్థాలు ఉంటాయనే ఆశతో దీనిని కోసి చూశారు. అవేమీ లేకపోవడంతో పాటు మాంసం రబ్బరు మాదిరిగా ఉండి తినడానికి పనికిరాదని తెలుసుకుని నీటిలో పడేశారు. సాధారణంగా ఇలాంటి చేపల్లో నల్లబంగారంగా పిలిచే ఔషధ గుణాలున్న పదార్థం ఉంటుందని, ఈ తరహా చేపలు జాలర్లకు అరుదుగా దొరుకుతాయని స్థానిక మత్స్యకారులు చెబుతున్నారు.









కొండంత భక్తి

ఇంద్రకీలాద్రి భక్తులతో కిటకిటలాడింది. ఆషాఢ మాసం.. అందునా ఆదివారం జగన్మాతను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. సారె తీసుకొచ్చిన భక్తులతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. విజయ వాడ నగర పోలీసుల తరఫున పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబు దంపతులు ఆదివారం రాత్రి అమ్మవారికి సారె సమర్పించారు. డీసీపీలు గౌతమి శాలి, ఉదయరాణి, హరికృష్ణ తదితరులు సీపీ వెంట నడిచారు.



కబ్జాకు గురైన 2 వేల గజాల ఇరిగేషన్ స్థలమిదే..

బుడమేరును మింగేసిన జలగ..!

అధికారాన్ని అడ్డం పెట్టుకొని రూ.కోట్ల విలువ చేసే బుడమేరు స్థలాన్ని జలగలా మింగేశాడు ఓ వైసీపీ నాయకుడు. మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు అండతో, మరో మాజీమంత్రి జోగి రమేశ్ అగ్రి భూముల అక్రమ రిజిస్ట్రేషన్ల కేసులో ఉన్న సర్వేయర్ సహకారంతో రూ.10 కోట్లకుపైగా విలువ చేసే ఇరిగేషన్ స్థలాన్ని దర్జాగా కబ్జా చేశాడు. రోజుల వ్యవధిలో ఆ ఇరిగేషన్ స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి, యథేచ్ఛగా మట్టి తోలించి, మెరక చేసేసి, రూ.5 కోట్లకు బేరం పెట్టేశాడు.

2 వేల గజాల బుడమేరు స్థలాన్ని కబ్జా చేసిన వెలంపల్లి అనుచరుడు

మార్కెట్ రేటు రూ.10 కోట్ల పైమాటే

- కబ్జా చేసిన స్థలాన్ని మెరక చేసి రూ.5 కోట్లకు బేరం
- మామూళ్ల మత్తులో కన్నెత్తి చూడని ఇరిగేషన్ అధికారులు
- నకిలీ పత్రాలు సృష్టించడంలో చక్రం తిప్పిన సర్వేయర్
- జోగి రమేశ్ భూ ఆక్రమణ కేసులోని సర్వేయరే..

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/అజిత్‌సింగ్‌నగర్) : పాలఫ్యాక్టరీ వంతెన దిగిన తర్వాత, ప్రధాన రహదారి వద్ద ఉన్న వైవీ రావు ఎస్టేట్ మెయిన్ గేటు వెంబడి అంతా బుడమేరు స్థలం ఉంది. దీనిపై కన్నేసిన వైసీపీ నాయకుడు 'జల'గలా తన 'సూత్రం' పాటించి కబ్జా చేసేశాడు. వైవీ రావు ఎస్టేట్ మెయిన్ రోడ్డు వెంబడి మార్కెట్ విలువ సుమారు గజం రూ.50 వేల పైమాటే ఉంది. ఇక్కడ దాదాపు 2000 గజాలకు నకిలీ పత్రాలు సృష్టించి ఇరిగేషన్ స్థలాన్ని కబ్జా చేసేయడం గమనార్హం. దీని విలువ రూ.10 కోట్ల పైమాటే. ఇంతటి విలువైన భూమిని ఆక్రమించి, సగం రేటుకే అంటే రూ.5 కోట్లకే మార్కెట్లో అమ్మకానికి పెట్టేశాడు. కారుచౌకగా మెయిన్ రోడ్డుపై భూమి రావడంతో వ్యాపారులు ఈ భూమిని కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

సర్వే నెంబర్లు మార్చి..

వైవీ రావు ఎస్టేట్ మెయిన్ గేటు వెంబడి కొద్దిభాగం 68వ సర్వే నెంబర్‌లో ఉంటుంది. మిగిలిన భాగమంతా 69వ సర్వే నెంబర్‌తో ఉంది. ఈ 69వ సర్వే నెంబర్‌లో మొత్తం 2 ఎకరాల 57 సెంట్లు బుడమేరు పరివాహక ప్రాంతమే. అయితే, 68వ సర్వే నెంబర్‌లో రోడ్డు వైండింగ్‌కు పోగా, మిగిలిన అరకొర స్థలాల యజమానుల వివరాలను తెలుసుకున్న సదరు వైసీపీ నాయకుడు బఫర్‌జోన్‌లో ఎందుకూ పనికిరాని వాటిని గజం రూ.10 వేల చొప్పున కొనుగోలు చేశాడు. 69వ సర్వే నెంబరులో ఉన్న బుడమేరు ప్రాంతమంతా ఆక్రమించేసి ప్రస్తుతం వ్యాపారం చేస్తున్నాడు. బుడమేరుకు చెందిన ఈ 69వ సర్వే నెంబర్‌ను 68వ సర్వే నెంబర్‌గా మార్చి సర్వే సర్టిఫికెట్ తీసుకునేందుకు రెవెన్యూ అధికారులకు లక్షల రూపాయలు ఎరగా వేసినట్లు తెలిసింది. మెయిన్ రోడ్డుపై ఇంత పెద్ద ఎత్తున ఇరిగేషన్ భూమి కబ్జాకు గురవుతున్నా సంబంధిత ఇరిగేషన్ విభాగం అధికారులు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. ఎవరి స్థాయిలో వారికి కాసులు ముట్టడంతో వారెవరూ ఇటువైపు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ తంతు మొత్తం వైసీపీ అధికారంలో ఉన్నప్పుడే ముగించేశారు.

జోగి రమేశ్ కేసులో ఉన్న సర్వేయరే..

అంబాపురం గ్రామ పరిధిలో సీఐడీ అటాచ్‌మెంట్‌లో ఉన్న అగ్రిగోల్డ్ భూముల కేసులో జోగి రమేశ్ కుటుంబ సభ్యులకు సహకరించారని ఆరోపణలు ఎదుర్కొన్న సర్వేయరే ఈ ఇరిగేషన్ భూముల కబ్జాలో వైసీపీ నాయకుడికి కూడా సహకరించినట్లు తెలిసింది. ఈ భూములతో పాటు వీటి పక్కనే ఉన్న మరికొన్ని భూముల కబ్జాకు వీరు రంగం సిద్ధం చేశారని, ఈలోగా అధికారం పోవడం, మాజీమంత్రి జోగి రమేశ్ వ్యవహారం బయటకు రావడంతో ప్రస్తుతానికి ఈ రెండు వేల గజాలను అమ్మి సొమ్ము చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు.

వెలంపల్లి అండతోనే..

వన్‌టౌన్‌లోని కేఎల్‌రావు నగర్ ప్రాంతానికి చెందిన ఈ జలగ వైసీపీ అధికారంలోకి రాగానే రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో సింగ్‌నగర్ ఫ్లైవుల రోడ్డు వైపు అడుగుపెట్టాడు. మాజీమంత్రి వెలంపల్లి పేరు చెప్పి ప్రభుత్వ స్థలాలు, ఎండోమెంట్స్, ఇరిగేషన్ భూములతో పాటు గొడవల్లో ఉన్న స్థలాలపై ఆరా తీయడం, వాటికి నకిలీ పత్రాలు సృష్టించడం, తగాదాల్లో ఉన్న భూములను గుర్తించి, వారిని బెదిరించి, తక్కువ ధరకు కొట్టేయడం ఇతనికి వెన్నతో పెట్టిన విద్య. వెలంపల్లి దేవదాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో విజయవాడ కార్పొరేషన్, అంబాపురం పంచాయతీల్లో ఉన్న ఎండోమెంట్స్ భూములను కాజేసేందుకు ఈ జలగ తీవ్రంగా ప్రయత్నించింది. అధికారం చేతిలో ఉండటం, అధికారులకు డబ్బు ఎర వేయడంతో ఇతని అక్రమాలకు అడ్డు అదుపూ లేకుండాపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, ఇరిగేషన్ విభాగ ఉన్నతాధికారులు దీనిపై దృష్టిసారించి ప్రభుత్వ భూములను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

అసైన్డ్ భూములపై హక్కులు కల్పించండి

టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్న పేదలు

- వైసీపీ ఉత్తుత్తి గజిట్‌తో మభ్యపెట్టింది
- ఈ ప్రభుత్వమైనా నిషేధాన్ని తొలగించాలని వేడుకోలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అసైన్డ్ ఇళ్ల పట్టాలు, సాగు భూములకు యాజమాన్య హక్కులు కల్పించి, నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని ఉమ్మడి కృష్ణాజిల్లా వాసులు కోరుకుంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ విషయంలో ఒక అడుగు ముందుకేసినా అధికారులు అమలు చేయలేదని, ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వ హయాంలో గజిట్ నోటిఫికేషన్ ఇచ్చినా అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ముందు వైసీపీ నేతల ప్రయోజనాల కోసం ఈ గజిట్ తీసుకొచ్చారే తప్ప నిజమైన పేదలకు మాత్రం అన్యాయం జరిగిందంటున్నారు. రెవెన్యూ సంబంధిత అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం సమీక్షించనున్న నేపథ్యంలో ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరుకుంటున్నారు. తద్వారా ప్రభుత్వానికి ఆదాయంతో పాటు దశాబ్దాలుగా నిరర్థక ఆస్తులుగా మిగిలిపోయిన వాటికి విలువ పెరుగుతుందని చెబుతున్నారు.

ఈసారైనా అమలు చేయండి

ఉమ్మడి కృష్ణాజిల్లాలో అసైన్డ్ ఇళ్ల పట్టాలు పొందినవారు ఒక్కో నియోజకవర్గానికి దాదాపు 8 వేల మందికి పైగా ఉన్నారు. వీరిలో సింహభాగం ఇళ్ల పట్టాలు పొందినవారే. 1991వ సంవత్సరం నుంచి పేదలకు ఆవాస స్థలాలు ఇచ్చారు. అప్పట్లోనే టీడీపీ ప్రభుత్వ హయాంలో లే అవుట్లు వేసి మరీ ప్లాట్లను ఇచ్చారు. అవి ఇప్పుడు అభివృద్ధి చెందిన కాలనీలుగా మారాయి. కానీ, 20 ఏళ్లు కావస్తున్నా.. ఇంకా అసైన్డ్ భూములుగానే ఉన్నాయి. పదేళ్లు దాటిన ఇళ్ల పట్టాలకు యాజమాన్య హక్కులు ఇవ్వాలని గతంలో టీడీపీ ప్రభుత్వం నిర్దేశించింది. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉత్తుత్తి గజిట్ నోటిఫికేషన్ ఇచ్చారు. ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వమైనా దీనిని అమలు చేయాలని కోరుతున్నారు. కిందటి ప్రభుత్వం ఇచ్చిన గజిట్ ప్రకారం చేతులు మారి, పదేళ్లు పూర్తి చేసుకున్న ఇళ్ల పట్టాలు, 20 ఏళ్లు దాటిన సాగు పట్టాదారులకు యాజమాన్య హక్కులు కల్పించవచ్చు. తద్వారా వారు అమ్ముకోవటానికి, తమ పిల్లల పేరుతో రిజిస్ట్రేషన్లు చేయించుకోవటానికి లేదా బ్యాంకు రుణాలు పొందటానికి అవకాశం ఉంటుంది.

'జీసీకేసీ'పై కేసు నమోదు

- జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి కొండారెడ్డి ఫిర్యాదు
- రొయ్యూర్యులో ఇసుక అక్రమ తవ్వకాలే కారణం

తోట్లవల్లూరు, జూలై 28 : వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా ఇసుక దోచుకున్న జీసీకేసీ సంస్థపై తోట్లవల్లూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జిల్లా మైనింగ్ అండ్ జియాలజీ అధికారి టి.కొండారెడ్డి శనివారం రాత్రి జీసీకేసీపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్సై పి.విశ్వనాథ్ ఆదివారం తెలిపారు. జనవరి నుంచి రొయ్యూరులో పెద్దఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు జరిపిన విషయం తెలిసిందే. దీనిపై గతంలో అనేకసార్లు 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వచ్చాయి. స్థానిక తహసీల్దార్ మూడుసార్లు ఇసుక తవ్వకాలు ఆపించినా రెండు రోజులకే మొదలు పెట్టేవారు. అప్పటి వైసీపీ ప్రభుత్వ పెద్దల అండతో జిల్లా అధికారులు ఈ అక్రమాలకు కొమ్ముకాశారు. పర్యావరణ అనుమతులు లేకుండా జరుగుతున్న ఇసుక తవ్వకాలపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ జిల్లా కలెక్టర్లను నివేదిక కూడా కోరింది. దీంతో ఫిబ్రవరి 13న అప్పటి కలెక్టర్ రాజాబాబు ఆధ్వర్యంలో అధికారుల బృందం తోట్లవల్లూరు మండలం వచ్చి అక్రమంగా నడుస్తున్న రొయ్యూరు క్వారీని పక్కన పెట్టి, మూడున్నరేళ్ల కిందట మూతపడిన నార్తవల్లూరు క్వారీని సందర్శించి అక్రమ తవ్వకాలు లేవని తేల్చారు. ఇలా పెద్దలు జీసీకేసీ అక్రమాలకు దన్నుగా నిలిచారు. రొయ్యూరు గ్రామస్తులు సైతం ఇసుక అక్రమ తవ్వకాలను పలుమార్లు అడ్డుకున్నారు. అయినా నాటి వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావటంతో ఇసుక తోడేళ్లపై చర్యలకు ఉపక్రమించింది.


బుక్ బ్యాంకులెక్కడ..?

పాఠశాలల్లో కనిపించని బుక్ బ్యాంకులు

పుస్తకాల సేకరణను పక్కన పెట్టేసిన ఉపాధ్యాయులు

- ఒకప్పుడు భారీగా పాత పాఠ్యపుస్తకాల సేకరణ
- వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిలుపుదల
- మూలనపడిన ఉపయోగకరమైన విద్యావిధానం

పాఠశాలల్లో బుక్ బ్యాంకులకు మంగళం పాడేశారు. గతంలో ఒక తరగతి నుంచి మరో తరగతి వెళ్లే విద్యార్థుల నుంచి పాత పాఠ్యపుస్తకాలు తీసుకుని భద్రపరిచేవారు. కొత్త పాఠ్యపుస్తకాలు ఆలస్యంగా చేరితే, పాత పుస్తకాలతో సిలబస్‌ను మొదలుపెట్టేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక బుక్ బ్యాంకులు వద్దని చెప్పడంతో విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉండే ఈ విధానం మూలకు చేరింది.



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఆరో తరగతి పూర్తిచేసి ఏడులోకి అడుగుపెట్టే విద్యార్థుల వద్ద ఉన్న పాత పాఠ్యపుస్తకాలను విద్యాసంవత్సరం ప్రారంభంలోనే ఉపాధ్యాయులు సేకరించేవారు. అలాగే, ఏడు పూర్తిచేసి ఎనిమిదో తరగతిలోకి అడుగుపెట్టే విద్యార్థుల నుంచి కూడా పుస్తకాలు తీసుకునేవారు. 2022-23 విద్యా సంవత్సరం వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇలానే చేసేవారు. ఈ పాఠ్యపుస్తకాలను ఒక గదిలో భద్రపరిచేవారు. వాటిని బుక్ బ్యాంక్‌లుగా వ్యవహరించేవారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమై నెల దాటినా ప్రభుత్వ పాఠశాలల్లో బుక్ బ్యాంక్‌ల మాట లేదు. వాస్తవానికి ఈ బుక్ బ్యాంక్‌ల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ ఎన్నికలకు ముందు గత వైసీపీ ప్రభుత్వం మంగళం పాడేసింది. విద్యార్థుల పాత పాఠ్యపుస్తకాలను వెనక్కి తీసుకోవద్దని 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బుక్ బ్యాంక్‌ల జోలికి వెళ్లడం మానేశారు.

ఉపయోగమేంటి?

మొదటి, రెండో తరగతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ పాఠ్యపుస్తకాలు ఉంటాయి. మూడు నుంచి ఐదో తరగతులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఈవీఎస్ (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/సైన్స్ సోషల్) పాఠ్యపుస్తకాలు ఉంటాయి. ఆరు నుంచి పదో తరగతి వరకు ఆరు పాఠ్యపుస్తకాలు ఉంటాయి. ప్రతి విద్యాసంవత్సరంలో ప్రభుత్వం ఈ పుస్తకాలను ముద్రించి విద్యార్థులకు అందజేస్తుంది. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచాక వారంలోపు పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేయాల్సి ఉంటుంది. ఒక్కో ఏడాది పాఠ్యపుస్తకాల ముద్రణ ఆలస్యమవుతుంటుంది. కొన్నిసార్లు కొన్ని పాఠ్య పుస్తకాలే పాఠశాలలు తెరిచే సమయానికి వస్తుంటాయి. మిగిలిన వాటి కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. ఈ విద్యాసంవత్సరంలో మాత్రం దాదాపు అన్ని తరగతులకు పాఠ్యపుస్తకాలు పాఠశాలలు తెరిచే నాటికే అందాయి. కానీ, అన్ని విద్యా సంవత్సరాల్లో ఇదే పరిస్థితి ఉంటుందని చెప్పలేం. అటువంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పాత విద్యాబోధన చేయడానికే గతంలో ఇలా పుస్తకాలు సేకరించేవారు. కొత్త పాఠ్యపుస్తకాలు పాఠశాలలకు చేరుకునే లోగా పాతవి ఉపయోగపడేవి.

నష్టం లేదు కదా?

విద్యా ప్రణాళికలో పాఠ్యాంశాలు, పాఠ్యపుస్తకాల మార్పు నిరంతరం కొనసాగుతోంది. కొత్త సిలబస్‌ను పరిచయం చేసినప్పుడు పాత పుస్తకాలతో పెద్దగా పని ఉండదు. కొత్త సిలబస్‌లో కొన్ని పాఠ్యాంశాలు మాత్రం పాత సిలబస్‌కు లింకై ఉంటుంది. ఈ నేపథ్యంలో పాఠ్యపుస్తకాలను రిఫరల్ బుక్స్‌గా అందుబాటులో పెట్టుకోవాలి. ఇలా చేయడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పెద్దగా ఆసక్తిని చూపడం లేదని తెలుస్తోంది. బుక్ బ్యాంక్‌లను నిర్వహించడమే పాఠశాలలు ఒక భారంగా భావిస్తున్నాయని కొంతమంది ఉపాధ్యాయులు బహిరంగంగా చెబుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. తర్వాత మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు సిలబస్ ఈ పాఠ్యపుస్తకాల నుంచే ఉంటుంది. అందువల్ల అభ్యర్థులు అవసరమైన పాఠ్యపుస్తకాల కోసం మార్కెట్లో తిరుగుతున్నా అందుబాటులో ఉండడం లేదు. విద్యార్థుల నుంచి పాత పాఠ్యపుస్తకాలను తీసుకుని బుక్ బ్యాంక్‌లను నిర్వహిస్తే ఇలా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉపయోగపడతాయన్న అభిప్రాయం విద్యావంతుల నుంచి వ్యక్తమవుతోంది.



పడకేసిన పల్లెలు!

6లో..

ప్రజలను పట్టి పీడిస్తున్న విషజ్వరాలు

- రోగులతో ఆసుపత్రులు కిటకిట
- గ్రామాల్లో కొరవడిన పారిశుధ్యం



అమ్మవారికి సారె తీసుకువస్తున్న భక్త బృందాలు

దుర్గమ్మకు ఆషాఢ సారె



వన్‌టౌన్, జూలై 28 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు ఆషాఢమాసం సందర్భంగా పలు ప్రాంతాల నుంచి భక్త బృందాలు సారె సమర్పించుకుంటున్నారు. పలు రకాల తీపి పదార్థాలు, వస్త్రాలు, పండ్లు, పూలు, గాజులు, సుగంధ పరిమళ ద్రవ్యాలతో సమర్పించుకుంటున్నారు. ఆయురారోగ్యాలు క్షేమసౌఖ్యాలు కలగాలని అమ్మవారికి సారెలు సమర్పిస్తున్నారు. ఆదివారం పలు ప్రాంతాల నుంచి భక్త బృందాలు సారెను సమర్పించాయి. ఆలయం ఆధ్యాత్మిక శోభతో గుబాళించింది. ఆదివారం సూర్యోపాసన సేవ చేశారు. సూర్యనారాయణ స్వామి చిత్ర పటానికి అర్చనలు, జపం అనంతరం తర్పణ చేశారు. మంత్రపుష్పం, హారతి సమర్పించారు.



సొమ్మసిల్లిన మహిళాభక్తులు..



పలు ప్రాంతాల నుంచి సారె సమర్పించడానికి వచ్చిన మహిళా భక్తులు పలువురు నీరసంతో సొమ్మసిల్లిపడిపోయారు. సారె సమర్పించేందుకు వస్తూ ఉపవాసం పాటించడం వల్ల ఇలా జరిగిందని చెబుతున్నారు. వారి బంధువులు ఉపచర్యలు చేశారు.

ఆలయ గోపుర స్వర్ణతాపడం, అన్నవితరణకు విరాళాలు

దుర్గమ్మ ఆలయ గోపుర స్వర్ణతాపడానికి, అన్నవితరణ కార్యక్రమానికి ఆదివారం పలువురు డోనర్ సెల్ ద్వారా విరాళాలు అందజేశారు.

- తెలంగాణాలోని సంగారెడ్డిలో గల మంజీరానగర్‌కు చెందిన దూదేకుల అస్సాన్, కుటుంబసభ్యులతో కలిసి రూ.2 లక్షల విరాళాన్ని, సూర్యాపేటకు చెందిన కాజ నిర్మల లక్ష్మి రూ.1,00,116 విరాళాన్ని ఈవో రామారావుకు చెక్కురూపంలో అందజేశారు.
- విజయవాడ మొగల్రాజపురానికి చెందిన పోసం కృష్ణకుమార్ నాయుడు, కుటుంబసభ్యులతో కలిసి అన్నవితరణ కార్యక్రమానికి రూ. 1,00,116లు చెక్కురూపంలో అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం దాతలకు ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న దేవదాయ కమిషనర్



దేవదాయ కమిషనర్ సత్యనారాయణ ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఈవో రామారావు, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మకు సారె..

ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు ఆదివారం రెండు వేలమందికి పైగా భక్తులు వచ్చి సారె సమర్పించారు. జగ్గయపేట సమరసత సేవా సంఘం నుంచి 200, శ్రీకాకుళం నుంచి దశరథగురుభవానీ బృందం 105, బ్రాహ్మణ సంఘం సమాఖ్య నుంచి 150, కృష్ణలంక దుర్గాసేవా సమితి నుంచి 108 ఇలా మొత్తంగా 55 బృందాలు అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించారు.

దుర్గమ్మను దర్శించుకున్న సిద్ధార్థ జైన్..



పౌరసరఫరాలశాఖ కమిషనర్ సిద్ధార్థ జైన్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న అధికారులు

దుర్గమ్మను ఆదివారం రాష్ట్ర రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ సిద్ధార్థ జైన్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో రామారావు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, అమ్మవారి చిత్రపటం, ఆశీస్సులు, శేషవస్త్రం అందజేశారు.

విజయవాడ నగర పోలీసుల తరపున సారె..



విజయవాడ నగర పోలీసుల తరఫున ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు దంపతులు ఆదివారం రాత్రి అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం వారికి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం, వేదపండితులు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో రామరావును పోలీసు కమిషనర్ సత్కరించారు. డీసీపీలు గౌతమి శాలి, ఉదయరాణి, హరికృష్ణ, అదనపు డీసీపీలు, పశ్చిమ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి, వన్‌టౌన్ సీఐ దుర్గాశేఖరరెడ్డి, ఎస్సైలు సతీష్, రమ్య పాల్గొన్నారు.

అమ్మవారికి మాజీ ఈవో కోటేశ్వరమ్మ..



సారె తీసుకువస్తున్న కోటేశ్వరమ్మ

దుర్గమ్మవారికి ఆదివారం దుర్గగుడి మాజీ ఈవో, ఐఆర్ఎస్ అధికారిణి వలనుకొండ కోటేశ్వరమ్మ సారె సమర్పించారు ఆలయ ఈవో, అర్చకుల బృందం ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆమెకు ఆశీస్సులు, శేషవస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

వైభవంగా సుబ్బారాయుడి పవిత్రోత్సవాలు

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పవిత్రత్సోవ సహిత ఆషాఢ కృత్తికా మహోత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహోత్సవంలో భాగంగా అర్చక బృందం వేదమంత్రోచ్చరణల నడుమ ఈవో ఎస్.ఎస్.చక్రధరరావు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాలు సమర్పించారు.

ఉత్సాహంగా తైక్వాండో చాంపియన్‌షిప్

విజయవాడ స్పోర్ట్స్, జూలై 28 : నగరంలోని ఆంధ్రా లయోలా కళాశాల ఇండోర్ స్టేడియంలో ఉమ్మడి కృష్ణాజిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. అండర్-11, సబ్ జూనియర్, అండర్-14, క్యాడెట్, అండర్-17 విభాగాల్లో 400 మంది క్రీడాకారులు తలపడ్డారు. మొదటి మూడుస్థానాల్లో నిలిచిన వారికి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.అంకమ్మరావు ట్రోఫీలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ప్రథమస్థానంలో నిలిచిన బాలబాలికలు ఆగస్టు 3, 4వ తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పోటీలకు పరిశీలకులుగా శాప్ కోచ్ గౌరిశంకర్ పర్యవేక్షించారు.

పడకేసిన పల్లెలు!



కూచిపూడి ఆసుపత్రిలో జ్వరపీడితులు

ప్రజలను పట్టి పీడిస్తున్న విషజ్వరాలు

- రోగులతో ఆసుపత్రులు కిటకిట
- గ్రామాల్లో కొరవడిన పారిశుధ్యం

కూచిపూడి, జూలై 28 : జ్వరాలతో పల్లెలు మంచం పట్టాయి. గ్రామాల్లో పారిశుద్యం కొరవడింది. జ్వరపీడితులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. గ్రామాల్లో పారిశుద్యం కొరవడటంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. జ్వరాల బారిన పడిన



రోగులతో ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు అధికంగా ఉన్నాయి. గ్రామాల్లో రోడ్ల పక్కన చెత్తాచెదారాలు నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమలు విజృంభిస్తున్నాయి. గ్రామపంచాయతీల వారు రోడ్ల పక్కన బ్లీచింగ్ చల్లించటం మినహా.. దోమల నివారణ మందు పిచికారి చేయటం, ఓవర్ హెడ్ ట్యాంక్‌లు శుభ్రపరిచి క్లోరినేషన్ వంటి కార్యక్రమాలు చేపట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మొవ్వ, నిడుమోలు గ్రామాల్లో ప్రభుత్వవైద్యశాలలు ఉన్నప్పటికీ, ప్రైవేట్ ఆసుపత్రుల వైపే రోగులు మొగ్గు చూపుతున్నారు. వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది సర్వేలకు పరిమితం కావటంతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలకు జ్వర పీడితులు వెళ్లి వైద్యసేవలు పొందలేకపోతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలపై ఆయా గ్రామపంచాయతీలు దృష్టిసారించటంతోపాటు ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యసేవలు మెరుగుపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొర్లమండలో కొనసాగుతున్న వైద్య శిబిరం

విస్సన్నపేట : కొర్లమండలో విరేచనాలతో రోగుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ఆదివారం గొల్లగూడెం ఎంపీపీ పాఠశాలలోని అత్యవసర చికిత్స కేంద్రంలో పలువురికి వైద్య సేవలందించారు. శనివారం రాత్రి మరో ముగ్గుర్ని విస్సన్నపేట సీహెచ్‌సీకి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నారు. డీఎం అండ్ హెచ్‌వో



కొర్లమండలో వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న వైద్యాధికారిణి సుహాసిని



విస్సన్నపేట పీహెచ్‌సీలో..

సుహాసిని చికిత్స కేంద్రాన్ని సందర్శించారు. తిరువూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న జి.చిట్టెమ్మను మెరుగైన వైద్యంకోసం విజయవాడ తరలించినట్లు చెప్పారు. గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నామని చెప్పారు. విరేచనాలు బారిన పడుతున్న వారు వెంటనే ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందాలన్నారు. ఒక శుభకార్యానికి హాజరైన రెండు కుటుంబాలు మాంసాహారం తినడంతో పాటు గ్రామంలో కలుషిత నీరు తాగడం వల్లే అనారోగ్యానికి కారణమన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. 24 గంటల పాటు 108 వాహనాలు సిద్ధంగా ఉంచామన్నారు. వైద్యాధికారులు ఇందుమతి, వి.పెద్దిబాబు, ఎంపీడీవో జి.విజయ్‌కుమారి, టీడీపీ నేతలు వైద్య శిబిరాన్ని సందర్శించారు.



కొర్లమండలో అధ్వానంగా పారిశుధ్యం

వ్యవసాయ రంగానికి మొండిచేయి

- బడ్జెట్ ప్రతులను దహనం చేసిన రైతు సంఘాల నేతలు

గవర్నర్‌పేట, జూలై 28 : కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి మొండి చేయి చూపిందని, రైతులకు తీరని అన్యాయం చేసిందని మాజీ వ్యవసాయ శాఖామంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ధ్వజమెత్తారు. వ్యవసాయ రంగానికి ఆశించిన స్థాయిలో బడ్జెట్ కేటాయింపులు జరగలేదని ఆరోపిస్తూ ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఆదివారం లెనిన్ సెంటర్‌లో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే మాట్లాడుతూ, వ్యవసాయ రంగంపై ఆధారపడిన రైతులు, వ్యవసాయ



లెనిన్ సెంటర్‌లో బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న రైతు సంఘాల నేతలు

కూలీలకు బడ్జెట్‌లో అతి తక్కువ నిధులు కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బడా కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు కల్పించారని, రుణాలు మాఫీ చేశారని ఎద్దేవా చేశారు. ఉపాధి హామీ పథకానికి కూడా నిధులు తగ్గించడం వల్ల వ్యవసాయ కార్మికులకు పనిదినాలు తగ్గాయన్నారు. పనులు లేక గ్రామీణ రైతులు, రైతు కూలీలు పట్టణాలకు వలసలు పోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులపై సబ్సిడీలు ఎత్తివేశారని, మార్కెట్ సౌలభ్యం ఏర్పాటు చేయలేదని, ప్రభుత్వ ఎఫ్‌సీఐ గోడౌన్లు కూడా బడా కంపెనీలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర నాయకులు వై.కేశవరావు, పి.జమలయ్య, ఎం.హరిబాబు, ఎం.యలమందరావు, పీవీ ఆంజనేయులు, మరీదు ప్రసాద్, పోలవరపు కృష్ణ, మాదు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్డీఏ రైతు బడ్జెట్‌ను వ్యతిరేకించండి

- ఏఐసీటీయూ, వామపక్ష అనుబంధ సంఘాల ధర్నా

వన్‌టౌన్ : ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బడ్జెట్‌ను వ్యతిరేకించాలని, వ్యవసాయ బడ్జెట్ ప్రసంగ పాఠం నకళ్లను దహనం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు పంజాసెంటర్‌లో ఏఐసీటీయూ, వామపక్ష అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించి, బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన వ్యవసాయ బడ్జెట్‌లోని కేటాయింపులు రైతులను ఆదుకునే విధంగా లేవన్నారు. పంటలకు మద్దతు ధర ఊసేలేదన్నారు. కేంద్రం పునరాలోచించి పార్లమెంట్ సమావేశాలలో బడ్జెట్‌ను సవరించి వ్యవసాయరంగానికి రూ. 5 లక్షల కోట్లు, ఆహార భద్రతకు రూ. 30లక్షల కోట్లు, ఉపాధి హామీ పథకానికి రెండు లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మర్రెడ్డి వెంకటరెడ్డి, ఏఐసీటీయూ నాయకులు గొల్లపూడి ప్రసాద్, వివిఎల్ నారాయణ, విగ్నేష్, యూవైఎఫ్ఐ నాయకులు కాసాని గణేష్ బాబు, అనకాపల్లి కనకరాజు, పి.శ్రీనివాస్, యూఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్‌డీ సిరాజ్, కాసాని యువరాజ్, మహిళ సంఘం నాయకులు సోమీ ఎల్లమ్మ, కాసాని సుజాత, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.



పంజా సెంటర్‌లో ధర్నా చేస్తున్న వామపక్ష అనుబంధ సంఘాల నేతలు



యార్లగడ్డకు అపూర్వ స్వాగతం

పమిడిముక్కల, జూలై 28 : గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాలకు పమిడిముక్కల మండల పరిధిలో ఆదివారం కూటమి పార్టీల శ్రేణులు అపూర్వస్వాగతం పలికారు. గన్నవరం ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగిడిన తరువాత వెంకట్రావు స్వగ్రామమైన పెనుముత్స వెళుతున్న సందర్భంగా మంటాడ వద్ద ఎమ్మెల్యే కుమార్‌రాజ, పలువురు నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో వారు పూజలు చేశారు. అనంతరం కపిలేశ్వరపురంలో తాతినేని రమేశ్ నివాసం వద్ద మహిళలు హారతులివ్వగా తాతినేని సాయిదత్తు సోదరులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జేసీబీతో ఎమ్మెల్యేలపై గులాబీల వర్షం కురిపించారు. గజమాలతో సత్కరించి ఎడ్లబండిపై వందలాది అభిమానులు వెంటరాగా భారీఎత్తున ఊరేగింపుగా తీసుకువెళ్లారు. టీడీపీ నాయకులు లింగంనేని బాబూరావు, కొల్లిపర బాబి, మండల పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు జక్కా శ్రీనివాసరావు, బుల్లెట్ బాబి, కిరణ్ తదితరులు వెంకట్రావుకు అపూర్వస్వాగతం పలికారు. అభిమానుల ఆదరాభిమానాలు ఎన్నటికి మరువలేనని వెంకట్రావు ఉద్వేగానికి లోనయ్యారు.

ఐకమత్యమే మా నినాదం

- పద్మశాలీయుల రాష్ట్ర సమావేశం
- హాజరైన ప్రతినిధులు, ప్రముఖులు
- ప్రజాస్వామ్య పద్ధతిలో కమిటీ ఏర్పాటు

గవర్నరుపేట, జూలై 28: 'ఐకమత్యమే మన ఏకైక నినాదం' పేరుతో పద్మశాలీయుల రాష్ట్రస్థాయి సమావేశం ఆదివారం మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. సమావేశంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన పద్మశాలీ ప్రతినిధులు, ప్రముఖులు మాట్లాడారు. పద్మశాలీ దర్శిని యాప్ ద్వారా ప్రపంచంలోని రెండున్నర కోట్ల మంది పద్మశాలీయులు ఒకే వేదికపైకి వచ్చే అవకాశముందని, ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కౌతవరపు ప్రసాద్ సూచించారు. 'ప్రతిభాశాలి-పద్మశాలి' నినాదంతో అందరూ ఒక తాటిపైకి వచ్చి కలిసికట్టుగా పనిచేస్తే సంఘం బలపడుతుందని గుంటూరుకు చెందిన హైకోర్టు న్యాయవాది వై.కోటేశ్వరరావు (వైకె) సూచించారు. ప్రజాస్వామిక పద్ధతిలో రాష్ట్ర పద్మశాలీయుల కమిటీని ఏర్పాటు చేసే బాధ్యతని ఒక ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేసి దానికి రాష్ట్ర కమిటీ ఎన్నిక బాధ్యతను అప్పగిస్తే బాగుంటుందని, అప్పుడే పద్మశాలీయులు విజయం సాధిస్తారని ప్రొద్దుటూరుకు చెందిన నాగమల్లి శంకర్ సూచించారు. అఖిల భారత పద్మశాలీయ సంఘం ద్వంద్వ వైఖరితో వ్యవహరిస్తోందని, దాని అనుబంధ సంఘాలైన మిగిలిన అన్ని పద్మశాలీయ సేవా సంఘాలు ఒకే తాటిపైకి రావడానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని అందె జగదీష్ పేర్కొన్నారు. ప్రతి జిల్లానుంచి ప్రముఖులతో ఒక కమిటీని వేసి వారు లేఖ ద్వారా ఆహ్వాన కమిటీకి నివేదిక ఇస్తే 13 జిల్లాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్ర కమిటీని వేస్తే బాగుంటుందని గోలి వెంకటేశ్వరరావు, యంగల కోటేశ్వరరావు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. యువతకు గుర్తింపు ఇచ్చే వరకు పద్మశాలీయ సంఘం బలపడదని మునగాల రవికిరణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన పద్మశాలీయ ప్రముఖులు గంజి చిరంజీవి, మాజీ ఎంపీ డాక్టర్ శింగరి సంజీవ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ రాధయ్య, మేరుగ వెంకటేశ్వర్లు, మాజీ ఇన్‌కంటాక్స్ అధికారి స్వర్గం పుల్లారావు, ముట్టే రామచంద్రరావు, హైకోర్టు న్యాయవాది చిలువేరు మార్కండేయ, తెడ్లపు వెంకటేశ్వరరావు, జగ్గరపు శ్రీనివాసరావు, రాపోలు జగన్, కౌతవరపు సత్యనారాయణ, పద్మావతి, పంచుమర్తి లక్ష్మీభీమేష్ పాల్గొన్నారు.



పద్మశాలీ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది కోటేశ్వరరావు

మంగినపూడికి పర్యాటక శోభ కల్పిస్తాం

- యోగశిక్షణలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 28 : మంగినపూడి బీచ్‌ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, అబ్కారీ శాఖమంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం ఉదయం కలెక్టర్ బాలాజీ నేతృత్వంలో అధికారులు, ఉద్యోగులకు బీచ్‌లో ప్రత్యేక యోగ శిక్షణా కార్యక్రమం ఆదివారం సముద్ర తీరాన ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. మంత్రి రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ, జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, డీఆర్వో చంద్రశేఖర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతంగా బీచ్..

మంగినపూడి బీచ్‌ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతామని మంత్రి అన్నారు. బీచ్ అభివృద్ధికి కమిటీ ఏర్పాటు చేసి టెంపుల్ టూరిజం ద్వారా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రతి ఆదివారం యోగా తరగతులు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించారు. మచిలీపట్నం నుంచి విశాఖపట్నం వెళ్లేందుకు సీ ప్లేన్ ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. రవీంద్రతో పాటు కలెక్టర్, జేసీ, అధికారులు సముద్రతీరం వెంబడి స్వచ్ఛీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. సెప్టెంబరు 2న మచిలీపట్నంలో 30వేల మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నట్టు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖర్, డీపీవో నాగేశ్వరనాయ్, టూరిజం అధికారి రామలక్ష్మణ్, సమాచార శాఖ డీడీ వెంకటేశ్వర ప్రసాద్, సర్వే రికార్డుల ఏడీ మనీషా త్రిపాఠి, ఎలక్ట్రికల్ ఈఈ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రాణాయామం చేస్తున్న రవీంద్ర, కలెక్టర్, జేసీ

నరసింహారావు మృతి తీరనిలోటు



పటమట, జూలై 28 : కృష్ణాజిల్లా సహకార బ్యాంకు మాజీ డైరెక్టర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్‌గా ఉద్యోగుల సమస్యల పట్ల అలుపెరగని పోరాటం చేసిన కరి నరసింహారావు మృతి బాధాకరమని నాన్‌టీచింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఆదివారం సంతాపాన్ని వ్యక్తం చేశారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం నాన్‌టీచింగ్ ఉద్యోగుల సంఘం నుంచి అక్కిరాజు మంచిరాజు నరసింహారావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఐటీఐలో రెండోదశ కౌన్సెలింగ్

భారతీనగర్ : ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024-25 విద్యాసంవత్సరానికిగాను రెండో విడత కౌన్సెలింగ్ ఆదివారం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జరిగింది. కౌన్సెలింగ్‌కు 273 మంది హాజరుకావాల్సి ఉండగా 180 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో 134 మందికి వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లు కేటాయించారు. ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో మొత్తం 716సీట్లు ఖాళీ ఉండగా ఇప్పటి వరకు రెండు కౌన్సెలింగ్‌లో 643 సీట్లు (90 శాతం) భర్తీ అయ్యాయని, ప్రిన్సిపల్, జిల్లా కన్వీనర్ ఎం.కనకారావు తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కృష్ణలంక, జూలై 28 : కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జూలై 29వ తేదీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలకు అందుబాటులో వుండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు, డివిజన్, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

'కృష్ణా'లో అనధికార తవ్వకాలు

విజయవాడ, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ పాలనలో కృష్ణా నదిలో జరిగిన అక్రమ ఇసుక తవ్వకాల బాగోతాలు ఇప్పుడు బయట పడుతున్నాయి. నాడు ప్రభుత్వంలోని పెద్దల అండదండలు ఉండడంతో ఇష్టానుసారంగా తవ్వకాలు చేశారు. పెనమలూరు మండలం చోడవరంలో కృష్ణానదిలో అనధికారికంగా తవ్వకాలు జరిపిన జీసీకేసీ ప్రాజెక్ట్స్ అండ్ వర్క్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీపై కృష్ణా జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారులు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈసీ (ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్స్), సీఎఫ్‌వో (కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్స్), సీఎఫ్ఈ (కన్‌సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్), ఏఎంపీ (అప్రూవ్డ్ మైనింగ్ ప్లాన్) లేకుండా ఈ సంస్థ ఇసుక తవ్వకాలు చేసిందని ఫిర్యాదు పేర్కొన్నారు. సంయుక్త తనిఖీలు నిర్వహించినప్పుడు చోడవరం సమీపంలోని నదిలో పలు ప్రదేశాల్లో తవ్వకాలు చేసినట్టు గుర్తించారు. రెండు నెలల క్రితం నుంచి ఈ సంస్థ ఇసుక తవ్వకాలను చేసి, సరఫరా చేసినట్టు రెవెన్యూ అధికారి ఈ తనిఖీ బృందానికి వివరించారు. అనంతరం జీసీకేసీ సంస్థ ప్రతినిధి అర్మూర ధనంజయకు ఈనెల 24న అధికారులు నోటీసులు జారీ చేశారు. ఎంఎం(డీఅండ్ఆర్) చట్టం 1957లోని 4(1), 21(1), 21(4), ఏపీఎంఎంసీ 1966 చట్టంలోని 26(2)(1), ఐపీసీ 379 కింద కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. ఈ సంస్థ కార్యాలయం విజయవాడ ఆర్టీసీ కాలనీలోని సాయిబాబా ఆలయం వీధిలో ఉంది. ఇక్కడ నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దీనిపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

ధర్నాచౌక్, జూలై 28 : లయన్స్ క్లబ్ సభ్యులు సేవ, సహాయానికి మారుపేరుగా నిలుస్తున్నారని డీసీపీ (అడ్మిన్), విజయవాడ వెస్ట్ జోన్ (లా అండ్ ఆర్డర్) ఇన్‌చార్జి టి.హరికృష్ణ అన్నారు. విజయవాడ జూబ్లీ హరిత నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం గాంధీనగర్‌లోని ఫిలిం చాంబర్ హాల్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న హరికృష్ణ మాట్లాడుతూ మొక్కలు నాటడం, ఉచిత వైద్య శిబిరాల నిర్వహణతదితర సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇటీవల పెరిగిన సైబర్ నేరాలను అరికట్టేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు.

మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కంకణాల శ్రీనివాసరావు ఇన్‌స్టలేషన్ ఆఫీసర్‌గా వ్యవహరించి నూతన కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. బొల్లంకొండ శ్రీనివాస ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఎల్.రామకృష్ణ, బి.సాయికృష్ణారెడ్డి, కార్యదర్శిగా కోటా ఫణీంద్రబాబు తదితర సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

అక్టోబరు ఒకటిన శతాధిక వృద్ధులకు సత్కారం

సత్యనారాయణపురం, జూలై 28: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా అక్టోబరు ఒకటో తేదిన విజయ్‌నర్సింగ్ కళాశాలలో శతాధిక వృద్ధులను సత్కరిస్తామని వయోవృద్ధ చారిటబుల్‌ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ చల్లా హరి కుమార్ తెలిపారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన నూరేళ్లు పూర్తి చేసుకున్న వయోవృద్ధులను గుర్తించి వారిని తమ ఖర్చులతో ఇక్కడకు తీసుకొచ్చి ప్రముఖులతో సత్కరింపజేసి, తిరిగి వారి ఇంటి వద్ద దింపుతామని ఆయన తెలిపారు. ఆ జిల్లాలకు చెందిన శతాధిక వృద్ధులు ఆగస్టు 20లోపు 9848111138, 7075829279లో సంప్రదించి, పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. తేజ్‌రాజ్ సోలంకి, తట్టి అర్జునరావు, అమరా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



పటమట రైతుబజార్ వద్ద రోడ్డుపైన నిలిపిన ద్విచక్ర వాహనాలు

రోడ్డుపైనే బైక్‌ల పార్కింగ్

● రైతుబజార్ రోడ్డులో వాహనాల రాకపోకలకు ఆటంకం

పటమట: పటమట హైస్కూల్ రోడ్డు రైతుబజార్ వద్ద వినియోగదారులు రోడ్డుపైన ద్విచక్రవాహనాలు నిలిపి, తాపీగా వెళ్లి రైతుబజార్‌లో కూరగాయలు కొనుక్కొంటున్నారు. రోడ్డుపైనే వాహనాలు నిలపడంతో ఆ మార్గంలో ఒక్క కారు ప్రయాణించడానికే మాత్రమే అవకాశముంటోంది. ఆ రోడ్డులో వెళ్లే ద్విచక్రవాహనదారులు, కార్లు నడిపేవారు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి వినియోగదారులు వాహనాలను రోడ్డుపైన నిలుపుదల చేయకుండా చూడాలని రైతుబజార్ ప్రాంతవాసులు కోరుతున్నారు.



భారతీనగర్ మెయిన్‌రోడ్డులో వారం క్రితం తీసిన గుంత



శ్రీనివాసనగర్ బ్యాంక్‌కాలనీ వాటర్ ట్యాంకు రోడ్డులో పదిరోజుల క్రితం తీసిన గుంత

ప్రమాదకరంగా..

వాటర్‌పైపుల మరమ్మతుల కోసం తీసిన గుంతలు

భారతీనగర్: నాలుగో డివిజన్‌లోని భారతీనగర్‌కాలనీ మెయిన్ రోడ్డులోని 4వ క్రాస్‌రోడ్డు వద్ద వారం క్రితం ప్రధాన, అంతర్గత రోడ్లలో మున్సిపల్ వాటర్‌పైపుల మరమ్మతుల కోసం సిబ్బంది గుంతలు తీశారు. శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలోని వాటర్ ట్యాంక్, భారతీనగర్, శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీ సరిహద్దు రోడ్డులో గుంతలు తీసి పది రోజులవుతోంది. అయినా మరమ్మతులు పూర్తి కాలేదు. గుంతలు నాలుగైదు అడుగుల లోతు ఉండడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షాలకు రోడ్లు నీటమునుగుతున్నాయి. రోడ్డు మార్జిన్‌లో ఉండడంతో ప్రమాదాలకు దారితీసే అవకాశముందని, అధికారులు మరమ్మతులు పూర్తిచేయించి, గుంతలు పూడ్చాలని స్థానిక పెద్దలు కోరుతున్నారు.

గొట్టుముక్కల రఘుకు శస్త్రచికిత్స

అజిత్‌సింగ్‌నగర్, జూలై 27: టీఎస్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజుకు ఆదివారం గుంటూరులో శస్త్రచికిత్స జరిగింది. 2022 నవంబరులో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, లోకేశ్‌లపై రాప్తాడు వైసీపీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశాడు. ఆ వ్యాఖ్యలను ఖండిస్తూ గొట్టుముక్కల రఘు, ఇతర టీడీపీ నేతలు ఎమ్మెల్యే ఇంటి ముందు ఆందోళన చేసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో పోలీసులతో జరిగిన తోపులాటలో రఘు వెన్నుపూసకు గాయమైంది. అప్పటి నుంచి ఆయన బాధపడుతున్నారు. ఆదివారం శస్త్రచికిత్స చేయించుకున్నారు. గొట్టుముక్కల రఘును పలువురు టీడీపీ, టీఎస్టీయూసీ నేతలు పరామర్శించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీఎస్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘు

అలరించిన గాత్రకచేరీ

విజయవాడ కల్చరల్, జూలై 28: యువగాయని టి.కె.పవిత్ర గాత్ర కచేరీ ప్రేక్షకులను అలరించింది. శ్రీ సద్గురు సంగీత సభ అధ్వర్యంలో లబ్బీపేటలోని మహతి కాన్ఫరెన్సు హాల్లో ఆదివారం సాయంత్రం నెలనెలా యువరాగం పేరిట గాత్రకచేరీ నిర్వహించారు. బీవీఎస్ శ్రీకృష్ణ వయోలిన్‌పై కె.జగన్మోహిని మృదంగంపై వాయిద్య సాకారం అందించారు. కార్యక్రమాన్ని పోపూరి గౌరీనాథ్ పర్యవేక్షించారు.

జనరంజకంగా సంగీత, నృత్యకదంబం

విజయవాడ కల్చరల్, జూలై 28: 'లయ-అభినయ' పేరిట ఆదివారం సాయంత్రం వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయం హాలులో దృశ్యవేదిక నెలవారీ కార్యక్రమంగా నిర్వహించిన సంగీత, నృత్యకదంబం జనాల్ని రంజింపజేసింది. కామరాజు విష్ణుమూర్తి శిష్యులు ఆదితాళంలో మృదంగలయ విన్యాసం ప్రేక్షకుల మెప్పుపొందింది. కీర్తనలకు కాకర్లపూడి శృతి సమన్వినర్తించి ప్రేక్షకులను రంజింపజేశారు. బృంద నృత్యాలను లేఖ్య భరణి శిష్యులు హృద్యంగా ప్రదర్శించారు. బొర్రా నరేష్, కత్తి శ్యాంప్రసాద్, ఇవన రమేష్, పద్మశ్రీలు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

● తాళం వేసిన ఇంట్లో 110 గ్రాముల బంగారం అపహరణ
● ఉడా కాలనీలో ఘటన

పాయకాపురం, జూలై 28: తాళం వేసిన ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. ఈ ఘటన పాయకాపురం ప్రాంతంలో ఆదివారం జరిగింది. ఉడాకాలనీకి చెందిన పరసా రామకృష్ణ పుట్టగొడుగుల వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం ఉదయం 11 గంటలకు కుటుంబసభ్యులతో కలిసి గుంటూరు వెళ్లాడు. తిరిగి సాయంత్రం 5 గంటలకు వచ్చాడు. ఇంట్లో వెనుక తలుపు తెరిచి ఉంది. లోపలికి వెళ్లి చూస్తే కబోర్డు లోని బీరువా తలుపులు తీసి ఉన్నాయి. ఇంట్లో చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చి నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీరువాలో ఉండాల్సిన 110 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దోబీఘాట్‌లో సమస్యలు పరిష్కరిస్తా

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ

కృష్ణలంక, జూలై 28: దోబీఘాట్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇచ్చారు. ఘాట్‌లో నీటి కోసం బోరును వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని కార్పొరేషన్ అధికారులను ఆయన ఆదేశించారు. వారంలో కార్పొరేషన్ ఆధ్వర్యంలో బోరు అమర్చకపోతే తన సొంత నిధులతో బోరు ఏర్పాటు చేస్తానన్నారు. 22వ డివిజన్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. దోబీఘాట్‌ను, స్వర్గపురి ప్రాంతాన్ని పరిశీలించారు. దోబీఘాట్‌లో షెడ్డును ఏర్పాటు చేయిస్తానని, డ్రెయినేజీ సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. స్వర్గపురి పరిసర ప్రాంతవాసులు దుమ్ము, ధూళి, పొగతో ఇబ్బందులు పడుతున్నారని ఈ సమస్యకు పరిష్కారం సాంకేతిక అంశాలతో ముడిపడి ఉందని తెలిపారు. స్వర్గపురి కింద భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకోకూడదని, స్వర్గపురికి కేటాయించిన స్థలంలో కూడా నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని, ఈ అంశాన్ని ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళతానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.అన్నారావు, చందన సురేష్, పెద్ది అన్నారావు, జి.కృష్ణ, కొండేటి వెంకట్రావ్, బండపల్లి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, నడికుప్పుల శివ, అల్లు క్రాంతికుమార్, గద్దె రమేష్, నడికొప్పుల రవి, పెద్దపల్లి రాజు, బాలబొమ్మ రంగారావు, మాధవి, వరలక్ష్మి, చింతాడ శారద పాల్గొన్నారు.

కొత్త పైపులైన్ ఏర్పాటు



కొత్త పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట: తూర్పు నియోజవర్గ పరిధిలోని కృష్ణవేణి స్కూల్ రోడ్డులో మున్సిపల్ స్కూల్ వద్ద అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ మెయిన్ లైన్ పైపులైన్ దెబ్బతిని అక్కడ సొరంగం ఏర్పడింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. రోడ్డు కుంగిపోయి ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని, ప్రమాదం జరగకుండా వెంటనే పాత పైపులైన్లు తొలగించి, కొత్త పైపులైన్ ఏర్పాటు చేయాలని అధికారులను గద్దె ఆదేశించారు. మున్సిపల్ సిబ్బంది ఆదివారం చేపట్టిన పనులను ఎమ్మెల్యే దగ్గరుండి పర్యవేక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చెన్నుపాటి కాంతిశ్రీ, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి గాంధీ, యలమంచిలి దేవేంద్ర, ఈఈ సామ్రాజ్యం, చిలకలపూడి నరసింహారావు, గద్దె రమేష్, చలసాని రమణ, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలకు మహనీయులు పేర్లు అభినందనీయం

● టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతికుమార్

పటమట, జూలై 28: సమాజానికి అనేక రకాలుగా సేవలందించిన సమాజసేవకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తల పేర్లను ప్రభుత్వ పథకాలకు పెట్టడం అభినందనీయమని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాశాఖ అమలు చేసే పథకాలకు సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ, అబ్దుల్ కలాం పేర్లను పెట్టినందుకు మంత్రి నారా లోకేశ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆయన అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వంలో అన్ని పథకాలను జగన్ పేరుతో అమలు చేశారన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం విద్యార్థులకు స్ఫూర్తిని కలిగించే వారి పేర్లతో పథకాలకు శ్రీకారం చుట్టడం మంచి పరిణామమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి మంచి నిర్ణయం తీసుకున్న ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వీఎంసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

చిట్టినగర్, జూలై 28: వీఎంసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు తిమసర్తి నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. ఆదివారం వీఎంసీ ప్రధాన కార్యాలయం అసోసియేషన్ హాలులో నిర్వహించిన వీఎంసీ యూనిట్ ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థ అన్ని విభాగాల నుంచి కార్యవర్గ సభ్యులను నియమిస్తామని ఆయన తెలిపారు. ఉద్యోగులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను అసోసియేషన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. పారిశుధ్య కార్మికులు, డ్రైవర్లు, మెకానిక్‌లు ఇతర అన్ని కేడర్లలో పలు సమస్యలను కార్యవర్గ సభ్యులు అసోసియేషన్ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మీసేవ, వీఎంసీ యూనిట్, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సలీం అహ్మద్, శివరాంప్రసాద్, కృష్ణదేవరాయలు, అసోసియేషన్ అధ్యక్షుడు జి.ప్రకాష్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.



సితార సెంటర్‌లో సభ్యత్వ నమోదులో పాల్గొన్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండలి రాజేష్, నగర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్

ముగిసిన జనసేన సభ్యత్వ నమోదు

కృష్ణలంక, జూలై 28: పది రోజులుగా నిర్వహిస్తున్న జనసేన పార్టీ నాలుగో విడత సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. కృష్ణలంక 21వ డివిజన్ పరిధిలో 1200 మంది రూ.500 చొప్పున చెల్లించి సభ్యత్వాన్ని తీసుకున్నారని జనసేన పార్టీ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతిరెడ్డి అనిత తెలిపారు. మరికొద్ది రోజులు నమోదు కార్యక్రమాన్ని పొడిగించే అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. సభ్యత్వం తీసుకుని ప్రమాదాలబారిన పడిన వారి కోసం జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రూ.19 కోట్లు అందజేశారని అనిత తెలిపారు. పోతిరెడ్డి రమణ, పి.మౌనిష, పి.రాహుల్, యన్నమనేని కృష్ణ, జీవీఎన్ రావు, డి.బాబి పాల్గొన్నారు.

500 మందికి సభ్యత్వం

భవానీపురం: 500 మందికి జనసేన క్రియాశీల సభ్యత్వం ఇచ్చినట్లు జనసేన రాష్ట్ర కార్యదర్శి, పశ్చిమ నియోజకవర్గ సభ్యత్వ నమోదు పరిశీలకుడు మండలి రాజేష్ అన్నారు. నగర ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్‌ను ఆయన అభినందించారు. సితార సెంటర్ వద్ద సభ్యత్వ నమోదు ముగింపు కార్యక్రమానికి రాజేష్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. నాయకులు మర్రి శివకృష్ణ, సిరిపురం జోషి కిరణ్, తంగా రవి, మానుకొండ సాయికుమార్, పెద్దిరెడ్ల సతీష్ పాల్గొన్నారు. 45వ డివిజన్‌లోని సితార సెంటర్‌లో డివిజన్ అధ్యక్షురాలు బొమ్ము గోవిందలక్ష్మి, రాంబాలతో పాటు దుర్గాకిషోర్, రెడ్డి మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేష్, సీనియర్ నాయకులు అజయ్ వర్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రామ్ లక్ష్మణరావు, నాబాని రామానాయుడు, పుష్పకుమార్, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సభ్యుల కుటుంబాలకు జనసేన అండ

విద్యాధరపురం: జనసేన సభ్యత్వం తీసుకుంటే వారి కుటుంబాలకు పార్టీ అండగా, తోడుగా ఉన్నట్టేనని జనసేన రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ అన్నారు. ఆదివారం 42వ డివిజన్‌లోని శివాలయం సెంటర్ వద్ద పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష, పార్టీ ప్రచార కమిటీ కో-ఆర్డినేటర్ తిరుపతి సురేష్, నాయకులు మంతా రాజేష్ అజయ్‌వర్మ, దొండపాటి సురేష్, ఎస్ఎన్ మూర్తి, దాసి రామ్మోహన్, ఆవుల ప్రసాద్, తిరుమరెడ్డి సురేష్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక

సత్యనారాయణపురం, జూలై 28: బ్రాహ్మణ వధూవరుల తల్లిదండ్రులు శాఖా బేధములు విస్మరించాలని, సర్దుబాటు ధోరణితో సంబంధాలు నిశ్చయం చేసుకుని బ్రాహ్మణ్యాన్ని కాపాడాలని బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి సూచించారు. బలరామకృష్ణమూర్తి అధ్యక్షతన ఆదివారం 42వ బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయవేదిక కార్యక్రమాన్ని సీతారామ కల్యాణ మండపంలో నిర్వహించారు. వివాహపరిచయ వేదికలో 450 మంది పాల్గొన్నారు. 14 సంబంధాలకు పరస్పర స్పందన, 7 సంబంధాలు కుదుర్చుకోవడం శుభపరిణామమని బలరామకృష్ణమూర్తి అన్నారు. సంఘం కార్యదర్శి తణుకు రామకృష్ణ, కోశాధికారి పెద్దిభొట్ల కాశీ విశ్వనాథం, కన్వీనర్ ఈవని శ్రీరామచంద్రమూర్తి, ఉపాధ్యక్షులు సీతంరాజు రాజశేఖర్, యద్దనపూడి శ్రీరామచంద్రమూర్తి, కొప్పరపు మారుతి, వరప్రసాద్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గవర్నర్‌పేట, జూలై 28: సీతారామపురం ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాలాంధ్రప్రెస్ ఏరియా, బోయపాటివారి వీధి, శ్రీనివాసరావు వీధి, నేతాజీ రోడ్డు, బారిస్టర్ వారి వీధి, బంకపల్లి వారి వీధి, పాపయ్య వీధి, కడియాలవారి వీధి, బెల్లపు శోభనాద్రివీధి, చలసాని వెంకటకృష్ణయ్య వీధి, కోవెలమూడి వారి వీధి, ఎంజీనాయుడు హాస్పిటల్ ఏరియా, దాసరివారి వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు.

సత్యనారాయణపురం: ముత్యాలంపాడు సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ నల్లగేటు ఫీడర్ పరిధిలో సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్, లెవన్ కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ బీవీ సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడంకివారి వీధి, రామాలయం వీధి, గడియారంవారి వీధి, అబ్బూరి వారి వీధి, లైబ్రరీ వీధి, గిరి వీధి, ఎన్నార్పీ రోడ్డు, జల్లావారి వీధి, పురుషోత్తం వీధి, ఏకేటీపీఎం స్కూల్ రోడ్డు, సీఐడీ కార్యాలయ రోడ్డు, స్వర హాస్పిటల్ రోడ్డు, భగత్‌సింగ్ రోడ్డు, దండమూరి రామ్మోహన్ వీధి, వందనపువారి వీధి, శివాలయం రోడ్డు, శివ రావు వీధి, బ్రహ్మయ్యపంతులు వీధి, నర్రావారి వీధుల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.



విజేతలతో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్

క్రీడలతో ఉన్నతస్థాయికి..

● జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ముగింపు సభలో ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్

విజయవాడ స్పోర్ట్సు, జూలై 28: విద్యతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా జీవితంలో ఉన్నతస్థానాలను అధిరోహించవచ్చునని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో కేడీబీఏ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఉమ్మడి కృష్ణా బ్యాడ్మింటన్ టోర్నీ ఆదివారం ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రదానోత్సవసభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్ విచ్చేశారు. కార్యక్రమంలో కేడీబీఏ అధ్యక్షుడు పోలినేని అంకమ్మచౌదరి, కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, టోర్నీ చీఫ్ రిఫరీ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అండర్-11 బాలబాలికల విజేతలుగా ఎండీ సుఫియాన్, కె.కెయా, బాలుర డబుల్స్‌లో సుఫియాన్, సీహెచ్ ముకుంద్, బాలికల్లో కె.ఆద్య, కె.కెయా, అండర్-13 బాలబాలికల్లో కె.దుర్గాఅఖిలేష్, కావ్యశ్రీరామ్, బాలుర డబుల్స్‌లో కె.మోక్షజ్ఞసాయి, కె.సుహాస్, బాలికల్లో కె.రుతిక, ఎం.భవిత, అండర్-15 బాలబాలికల్లో టి.హర్షల్, ఆర్.యశ్వితసాయి, బాలుర డబుల్స్‌లో కె.లోహిత్, టి.హర్షల్, బాలికల్లో డి.తేజస్విని, ఆర్.యశ్వితసాయి, అండర్-17 బాలిక విభాగంలో కె.గగనశ్రీచౌదరి, బాలికల డబుల్స్‌లో ఎ.బృందావని, కె.తనూజ, అండర్-19 బాలికల్లో కె.నేహ, డబుల్స్‌లో ఎండీ ఫాతిమా కె.తనూజ విజేతలుగా నిలిచారు.

దిక్సూచి
విజయవాడ ● సోమవారం 29 జూలై 2024
diksuchi@andhrajyothy.com


ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 స్థానంలో భారతీయ సాక్ష్య అధినియమ్‌ను ప్రవేశపెట్టారు. గతంలో ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లో 167 సెక్షన్లు ఉండగా, ప్రస్తుతం బీఎస్ఏలో 170 సెక్షన్లు ఉన్నాయి. గత చట్టంలోని 23 సెక్షన్లలో మార్పులు చేశారు.

కొత్త క్రిమినల్ చట్టాలు- పార్ట్ 3

భారతీయ సాక్ష్య అధినియమ్

కీలకాంశాలు

- ఈ చట్టం 'డాక్యుమెంట్' నిర్వచనాన్ని విస్తరించింది. ఎలక్ట్రానిక్స్/ డిజిటల్ రికార్డులను కూడా ఈ చట్టం పేపర్ డాక్యుమెంట్స్‌తో సరిసమాన సాక్ష్యాలుగా పరిగణిస్తోంది. ఈ-మెయిల్స్, సర్వర్ లాగ్స్, కంప్యూటర్స్, స్మార్ట్‌ఫోన్స్, ల్యాప్‌టాప్స్, ఎస్సెమ్మెస్‌లు, వెబ్‌సైట్‌లు, లోకేషనల్ ఎవిడెన్స్ వంటి డిజిటల్/ ఎలక్ట్రానిక్స్ సాక్ష్యాలను దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.
- అంతేకాక ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా సాక్ష్యులు, బాధితులు, ముద్దాయిలు తమ వాంగ్మూలం ఇవ్వడానికి ఈ కొత్త చట్టం అనుమతిస్తూ, దానికి వ్యక్తిగత ప్రత్యక్ష వాంగ్మూలంతో సరిసమాన స్థాయి కల్పించింది.
- ముద్దాయి నేరం అంగీకారాన్ని, ఇకపై క్రిమినల్ కేసుల్లో తప్పనిసరిగా పరిగణించక్కర్లేదు. బెదిరింపులు, ప్రలోభాలు తదితరాల కారణంగా నేరాంగీకారం జరిగినట్లు న్యాయమూర్తి భావిస్తే దానిని పరిగణనలోకి తీసుకోనవసరం లేదు.
- సోదాలు, నేర సంఘటన స్థల పరిశీలన సమయంలో తప్పనిసరిగా సంబంధిత అధికారి ఫోన్ ద్వారా చిత్రీకరణ జరపాల్సి ఉంటుంది. అలాంటి దృశ్య, శ్రవణ చిత్రీకరణలు జతచేయని చార్జిషీట్లు చెల్లవు. ఈవిధంగా చిత్రీకరించిన దృశ్య, శ్రవణ చిత్రీకరణలు నేరుగా క్లౌడ్ బేస్డ్ ప్లాట్‌ఫాంలోకి అప్‌లోడ్ చేయవచ్చు. టాంపరింగ్, అవకతవకలు నివారించడానికి ఎటువంటి జాప్యం లేకుండా వీటిని కోర్టుకు సమర్పించాల్సి ఉంది.
- కోర్టుల్లో పరీక్షించలేని భారీ పరిణామం గల డాక్యుమెంట్స్ లేదా సాంకేతికపరమైన డాక్యుమెంట్ల పరిశీలనలో నిష్ణాతులైన వారు ఇచ్చే వాంగ్మూలాన్ని సెకండరీ ఎవిడెన్స్(ద్వితీయస్థాయి సాక్ష్యం)గా పరిగణిస్తారు.
- ఒక నేరంలో భాగమైన వ్యక్తులను సామూహికంగా విచారిస్తున్నప్పుడు (జాయింట్ ట్రెయిల్) వారిలో ఎవరైనా అరెస్ట్ వారెంట్ అందుకోకపోయినా, పరారీలో ఉన్నా సరే వారిని కూడా కలిపే న్యాయవిచారణ చేస్తారు.



విమర్శలు

- సాక్ష్యాధారాలు చిత్రీకరించే సమయంలో, తదుపరి కూడా నేటి ఆధునిక సాంకేతికతల సహాయంతో, సాంకేతికపరమైన లోపాల సహకారంతో ఏమార్చే అవకాశం ఉంది.
- ఎలక్ట్రానిక్ రికార్డులు ధృవీకరణ పొంది ధృవపత్రాలను కలిగి ఉన్నప్పుడే వాటిని డాక్యుమెంట్స్‌గా పరిగణిస్తారు. కానీ బీఎస్ఏలో సాధారణ డిజిటల్, ఎలక్ట్రానిక్ సమాచారాన్ని కూడా సాక్ష్యంగా డాక్యుమెంట్ల స్థాయి కల్పించి పరిగణించడం వైరుధ్యాలకు కారణం అవవచ్చు.
- పోలీసు కస్టడీలోని వ్యక్తి శరీరంపై ఉన్న గాయాలకు పోలీసులు బాధ్యత వహించాలి అనే అత్యున్నత న్యాయస్థానం, లా కమిషన్ సిఫార్సులకు మన్నన దక్కలేదు. అట్టి కట్టుబాటు పోలీసులపై ఏర్పడలేదు.
- కేవలం ఏవో కొన్ని అంశాలు మినహా పాత చట్టమే కొత్తరూపుతో కొనసాగింపునకు వచ్చింది. సాంకేతిక అంశాల జోడింపు తప్ప ఇతరత్రా పెద్దగా విప్లవాత్మక మార్పులు ఏమీ లేవు.
- కొన్ని క్రిమినల్ కేసుల్లో ఫోరెన్సిక్ దర్యాప్తు తప్పనిసరి చేశారు. కానీ నేర స్థలానికి మొదట వెళ్లేది పోలీసులు. వారి సోదాలు, పరిశీలనల చిత్రీకరణల వల్ల ఫోరెన్సిక్ ఆధారాలు భంగపడవచ్చు.

అయితే సాంకేతిక అంశాల జోడింపుతో ఈ కొత్తచట్టం విచారణలో వేగాన్ని తీసుకురావడానికి తోడ్పడటంతోపాటు మారుతున్న నేరాల సరళి నేపథ్యంలో సాక్ష్యాల పరిధిని విస్తరించిందనడం అతిశయోక్తి కాదు. అదేవిధంగా నేరవిచారణలో, దర్యాప్తులో అక్రమాలను నిరోధించేందుకు సాంకేతికపరంగా చేసిన మార్పులు పారదర్శకతను పెంపొందించగలవు. అయితే గత చట్టంలోని అన్ని అంశాలను పూర్తిగా సంస్కరించలేదు. కేవలం కొద్దిపాటి అంశాల్లోనే మార్పులు చేసి కొత్త చట్టాన్ని రూపొందించారు. అయినప్పటికీ దశాబ్దాల తరబడి క్రిమినల్ చట్టాల్లో సంస్కరణలకు నోచుకోని పరిస్థితుల్లో దీనిని ఒక ముందుడుగు గానే పరిగణించాలి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఘనము

రీజనింగ్

I) 8 సెం॥ మీ॥ల కొలత ఉన్న చతురస్రాకార చెక్క ఘనానికి అన్ని వైపుల ఎరుపు రంగును వేశారు. ఇప్పుడు ఈ ఘనాన్ని ప్రతి అంచు 2 సెం॥ మీ॥ల కొలత ఉండే చిన్న చిన్న ఘనాలుగా విభజించారు. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

1. ఆ విభజన వల్ల మొత్తం ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 20 బి) 40 సి) 56 డి) 64
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 8 బి) 6 సి) 12 డి) 16
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 16 బి) 24 సి) 32 డి) 48
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 12 బి) 18 సి) 10 డి) 24
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 18 బి) 12 సి) 8 డి) 6

సమాధానాలు:
1. (డి) 2. (ఎ) 3. (బి) 4. (డి) 5. (సి)

వివరణ:

1. $n = \frac{\text{పెద్ద ఘనము యొక్క అంచు పొడవు}}{\text{చిన్న ఘనము యొక్క అంచు పొడవు}} = \frac{8}{2} = 4$

మొత్తం ఘనాలు = $(n^3) = 4^3 = 64$.

2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే 8 (ఫిక్స్ ఎప్పటికి మారదు).
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
$(n - 2) \times 12 = (4 - 2) \times 12 = 2 \times 12 = 24$
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
$(n-2)^2 \times 6 = (4-2)^2 \times 6$
$= (2)^2 \times 6 = 4 \times 6 = 24$
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు
$(n-2)^3 = (4-2)^3 = 2^3 = 8$

సులభపద్ధతి: 8 సెం.మీ. కొలత ఉన్న ఘనం 2 సెం॥ మీ॥ కొలతతో విభజిస్తే అంటే నాలుగు నాలుగుగా ఏర్పడుతుంది. ఇప్పుడు నాలుగు నాలుగుగా ఉండే రేఖాచిత్రం ఔట్‌సైడ్ మాత్రమే వేసుకోవాలి.

3	2	2	3
2	1	1	2
2	1	1	2
3	2	2	3

1. మొత్తం ఘనాలు అంటే $4^3 = 64$
2. మూడు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే కార్నర్ 4ని 2తో గుణించాలి. (2 అంటే పై వైపు 4 కార్నర్స్ కింది వైపు 4 కార్నర్స్ అని అర్థం) $4 \times 2 = 8$
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న, ఘనాలు అంటే కార్నర్స్ కాకుండా చుట్టూ ఉన్న వాటిని లెక్కించి 3తో గుణించాలి. (3 అంటే పై వైపు, కింద వైపు, మధ్య వైపు) పై రేఖాచిత్రం గమనించిన కార్నర్స్‌ని తీసివేయగా చుట్టూ భాగంలో మిగిలినవి 8. దీనిని 3తో గుణించగా $8 \times 3 = 24$.
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే చుట్టూ భాగాన్ని తొలగించి మధ్యలోని భాగంలో గల వాటిని లెక్కించి 6తో గుణించాలి. (6 అంటే ఆరు ముఖాలు అని అర్థం) పై రేఖాచిత్రం గమనించిన చుట్టూ భాగాన్ని తీసివేయగా మధ్యలో 4 ఉన్నాయి. కావున $4 \times 6 = 24$.
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు అంటే మొత్తం - (ఒక ముఖానికి, రెండు ముఖాలకు, మూడు ముఖాలకు రంగును కలిగి ఉండే ఘనాలు)
$64-(24+24+8) = 64 - 56 = 8$ సమాధానం అవుతుంది.

II) 15 సెం॥ మీ॥ల కొలత ఉన్న చతురస్రాకార చెక్క ఘనానికి అన్ని వైపుల పసుపు రంగును వేశారు. ఇప్పుడు ఈ ఘనాన్ని ప్రతి అంచు 3 సెం.మీ.ల కొలత ఉండే చిన్న చిన్న ఘనాలుగా విభజించారు. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

1. ఆ విభజన వలన మొత్తం ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 100 బి) 150 సి) 125 డి) 175
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 16 బి) 8 సి) 24 డి) 12
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 36 బి) 12 సి) 48 డి) 24
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 48 బి) 54 సి) 63 డి) 52
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 12 బి) 18 సి) 27 డి) 36

సమాధానాలు: 1. (సి) 2. (బి) 3. (ఎ) 4. (బి) 5. (సి)

వివరణ:

1. $n = \frac{\text{పెద్ద ఘనము యొక్క అంచు పొడవు}}{\text{చిన్న ఘనము యొక్క అంచు పొడవు}} = \frac{15}{3} = 5.$

మొత్తం ఘనాలు $n^3 = 5^3 = 125$

2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే 8 (ఫిక్స్ ఎప్పటికి మారదు)
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
$(n-2) \times 12 = (5-2) \times 12 = 3 \times 12 = 36$
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
$(n-2)^2 \times 6 = (5-2)^2 \times 6$
$= 3^2 \times 6 = 9 \times 6 = 54$
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు $= (n-2)^3$
$= (5-2)^3$
$= 3^3 = 27.$

సులభ పద్ధతి: 15 సెం.మీ. కొలత ఉన్న ఘనం 3 సెం.మీ.ల కొలతతో విభజించడం అంటే 15÷3=5 అయిదు అయిదుగా ఏర్పడుతుంది. ఇప్పుడు అయిదు అయిదుగా ఉండే రేఖాచిత్రం వన్ సైడ్ మాత్రమే వేసుకోవాలి.

3	2	2	2	3
2	1	1	1	2
2	1	1	1	2
2	1	1	1	2
3	2	2	2	3

1. మొత్తం ఘనాలు అంటే $5^3 = 125$.
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా కార్నర్స్ 4ని 2తో గుణించాలి. (2 అనగా పై వైపు 4 కార్నర్స్, కింది వైపు 4 కార్నర్స్ అని అర్థం) $4 \times 2 = 8$.
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా కార్నర్స్ కాకుండా చుట్టూ ఉన్న వాటిని లెక్కించి 3తో గుణించాలి. (3 అనగా పై వైపు, కింది వైపు, మధ్యవైపు) పై రేఖాచిత్రం గమనిస్తే కార్నర్స్‌ని తీసివేయగా చుట్టూ భాగంలో మిగిలింది 12. దీనిని 3తో గుణిస్తే $12 \times 3 = 36$.
4. ఒక ముఖానికి మాత్రమే రంగును ఉన్న ఘనాలు అనగా చుట్టూ భాగాన్ని తొలగించి మధ్యలో ఉండే వాటిని లెక్కించి 6తో గుణించాలి. (6 అనగా ఆరు ముఖాలు అని అర్థం)పై రేఖాచిత్రం గమనిస్తే చుట్టూ భాగాన్ని తీసివేయగా మధ్యలో 9 ఉన్నాయి. కాబట్టి $9 \times 6 = 54$.
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు అంటే మొత్తం - (ఒక ముఖానికి, రెండు ముఖాలకు, మూడు ముఖాలకు రంగును కలిగి ఉండే ఘనాలు)
$125 - (54+36+8)$
$125 - 98 = 27$ సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

పారిస్ వీధుల్లో పలకరింపు



ప్రస్తుతం మెగా ఫ్యామిలీతో కలసి రామ్‌చరణ్ పారిస్‌లో ఒలింపిక్స్ క్రీడా సంబరాలను ఆస్వాదిస్తున్నారు. భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు మహిళల సింగిల్స్‌లో తొలి విజయాన్ని నమోదు చేశారు. వీరిద్దరూ పారిస్ వీధుల్లో అనుకోకుండా ఒకరికొకరు ఎదురు పడ్డారు. చిరునవ్వుతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. రామ్‌చరణ్ పెంపుడు కుక్క పిల్ల 'రైమ్' తలనిమిరారు సింధు. వారిద్దరూ సరదాగా మాట్లాడుకుంటున్న వీడియో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇద్దరూ గేమ్ ఛేంజర్‌లే మీ కలయిక అద్భుతం అంటూ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' చిత్రంలో నటిస్తున్నారు.

సరికొత్త కాన్సెప్ట్‌తో...



వైవిధ్యమైన చిత్రాలతో దూసుకుపోతున్న కథానాయకుడు అల్లరి నరేశ్. ఆయన హీరోగా 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఓ నూతన చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రుహాని శర్మ హీరోయిన్. సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమాను ఆరంభించారు. సరికొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతిని అందిస్తుందని మేకర్స్ తెలిపారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: రామకృష్ణ అర్రం, కెమెరా: జిజు సన్నీ, సంగీతం: జిబ్రాన్.



కొత్త తరహా పాత్ర

తమిళ హీరో ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న 'కుబేర' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ధనుష్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. ఇదివరకు ఎన్నడూ చేయని పాత్రను ధనుష్ ఇందులో పోషిస్తున్నారు. ఆయన పెర్ఫార్మెన్స్ నెక్ట్స్ లెవల్‌లో ఉంటుందని మేకర్స్ చెప్పారు. హై బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ సోషల్ డ్రామాలో రష్మిక కథానాయిక. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహనరావు తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఫిల్మ్ ఛాంబర్ కొత్త అధ్యక్షుడిగా భరత్ భూషణ్



తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి ప్రస్తుత అధ్యక్షుడు దిల్ రాజు పదవీకాలం ముగియడంతో ఆదివారం ఎన్నికలు జరిపి నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు.. ఈసారి డిస్ట్రిబ్యూటర్ సెక్టార్ నుంచి పి.భరత్ భూషణ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కె.అశోక్‌కుమార్ గెలిచారు. ఈ సందర్భంగా నిర్మాత సి.కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ 'పరిశ్రమలో చాలా సమస్యలు ఉన్నాయి. అందరం కలసి మంచి నిర్ణయాలతో ముందుకు వెళతాం. ఈ రోజు గెలిచిన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మాటకు కట్టుబడి ఉండే వ్యక్తులు. గెలిచిన వారికి సభ్యులందరి మద్దతు ఉంటుంది' అన్నారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 'ఛాంబర్ అంతా ఒక కుటుంబం. పరిశ్రమలోని సమస్యలను ఎలా ఎదుర్కోవాలో అందరం కలసి చర్చిస్తాం. భారతదేశంలోని అన్ని పరిశ్రమలను ఒక తాటి మీదకు తీసుకు వచ్చి ముందుకు వెళతాం' అన్నారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ భరత్ భూషణ్ కృతజ్ఞతలు తెలిపారు.


'మిరపకాయ్' కంటే మెరుగ్గా



రవితేజ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో తయారవుతున్న 'మిస్టర్ బచ్చన్' రిలీజ్ డేట్ దగ్గర పడుతుండడంతో నిర్మాతలు ప్రమోషన్స్‌లో దూకుడు పెంచారు. ఇందులో భాగంగా ఆదివారం టీజర్ విడుదల చేశారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో తెర కెక్కిన ఈ చిత్రంలో ఓ పవర్‌ఫుల్ వ్యక్తిపై రైడ్ చేసే ఇన్‌కమ్ టాక్స్ అధికారిగా రవితేజ నటిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. జగపతిబాబు కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో మీడియాతో హరీశ్ శంకర్ మాట్లాడుతూ '1980-90ల మధ్య జరిగే కథ ఇది. ల్యాండ్ ఫోన్లు, క్యాసెట్ రికార్డింగ్ సెంటర్లు, చేతక్ స్కూటర్లు, కుమార్ షాను పాటలు.. ఇవన్నీ 'మిస్టర్ బచ్చన్' ఫస్ట్ హాఫ్‌లో నోస్టాలజిక్ మూమెంట్స్‌గా ఉంటాయి. అలాగే అమితాబ్ గారిని బేస్ చేసుకుని కొన్ని ఐటెమ్స్ ఉంటాయి. నా కెరీర్‌లో చాలా ఫాస్ట్‌గా.. కేవలం 78 రోజుల్లో ఈ సినిమా తీశానంటే కారణం నిర్మాత విశ్వప్రసాద్‌గారు. ఇంతకుముందు మా కాంబినేషన్‌లో వచ్చిన 'మిరపకాయ్' కంటే మెరుగ్గా ఈ సినిమా ఉంటుంది' అన్నారు. 'ఆగస్టు 15న సినిమాను విడుదల చేస్తున్నాం' అని విశ్వప్రసాద్ తెలిపారు.



సుకుమార్ సతీమణి సమర్పణలో..



రావు రమేశ్ హీరోగా నటించిన 'మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం' ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు సుకుమార్ సతీమణి తబిత సమర్పణలో వస్తున్న తొలి చిత్రం ఇది కావడం విశేషం. కంటెంట్ నచ్చడంతో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ ఆగస్టు 23న విడుదల చేస్తోంది. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రామ్‌చరణ్ ఆదివారం విడుదల చేశారు. 'మారుతీనగర్ సుబ్రహ్మణ్యం' చిత్రంలో ఎటకారం ఎక్కువున్న సుబ్రహ్మణ్యం భార్యగా ఇంద్రజ, అత్తగారిగా అన్నపూర్ణమ్మ నటించారు. 'మా నాన్న అల్లు అరవింద్' అంటూ గొప్పలు చెప్పి ఓ డబ్బున్న అమ్మాయిని ప్రేమలో పడేసే సుబ్రహ్మణ్యం కొడుకుగా అంకిత్ కొయ్య, అతని సరసన రమ్య పసుపులేటి నటించారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు.



ఆ లోటును భర్తీ చేసేలా...

'నువ్వేకావాలి', 'మన్మథుడు', 'మల్లీశ్వరి' వంటి చిత్రాలతో పాపులర్ దర్శకుడిగా మారారు కె. విజయ్‌భాస్కర్. ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఉషా పరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' అనేది ఉప శీర్షిక. ఈ లవ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లో శ్రీకమల్, తాన్వీ ఆకాంక్ష, సూర్య ప్రధాన తారాగణంగా నటించారు. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా కె. విజయ్‌భాస్కర్ మీడియాతో ముచ్చటించారు. 'ఈ సినిమా ప్రేమకు సరికొత్త నిర్వచనం ఇస్తుంది. ఈ మధ్య కాలంలో ప్రేమ కథలు చాలా తక్కువగా వస్తున్నాయి. ఇది ఆ లోటును భర్తీ చేస్తుంది. ఇంటిల్లిపాదీ చూడదగిన చిత్రమిది. ఉషా అనే అమ్మాయి పెళ్లి చుట్టూ సినిమా కథాంశం సాగుతుంది. మా అబ్బాయి కమల్ కోసం ప్రత్యేకంగా కథ రాసుకుని ఈ సినిమా చేయట్లేదు. ఈ కథకు తను యాప్ట్ కాబట్టే కమల్‌ను హీరోగా ఎంచుకున్నాను. కమల్, కథానాయిక తాన్వీ నటన చాలా సహజంగా.. అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ సినిమాకు సంగీతం ప్రధానాకర్షణ. ఆర్.ఆర్.ధ్రువన్ అద్భుతమైన పాటలు అందించారు. సినిమా యూత్‌తో పాటు ఫ్యామిలీని కూడా ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

కాలరెత్తి తిరగరా...



దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. మీనాక్షి చౌదరి కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 7న విడుదలవుతోంది. ఆదివారం దుల్కర్ సల్మాన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం 'లక్కీ భాస్కర్' టైటిల్ ట్రాక్‌ను విడుదల చేసింది. 'శభాష్ సోదరా...కాలరెత్తి తిరగరా...కరెన్సీ దేవి నిను వరించెరా' అంటూ సాగే ఈ గీతానికి రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. జీవీ ప్రకాశ్ కుమార్ స్వరాలందించారు.

ఆకాశంలో ఒక తార

పవన్ సాధినేని దర్శకత్వంలో దుల్కర్ కథానాయకుడిగా నటించబోయే కొత్త చిత్రంపై అధికారిక ప్రకటన వచ్చింది. ఈ సినిమాకు 'ఆకాశంలో ఒక తార' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్ బాక్స్ మీడియా సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో రైతు లుక్‌లో దుల్కర్ కనిపించారు. త్వరలో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించనున్నట్లు మేకర్స్ తెలిపారు.

పారిస్ ఒలింపిక్స్ (జూలై 26 - ఆగస్టు 11)

మను చరిత్ర

10మీ. ఎయిర్ పిస్టల్‌లో మూడో స్థానం

షూటర్ మను భాకర్‌కు కాంస్యం

భగవద్గీత చూపిన దారిలో..

హరియాణా పేరు చెప్పగానే ప్రఖ్యాత రెజ్లర్లు, స్టార్ బాక్సర్ల పేర్లు గుర్తుకొస్తాయి. అయితే ఆ రాష్ట్రం నుంచి షూటింగ్ పతకంతో ప్రపంచం దృష్టిని ఆకర్షించింది మనుభాకర్. కెరీర్ ప్రారంభంలో టెన్నిస్, స్కేటింగ్, బాక్సింగ్, వాలీబాల్ జాతీయ పోటీల్లో మను దాదాపు 60 పతకాలు సొంతం చేసుకుంది. కానీ షూటింగ్ నేర్చుకోవాలన్న ఆమె ఇష్టాన్ని కాదనలేక తల్లిదండ్రులు రూ.1.80 లక్షలు పెట్టి తొలి పిస్టల్‌ను కొన్నారు. అలా 12 ఏళ్ల వయసులో షూటర్‌గా ప్రస్థానం ప్రారంభించిన మను 19 ఏళ్లు వచ్చేసరికి టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. అయితే, ఆ ఒలింపిక్స్‌లో పిస్టల్ సరిగ్గా పని చేయక రిక్త హస్తాలతో భారత్‌కు తిరిగొచ్చిన మను నిరీక్షణ ఎట్టకేలకు పారిస్ విశ్వక్రీడల్లో కాంస్యం పతకంతో ఫలించింది.

ఆరంభం నుంచీ సంచలనమే..

14 ఏళ్ల వయసులోనే ఒలింపియన్, మాజీ వరల్డ్ నెంబర్ వన్ హీనా సిద్ధూకు మనుభాకర్ షాకిచ్చింది. సాధన ఆరంభించిన ఏడాదికే 2017 జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్స్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్లో హీనాను ఓడించడంతో పాటు ఆమె రికార్డును చెరిపేసింది. అదే ఏడాది ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో రజతంతో మెరిసి సత్తా చాటింది. ఆతర్వాత జరిగిన ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ షూటింగ్ వరల్డ్‌కప్ 10 మీ., ఎయిర్ పిస్టల్ అర్హత పోటీల్లో ప్రపంచ రికార్డును బద్దలుకొట్టింది. ఈ వరల్డ్‌కప్ ఫైనల్లో మూడుసార్లు ఐఎస్ఎస్ఎఫ్ విజేత, సిలైన్ గోబెర్‌విల్లెను ఓడించి పసిడి పతకం సాధించి చరిత్ర సృష్టించింది.

2018లో మోత మోగించింది

మను కెరీర్‌లో 2018 చాలా ప్రత్యేకమైంది. గోల్డ్‌కోస్ట్ కామన్వెల్త్ క్రీడల్లో 10 మీ., ఎయిర్ పిస్టల్ విభాగంలో స్వర్ణం కొల్లగొట్టి సంచలనం సృష్టించింది. అదే ఏడాది జూనియర్ వరల్డ్‌కప్‌లో 10 మీ., ఎయిర్ పిస్టల్ కేటగిరీలో పసిడి, మిక్స్‌డ్‌లో కాంస్యం సాధించి సత్తా చాటింది. అర్జెంటీనాలో జరిగిన యూత్ ఒలింపిక్స్ 10 మీ., ఎయిర్ పిస్టల్‌లో స్వర్ణం సాధించి ఈ క్రీడల్లో పతకం నెగ్గిన తొలి షూటర్‌గా చరిత్రకెక్కింది.

గీతాసారంతో ముందుకు..

పోటీ ఏదైనా పతకం ఖాయమనే రీతిలో దూసుకెళ్తున్న మనుకు టోక్యో ఒలింపిక్స్‌లో చుక్కెదురైంది. ఒలింపిక్స్ ముందు వరకు మంచి ఫామ్‌లో ఉన్న మను, విశ్వక్రీడల్లో పిస్టల్ సరిగ్గా పనిచేయక ఒత్తిడికిలోనై పతక రేసులో విఫలమైంది. ఈ క్రమంలో నైరాశ్యంతో ఇంటికొచ్చిన మనుకు ఆమె తల్లిదండ్రులు భగవద్గీతను ఇచ్చారు. స్వతహాగా షూటింగ్ రేంజ్‌లో చిన్నపాటి విరామం లభించినా పుస్తకాలు చదివే అలవాటున్న మను ఆ తర్వాత నుంచి గీత చదవడం ప్రారంభించింది. అందులో శ్రీకృష్ణుడు అర్జునునికి ఉపదేశించిన ఓ అంశం ఆమెను బాగా ఆకర్షించింది. 'భగవద్గీతను చాలా చదివాను. చేసే పనిమీదే దృష్టి పెట్టు. కర్మ ఫలితం మీద కాదు. ఫలితం ఎలావున్నా స్వీకరించు' అన్న మాటలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని తెలిపింది. ఫైనల్‌కు ముందు కూడా భగవద్గీత చదివానని చెప్పింది.



ఒలింపిక్స్‌లో మన పతక షూటర్లు

రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్	డబుల్ ట్రాప్	రజతం	2004 ఏథెన్స్
అభినవ్ బింద్రా	10మీ. ఎయిర్ రైఫిల్	స్వర్ణం	2008 బీజింగ్
గగన్ నారంగ్	10మీ. ఎయిర్ రైఫిల్	కాంస్యం	2012 లండన్
విజయ్ కుమార్	25మీ. ర్యాపిడ్ ఫైర్ పిస్టల్	రజతం	2012 లండన్
మను భాకర్	10మీ. ఎయిర్ పిస్టల్	కాంస్యం	2024 పారిస్

మను భాకర్ సాధించింది. పుష్కర కాలం ఎదురుచూపులకు తెర దించుతూ షూటింగ్‌లో దేశానికి ఓ పతకం అందించింది. పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలన్నట్టుగా, మూడేళ్ల క్రితం టోక్యో గేమ్స్‌లో ఎదురైన ఓటమికి పారిస్‌లో బదులు తీర్చుకుంది. కుంగుబాటును అధిగవిస్తూ.. లక్ష్యాన్ని గుర్తు చేసుకుంటూ.. అంతులేని ఆత్మవిశ్వాసంతో.. ఫైనల్స్‌కు చేరిన ఈ 22 ఏళ్ల యువ షూటర్ ఈసారి అంచనాలను వమ్ము చేయలేదు. గురి తప్పని తూటాలతో ఇప్పుడు ఒలింపిక్ కాంస్య పతకాన్ని సగర్వంగా అందుకుంది. అంతేనా.. ఈ ఫీట్ సాధించిన తొలి భారత మహిళా షూటర్‌గానూ చరిత్ర సృష్టించింది.

ఒలింపిక్స్‌లో భారత్ బోణీ

పారిస్: ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌లో రెండో రోజే భారత్ పతకంతో మురిసింది. అందరి అంచనాలను నిజం చేస్తూ.. 140 కోట్ల భారతావనిని ఆనంద డోలికల్లో ముంచెత్తుతూ.. 22 ఏళ్ల హరియాణా షూటర్ మను భాకర్ కాంస్యం సాధించింది. ఆదివారం జరిగిన మహిళల 10మీ. ఎయిర్ పిస్టల్ ఫైనల్స్‌లో 221.7 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. తద్వారా షూటింగ్‌లో దేశానికి పతకం అందించిన తొలి మహిళా షూటర్‌గా చరిత్ర సృష్టించింది. టోక్యో గేమ్స్‌లో మను మూడు విభాగాల్లో పోటీ పడి తీవ్రంగా నిరాశపరిచిన విషయం తెలిసిందే. కానీ ఈసారి మాత్రం బరిలోకి దిగిన తొలి ఈవెంట్‌లోనే పోడియం ఎక్కి శభాష్ అనిపించుకుంది. అలాగే ఫైనల్స్‌లో కొరియాకు చెందిన ఓహ్ యే జిన్ (243.2) ఒలింపిక్ రికార్డుతో స్వర్ణం సాధించగా.. ఆ దేశానికే చెందిన కిమ్ యెజి (241.3) రజతం అందుకుంది. ఇక 2012లో గగన్ నారంగ్, విజయ్ కుమార్‌ల తర్వాత షూటింగ్‌లో దేశానికి దక్కిన మరో పతకం ఇదే కావడం గమనార్హం. ఓవరాల్‌గా దేశానికి పతకం అందించిన ఐదో షూటర్‌గా మను నిలిచింది.

అంచనాలతో బరిలోకి..: వ్యక్తిగత విభాగంలో 20 ఏళ్ల తర్వాత ఫైనల్స్‌కు చేరిన తొలి భారత మహిళా షూటర్‌గా మను భాకర్.. పోటీల తొలి రోజే పతక ఆశలను కల్పించింది. దీనికి తగ్గట్టుగానే ఆదివారం చెదరని చిరునవ్వుతో.. పతకంపై విశ్వాసంతోనే పోటీలను ఆరంభించింది. ఇందులో ఆద్యంతం టాప్-3లోనే కొనసాగడం తనలోని నిలకడను చూపుతుంది. తొలి సిరీస్‌ను మను మూడు ఇన్నర్ 10లతో దీటుగా ఆరంభించింది. ఇక రెండో సిరీస్ ఐదు షాట్లతో 100.3 పాయింట్లతో చివరి వరకు కూడా టాప్-3 లోనే పోటీ ఇచ్చింది. ఎలిమినేషన్ రౌండ్‌లోనైతే కిమ్ ఎజితో మను రెండో స్థానం కోసం పోటీపడింది. ఆఖరి రెండు షాట్లను ప్రత్యర్థికంటే మెరుగ్గా 10.1, 10.3గా మలిచినప్పటికీ కిమ్ మొత్తం పాయింట్ల సంఖ్య మను కన్నా ఎక్కువగా ఉన్నాయి. దీంతో భాకర్ మూడో స్థానానికే పరిమితంకాగా తొలి రెండు స్థానాల కోసం కొరియా షూటర్లు తలపడ్డారు.

ఫైనల్స్‌కు అర్జున్, రమిత

తొలి రోజు మిక్స్‌డ్ ఈవెంట్‌లో నిరాశపర్చిన అర్జున్ బబుత పురుషుల 10మీ. ఎయిర్ పిస్టల్ అర్హత పోటీల్లో సత్తా చాటుకున్నాడు. 630.1 పాయింట్లతో ఏడో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు చేరాడు. అయితే ఇదే విభాగంలో మరో భారత షూటర్ సందీప్ సింగ్ (629.3) మాత్రం 12వ స్థానంలో నిలిచి పోటీల నుంచి తప్పుకొన్నాడు. అలాగే మహిళల 10మీ. ఎయిర్ రైఫిల్‌లో రమిత జిందాల్ 631.5 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచి ఫైనల్స్‌కు వెళ్లింది. చివరిసారిగా 2004లో సుమ శిరూర్ ఇదే విభాగంలో ఫైనల్‌కు చేరింది. కానీ రమిత సహచరి ఎలవేనిల్ 630.7 పాయింట్లతో పదో స్థానంలో నిలిచి నిరాశపరిచింది.

టోక్యో ఓటమి వెంటాడింది

'చివరి ఒలింపిక్స్‌లో నా ప్రదర్శన నిరుత్సాహపరిచింది. ఆ పరాభవం నుంచి బయటపడేందుకు చాలా సమయమే పట్టింది. అందుకే ప్రస్తుత ఫలితంతో సంతోషంగా ఉన్నా. అలాగే షూటింగ్‌లో మెడల్ కోసం దేశం ఎంతో కాలంగా ఎదురుచూస్తోంది. నా ద్వారా ఆ లోటు తీరినందుకు సంతృప్తిగా అనిపిస్తోంది. కఠోర శ్రమతోనే ఇది సాధ్యమైంది. అయితే చివరి షాట్ సమయంలో నాలో శక్తినంతా కూడదీసుకోవాల్సి వచ్చింది. వచ్చేసారి మరింత ఉత్తమ ప్రదర్శన కనబరుస్తాను. - మను భాకర్

అభినందనల వెల్లువ

'కాంస్యంతో పతక బోణీ చేసినందుకు మను భాకర్‌కు హృదయపూర్వక అభినందనలు. అలాగే ఈ ఫీట్ సాధించిన తొలి మహిళా షూటర్‌గా నిలవడం ఎందరికో ప్రేరణగా నిలుస్తుంది. భవిష్యత్‌లో మరింత ఎత్తుకు ఎదగాలని ఆశిస్తున్నా' - రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

'పారిస్ గేమ్స్‌లో దేశానికి తొలి పతకం అందించిన మను భాకర్‌కు అభినందనలు. అలాగే ఒలింపిక్స్‌లో మెడల్ దక్కించుకున్న తొలి మహిళా షూటర్‌గా నిలవడం మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. ఇది అత్యద్భుత ప్రదర్శన' - ప్రధాని నరేంద్ర మోదీ

'పతకాల పట్టికలో, షూటింగ్ రేంజిలో నీదైన ముద్ర వేయగలిగావు. టోక్యో వైఫల్యం తర్వాత పారిస్‌లో పతకం గెలవాలనే సంకల్పం నెరవేర్చుకున్నందుకు అభినందనలు' - సచిన్ టెండూల్కర్

పారిస్ ఒలింపిక్స్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో కాంస్య పతకం నెగ్గిన మనుకు శుభాకాంక్షలు. ఈ పతకం దేశానికి ఎంతో ప్రత్యేకమైనది. - కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బ్యాడ్మింటన్: సింధు అలవోకగా..

హ్యాట్రిక్ పతక వేటలో ఉన్న ఏస్ షట్లర్ పీవీ సింధు.. ఒలింపిక్స్‌ను గ్రాండ్‌గా మొదలెట్టింది. మహిళల సింగిల్స్ గ్రూప్-ఎంలో జరిగిన తొలి మ్యాచ్‌లో 10వ సీడ్ సింధు 21-9, 21-6తో ఫాతిమా అబ్దుల్ రజాక్ (మాల్దీవులు)పై సునాయాసంగా గెలిచింది. ప్రత్యర్థి నుంచి కనీస పోరాటం కూడా లేకపోవడంతో.. డబుల్ ఒలింపిక్ పతక విజేత సింధు కేవలం 29 నిమిషాల్లో మ్యాచ్‌ను ముగించింది. మెంటార్ ప్రకాశ్ పడుకోన్ సూచనలతో తన ఆట మెరుగుపడిందని మ్యాచ్ అనంతరం సింధు సంతోషం వ్యక్తం చేసింది. మానసికంగా బలంగా ఉండడానికి సానుకూల దృక్పథంతోపాటు యోగాను ప్రాక్టీస్ చేస్తున్నట్టు తెలిపింది. పురుషుల సింగిల్స్ గ్రూప్-కెలో 13వ సీడ్ హెచ్ఎస్ ప్రణయ్ శుభారంభం చేశాడు. తొలి మ్యాచ్‌లో ప్రణయ్ 21-18, 21-12తో ఫాబియాన్ రోత్ (జర్మనీ)పై నెగ్గాడు.



దేశం	స్వ	ర	కా	మొ
ఆస్ట్రేలియా	4	2	0	6
కొరియా	3	2	1	6
చైనా	3	1	1	5
జపాన్	3	1	1	5
ఫ్రాన్స్	2	2	2	6
అమెరికా	1	3	2	6
కజకిస్థాన్	1	0	2	3
బెల్జియం	1	0	1	2
జర్మనీ	1	0	0	1
హాంకాంగ్	1	0	0	1
భారత్	0	0	1	1

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

టేబుల్ టెన్నిస్: శ్రీజ ముందంజ



టేబుల్ టెన్నిస్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు లభించాయి. తెలుగమ్మాయి ఆకుల శ్రీజ, మనికా బాత్రా ముందంజ వేయగా.. ఐదోసారి ఒలింపిక్స్ బరిలోకి నిలిచిన శరత్ కమల్‌కు తొలి రౌండ్‌లోనే చుక్కెదురైంది. మహిళల సింగిల్స్ రౌండ్-64లో శ్రీజ 4-0తో క్రిస్టీనా కాల్‌బర్గ్ (స్వీడన్)ను చిత్తు చేయగా.. మనికా 4-1తో అన్నా హర్సే (బ్రిటన్)పై గెలిచింది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో శరత్ కమల్ 2-4తో డెనీ కోజుల్ (స్లొవేనియా) చేతిలో, హర్మీత్ దేశాయ్ 0-4తో వరల్డ్ నెం:5 ఫెలిక్స్ లెబ్రన్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం పాలయ్యారు.

రోయింగ్: క్వార్టర్స్‌కు పన్వర్



రోయింగ్ సింగిల్ స్కల్స్‌లో బల్‌రాజ్ పన్వర్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. రెపిచేజ్-2లో పన్వర్ 7 నిమిషాల 12.41 సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానం దక్కించుకొన్నాడు. క్వెంటిన్ యాంటాగ్‌నెల్లి (మొనాకో) 7 నిమిషాల 10 సెకన్ల టైమింగ్ టాప్‌లో నిలిచాడు. రెపిచేజ్ రౌండ్‌లో టాప్-2లో నిలిచిన ఇద్దరు రోయర్లు క్వార్టర్స్‌కు క్వాలిఫై అవుతారు.



నిఖత్ ఘనంగా..

ప్రీక్వార్టర్స్‌కు తెలుగు బాక్సర్

రెండుసార్లు వరల్డ్ చాంపియన్ బాక్సర్ నిఖత్ జరీన్ ఒలింపిక్స్‌ను ఘనంగా ఆరంభించింది. 50 కిలోల విభాగంలో నిఖత్ అదిరే విజయంతో ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన రౌండ్-32లో నిఖత్ 5-0తో మ్యాక్సీ కరీనా కొయిట్జర్ (జర్మనీ)ను మట్టికరిపించింది. ఆరంభంలో జర్మనీ బాక్సర్ దూకుడుతో వెనుకబడిన నిఖత్ 2-3తో తొలి రౌండ్‌ను చేజార్చుకొంది. కానీ, రెండో రౌండ్‌లో క్రమంగా లయను అందుకొన్న నిఖత్.. ప్రత్యర్థికి దీటుగా పంచ్‌లు విసిరింది. ఇరువురూ నువ్వానేనా అన్నట్టుగా తలపడినా వ్యూహాత్మకంగా వ్యవహరించిన నిఖత్ పైచేయి సాధించింది. ఇక, మూడో రౌండ్‌లో కచ్చితమైన పంచ్‌లతో విరుచుకుపడిన నిఖత్.. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా బౌట్‌ను సొంతం చేసుకొంది. గురువారం జరిగే ప్రీక్వార్టర్స్‌లో టాప్ సీడ్ వు యు (చైనా) రూపంలో నిఖత్‌కు కఠిన పరీక్ష ఎదురుకానుంది.

నగాల్ అవుట్

టెన్నిస్ పురుషుల సింగిల్స్‌లో సుమిత్ నగాల్‌కు షాక్ తగిలింది. తొలి రౌండ్‌లో నగాల్ 2-6, 6-2, 5-7తో కోరెంటిన్ మౌటెట్ (ఫ్రాన్స్) చేతిలో పోరాడి ఓడాడు. మొదటి సెట్ ఓడినా.. రెండో సెట్‌లో నగాల్ పుంజుకొన్నాడు. నిర్ణాయక మూడో సెట్‌లో సుమిత్ 65 నిమిషాలపాటు హోరాహోరీగా తలపడినా అనవసరపు తప్పిదాలతో మ్యాచ్‌ను చేజార్చుకొన్నాడు.

ఆర్చరీ: అమ్మాయిలకు నిరాశ

పతకంపై ఆశలు రేపిన భారత మహిళల రికర్వ్ ఆర్చరీ జట్టు తీవ్రంగా నిరాశపర్చింది. క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఆకట్టుకొనే ప్రదర్శనతో నేరుగా క్వార్టర్స్‌కు చేరిన అంకిత భకత్, భజన్ కౌర్, దీపిక కుమారి త్రయం ఘోరమైన ప్రదర్శన చేసింది. రౌండ్-8లో భారత్ 0-6తో నెదర్లాండ్స్ చేతిలో చిత్తయింది. అంకిత, దీపిక ఏమాత్రం అంచనాలను అందుకోలేక పోయారు. కౌర్ మొత్తంగా 60 పాయింట్లకు 56 సాధించినా.. దీపిక 48 పాయింట్లు, అంకిత 46 పాయింట్లతో ఓటమికి కారణమయ్యారు.

ధినిధి టాప్‌లో నిలిచినా..

స్విమ్మింగ్

ఒలింపిక్స్‌లో భారత స్విమ్మర్లు మరోసారి పతకం లేకుండానే వెనుదిరిగారు. బరిలో నిలిచిన శ్రీహరి నటరాజ్, ధినిధి దేషింగు సెమీస్ చేరడంలో విఫలమయ్యారు. పురుషుల 100 మీ. బ్యాక్‌స్ట్రోక్ హీట్స్‌లో శ్రీహరి 55.01 సెకన్ల టైమింగ్‌తో ఓవరాల్‌గా 33వ స్థానంలో నిలిచాడు. అత్యుత్తమ టైమింగ్ నమోదు చేసిన తొలి 16 మందికే సెమీస్‌కు చాన్స్ లభిస్తుంది. తొలిసారి ఒలింపిక్స్ బరిలో దిగిన 14 ఏళ్ల ధినిధి మహిళల 200 మీటర్ల ఫ్రీస్టైల్ హీట్స్-1లో 2 నిమిషాల 6.96 సెకన్ల టైమింగ్‌తో టాప్‌లో నిలిచింది. కానీ, ఓవరాల్‌గా పాల్గొన్న 30 మందిలో 23వ స్థానంలో నిలిచి సెమీస్ రేసు నుంచి అవుటైంది.



పారిస్‌లో నేటి భారతం



బ్యాడ్మింటన్: పురుషుల డబుల్స్ (గ్రూప్ దశ) సాత్విక్/చిరాగ్Xమార్క్ లామ్స్‌ఫస్/సీడెల్ (జర్మనీ) (మధ్యాహ్నం 12 గం); **మహిళల డబుల్స్** (గ్రూప్ దశ) - అశ్వినీ పొన్నప్ప/తనీషా X మట్సుయమా/షిడా (జపాన్) (మ. 12.50); **పురుషుల సింగిల్స్** (గ్రూప్ దశ)- లక్ష్య సేన్X కరాగి (బెల్జియం) (సా. 5.30).

షూటింగ్: 10 మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ క్వాలిఫికేషన్ - మను భాకర్/సరబ్‌జోత్ సింగ్, రిథమ్-అర్జున్ చీమా (మ. 12.45); **పురుషుల ట్రాప్ క్వాలిఫికేషన్**- పృథ్వీరాజ్ తొండైమన్ (మ. 1 గం); **మహిళల 10 మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్**- రమితా జిందాల్ (మ. 1 గం); **పురుషుల 10 మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్** -అర్జున్ బబుతా (మ. 3.30).

హాకీ: పురుషుల పూల్-బి మ్యాచ్- భారత్ X అర్జెంటీనా (సా. 4.15).

ఆర్చరీ: పురుషుల టీమ్ క్వార్టర్స్-ధీరజ్ బొమ్మదేవర, ప్రవీణ్ జాదవ్, తరుణ్‌దీప్ రాయ్ (సా. 6.31). (సెమీస్ రా. 7.17).

టేబుల్ టెన్నిస్: మహిళల సింగిల్స్ (రౌండ్-32)- శ్రీజ X జియాన్ జెంగ్ (సింగపూర్) (రా. 11.30).

తుది మెట్టుపై బోల్తా

భారత్‌కు శ్రీలంక షాక్
ఆసియా కప్ కైవసం
మంధాన హాఫ్ సెంచరీ వృథా



దంబుల్లా: అప్రతిహత విజయాలతో ఫైనల్‌కు దూసుకొచ్చిన డిఫెండింగ్ చాంపియన్ భారత్‌కు శ్రీలంక షాకిచ్చింది. ఆదివారం జరిగిన ఆసియా కప్ తుదిపోరులో 8 వికెట్లతో హర్మన్‌సేనను చిత్తు చేసిన ఆతిథ్య జట్టు తొలిసారి టైటిల్ సొంతం చేసుకుంది. కవిషా దిల్హారి (30 నాటౌట్, 2/36) ఆల్‌రౌండ్ షోతో జట్టు విజయంలో కీలక భూమిక పోషించింది. తొలుత భారత్ 20 ఓవర్లలో 165/6 స్కోరు సాధించింది. ఓపెనర్ మంధాన (60), రిచా ఘోష్ (30) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడారు. ఛేదనలో శ్రీలంక 18.4 ఓవర్లలో 167/2 స్కోరు చేసి నెగ్గింది. చమరి ఆటపట్టు, హర్షిత సమరవిక్రమ అర్ధ శతకాలతో మెరవగా, కవిష భారీ షాట్లతో అలరించింది. హర్షిత 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా, కెప్టెన్ చమరి 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచారు. వన్డే, టీ20 ఫార్మాట్‌లతో కలిపి ఆసియా కప్ ఇప్పటి వరకు 9 సార్లు జరగ్గా..భారత్ ఫైనల్లో ఓడడం ఇది రెండోసారి మాత్రమే. కాగా విజేతగా నిలిచిన శ్రీలంక జట్టుకు ఆ దేశ క్రికెట్ బోర్డు రూ. లక్ష డాలర్ల ప్రైజ్‌మనీ ప్రకటించింది.

సంక్షిప్తస్కోర్లు: భారత్: 20 ఓవర్లలో 165/6 (మంధాన 60, రిచా 30, జెమీమా 29, కవిషా దిల్హారి 2/36); **శ్రీలంక:** 18.4 ఓవర్లలో 167/2 (హర్షిత నాటౌట్ 69, చమరి 61, దిల్హారి నాటౌట్ 30, దీప్తిశర్మ 1/30).

ఇంగ్లండ్ క్లీన్ స్వీప్

మూడోరోజే ముగిసిన టెస్టు
10 వికెట్ల తేడాతో విండీస్‌పై గెలుపు

బర్మింగ్‌హామ్: స్వదేశంలో వెస్టిండీస్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను ఇంగ్లండ్ క్లీన్ స్వీప్ చేసింది. మూడ్రోజుల్లోనే ముగిసిన ఈ మూడో టెస్టులో ఇంగ్లండ్ 10 వికెట్లతో విజయం సాధించింది. పేసర్ మార్క్ ఉడ్ ఐదు (5/41) వికెట్లతో చెలరేగాడు. ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 33/2తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విండీస్..ఉడ్ ధాటికి 175కు ఆలౌటైంది. 82 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ వికెట్ నష్టపోకుండా 7.2 ఓవర్లలో 87 పరుగులు చేసి గెలిచింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 282, ఇంగ్లండ్ 376కు ఆలౌటయ్యాయి.

సిరీస్ మనదే

రెండో టీ20లోనూ శ్రీలంక ఓటమి

పల్లెకెలె: శ్రీలంకతో మూడు టీ20ల సిరీస్‌ను టీమిండియా మరో మ్యాచ్ ఉండగానే కైవసం చేసుకుంది. వర్షం బారిన పడిన ఆదివారంనాటి రెండో మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్లతో శ్రీలంకను ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 20 ఓవర్లలో 161/9 స్కోరు సాధించింది. కుశాల్ పెరీరా (53), నిస్సాంక (32), కమిందు మెండిస్ (26) రాణించారు. బిష్ణోయ్ 3, హార్దిక్, అర్ష్‌దీప్, అక్షర్ తలా రెండేసి వికెట్లు పడగొట్టారు. భారత్ ఇన్నింగ్స్ మూడు బంతుల తర్వాత వర్షం పడడంతో మ్యాచ్ గంటకుపైగా ఆగిపోయింది. దాంతో డక్‌వర్త్ లూయిస్ నిబంధన ప్రకారం టీమిండియా లక్ష్యాన్ని ఎనిమిది ఓవర్లలో 78 పరుగులుగా నిర్ధారించారు. అయితే 6.3 ఓవర్లలోనే 81/3 స్కోరుతో భారత్ లక్ష్యాన్ని చేరుకుంది. జైస్వాల్ (30), సూర్యకుమార్ (26), హార్దిక్ (22 నాటౌట్) ఫటాఫట్ ఇన్నింగ్స్ ఆడారు. బిష్ణోయ్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. చివరి మ్యాచ్ మంగళవారం ఇక్కడే జరగనుంది.



సంక్షిప్తస్కోర్లు

శ్రీలంక: 20 ఓవర్లలో 161/9 (కుశాల్ పెరీరా 53, నిస్సాంక 32, కమిందు మెండిస్ 26, బిష్ణోయ్ 3/26, హార్దిక్ 2/23, అర్ష్‌దీప్ 2/24, అక్షర్ 2/30)
భారత్: 6.3 ఓవర్లలో 81/3 (జైస్వాల్ 30, సూర్యకుమార్ 26, హార్దిక్ నాటౌట్ 22, తీక్షణ 1/16, పథిరన 1/18, హసరంగ 1/34).

రెండో రౌండ్‌లో నడాల్ X జొకోవిచ్



పారిస్: పురుషుల టెన్నిస్ సింగిల్స్ రెండో రౌండ్‌లో దిగ్గజ ఆటగాళ్లు రఫెల్ నడాల్, జొకోవిచ్ తలపడబోతున్నారు. దీంతో ఈ మ్యాచ్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లో నడాల్ 6-1, 4-6, 6-4 తేడాతో మార్టన్ ఫుక్సోవిక్స్ (హంగెరీ)పై చెమటోడ్చి గెలిచాడు. అయితే జొకో 6-0, 6-1 తేడాతో డబుల్స్ స్పెషలిస్ట్ మాథ్యూ ఎబ్డెన్ (ఆసీస్)పై సునాయాసంగా గెలిచాడు. మరోవైపు నడాల్-జొకో చివరిసారి 2022 ఫ్రెంచ్ ఓపెన్ క్వార్టర్స్‌లో తలపడ్డారు.

నవ్య

కుటుంబ కదంబం

సోమవారం 29 జూలై 2024

యంగ్ టాలెంట్



అదరగొట్టిన ఆయేషా

రష్యాలోని ఉలియనోవ్‌స్క్ నగరం. 'బ్రిక్స్' దేశాల 'యూత్ మినిస్టర్స్' సదస్సు జరుగుతున్న ప్రాంగణం. ఓ యువతి... వేదికను అలంకరించింది. సామాజిక అంశాలు... అందులో యువత పాత్రపై అనర్గళంగా మాట్లాడింది. ఆ ప్రసంగానికి సభాస్థలి చప్పట్లతో మార్మోగింది. ఆమె ఎవరో కాదు... మన తెలుగు అమ్మాయే. పేరు... ఆయేషా. తెలుగు రాష్ట్రాల నుంచి 'బ్రిక్స్'కు వెళ్లిన ఏకైక వ్యక్తి ఆమె. ఆ విశేషాలను 'నవ్య'తో పంచుకుంది.

"నేను జీవించే సమాజం... పుట్టి పెరిగిన ప్రాంతం... వాటి అభివృద్ధికి చేతనైన సాయం చేయాలనేది చిన్నప్పటి నుంచీ నా ఆకాంక్ష. వయసుతో పాటు నాలో సామాజిక చింతన కూడా పెరుగుతూ వచ్చింది. విశాఖ జిల్లా పెందుర్తి మండలం సరిపల్లి గ్రామంలోని ఓ నిరుపేద కుటుంబం మాది. మా నాన్న షేక్ రెహమాన్ లారీ డ్రైవర్. అమ్మ మదీనా బీబీ గృహిణి. నాకు ఇద్దరు అక్కలు. విశాఖలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తయింది. అనంతరం విజయనగరం సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీలో మెడిసినల్ కెమిస్ట్రీలో పీజీ చదివాను. ప్రస్తుతం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సింథటిక్ కెమిస్ట్రీలో పీహెచ్‌డీ చేస్తున్నా. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నా మా నాన్న మమ్మల్ని చదివిస్తున్నారు. ఆయన ప్రోత్సాహంతోనే ఇక్కడివరకు రాగలిగాను.

సామాజిక స్పృహ...

ఎప్పుడూ మన గురించి మనమే కాదు... తోటివారి గురించి కూడా ఆలోచించాలి. సమాజానికి ఎంతోకొంత తిరిగి ఇవ్వాలి. ఆ లక్ష్యంతోనే చదువుతోపాటు సామాజిక సేవలో కూడా భాగం అయ్యాను. వివిధ స్వచ్ఛంద సంస్థలు, స్నేహితులతో కలిసి హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లోని మురికివాడల్లో పర్యటిస్తున్నాను. అక్కడి ప్రజలకు పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తున్నాను. శానిటరీ నేప్కిన్స్ పంపిణీ, నిరుపేదలు, వీధుల్లో జీవించేవారికి వస్త్రాలు అందిస్తున్నాను. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై అవగాహన కల్పిస్తున్నాను. మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. తద్వారా పర్యావరణ పరిరక్షణలో నా వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించే ప్రయత్నం.



> సభ ముగింపు రోజు నాకు మాట్లాడే అవకాశం లభించింది. విభిన్న అంశాల్లో సహకరించుకొంటున్న 'బ్రిక్స్' దేశాలు, యువతకు సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రసంగించాను. ముఖ్యంగా సంస్కృతి, యువ నాయకత్వం పెంపుదల, సామాజిక సేవా కార్యక్రమాలు, వీటిల్లో యువత భాగస్వామ్యంపై పరస్పరం సహకరించుకోవాలని సూచించాను. అందుకు ఒక వేదిక కల్పించాలని 'బ్రిక్స్'ను కోరాను.

విద్యార్థి ఉద్యమాల్లో...

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి వచ్చాక సామాజిక కార్యక్రమాలు మరింతగా ఊపందుకున్నాయి. దాంతోపాటు విద్యార్థి పోరాటాల్లోనూ భాగమయ్యాను. ఇటీవల మా యూనివర్సిటీ అధ్యక్ష ఎన్నికల్లో ఏబీవీపీ తరుపున పోటీ చేశాను. ప్రెసిడెంట్ పదవికి పోటీపడిన తొలి ముస్లిం యువతిని నేనే. అయితే ఆ ఎన్నికల్లో ఓడిపోయాను. అలాగని చేతులు ముడుచుకుని కూర్చోలేదు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడుతూనే ఉన్నాను.

'బ్రిక్స్'కు అలా...

నాలోని ఈ సేవా భావం, పోరాడే తత్వమే నాకు 'బ్రిక్స్' (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) దేశాల 'యూత్ మినిస్టర్స్' సదస్సులో పాల్గొనే అవకాశం తెచ్చి పెట్టింది. ఈ నెల 22 నుంచి 25 వరకు రష్యాలోని ఉలియనోవ్‌స్క్ నగరంలో ఈ సదస్సు జరిగింది. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆహ్వానం మేరకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. అందులో నుంచి వడపోసి, పద్నాలుగు మందిని ఎంపిక చేశారు. వారిలో నేనూ ఉన్నాను. సామాజిక సేవా విభాగంలో నన్ను ఎంపిక చేశారు. తెలుగు రాష్ట్రాల నుంచి ఈ సదస్సులో పాల్గొన్నది నేనొక్కదాన్నే. ఇది నాకు ఎంతో గర్వంగా అనిపించింది.

అనూహ్య స్పందన...

సభ ముగింపు రోజు నాకు మాట్లాడే అవకాశం లభించింది. విభిన్న అంశాల్లో సహకరించుకొంటున్న 'బ్రిక్స్' దేశాలు, యువతకు సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రసంగించాను. ముఖ్యంగా సంస్కృతి, యువ నాయకత్వం పెంపుదల, సామాజిక సేవా కార్యక్రమాలు, వీటిల్లో యువత భాగస్వామ్యంపై పరస్పరం సహకరించుకోవాలని సూచించాను. అందుకు ఒక వేదిక కల్పించాలని 'బ్రిక్స్'ను కోరాను. ఇది ఆయా దేశాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం కావడానికి, మరింతమంది యువత సేవ వైపు మళ్లేందుకు దోహదం చేస్తుందని వివరించాను. నా సూచనలకు ప్రతినిధుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ప్రసంగం అనంతరం సభా ప్రాంగణం చప్పట్లతో మార్మోగింది. పలువురు ప్రశంసలు కూడా అందుకున్నాను. నా ప్రతిపాదనలకు ఈ స్థాయిలో మద్దతు లభిస్తుందని అస్సలు అనుకోలేదు. కేంద్ర మంత్రి రక్ష నిఖిల్ ఖడ్సే కూడా నన్ను ప్రత్యేకంగా అభినందించారు. ఇది నాలో ఎనలేని స్ఫూర్తి నింపింది. భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు కొనసాగించడానికి, యువత గొంతుకై నిలబడడానికి ఈ సదస్సు నాకు ప్రేరణ ఇచ్చింది."

● బి. శ్రీనివాసరావు / ఎం.శివప్రసాద్



హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
2. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
3. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
4. ఓ మాహీ (డంకీ)
5. తుమ్ సే (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
6. నైనా (క్రూ)
7. చలేయా (జవాన్)
8. తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
9. హీర్ ఆస్మానీ (ఫైటర్)
10. తైనూ ఖబర్ నహీ (మునియా)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్:
కుర్చీ మడతపెట్టి (గుంటూరు కారం)

మీరు మంచి తల్లితండ్రులేనా?



తల్లి తండ్రులందరూ తమ పిల్లలు బాగా అభివృద్ధి చెందాలనే కోరుకుంటారు. అయితే వారి వ్యక్తిత్వాల ప్రభావం కూడా పిల్లలపై పడుతుందనే విషయాన్ని మర్చిపోతారు. స్టాన్‌ఫర్డ్‌కు చెందిన ఎల్‌నేర్ మోకాబే, జాన్ మార్టిన్‌లు తాజాగా రాసిన ఒక వ్యాసంలో తల్లితండ్రులు ఎన్ని రకాలుగా ఉంటారో.. వారి ప్రభావం పిల్లలపై ఎలా పడుతుందో వివరించారు.

పర్మిసివ్ పేరెంట్స్

సాధారణంగా వీరు పిల్లలకు స్నేహితులుగా ఉండాలనుకుంటారు. వీరు పిల్లలతో ఎటువంటి సంఘర్షణ రాకుండా చూసుకుంటూ ఉంటారు. చిన్న తేడా వచ్చినా కలత చెందుతారు. పిల్లలకు ఏం కావాలంటే అవి ఇస్తూ ఉంటారు. వీరిలో కనిపించే లక్షణాలు ఇవే..

- పిల్లల పట్ల ఎక్కువ బాధ్యతగా వ్యవహరిస్తూ ఉంటారు. పిల్లలను ఏ విధంగాను డిమాండ్ చేయరు.
- వీరు పిల్లలతో స్వేచ్ఛగా మాట్లాడతారు. పిల్లలకు ఏం కావాలో వారే నిర్ణయించుకోవాలని భావిస్తారు.
- వీరి పెంపకంలో ఎటువంటి రూల్స్ ఉండవు.
- పిల్లలను ఆనందంగా ఉంచటం కోసం ఏ పని చేయటానికైనా వెనకాడరు.

అథారిటేటివ్ పేరెంట్స్

వీరు పిల్లల అవసరాలను గుర్తించి వారికి అండగా నిలబడతారు. నిజాయితీతో.. విలువల ఆధారంగా వీరు పిల్లలతో చర్చలు జరుపుతూ ఉంటారు. ఈ తరహా తల్లితండ్రులు ఉన్న పిల్లలు స్వయం నిర్ణయాలు తీసుకోగలుగుతారు. ఇతరులపై ఆధారపడరు.

లక్షణాలు ఇవే..

- పిల్లలు బాధ్యతాయుతంగా ఉండాలనుకుంటారు. ఆ లక్షణాలను డిమాండ్ చేస్తారు.
- కచ్చితమైన నియమ నిబంధనలను ఆచరణలో పెడతారు.
- పిల్లలతో ప్రతి రోజు మాట్లాడుతూ ఉంటారు. వారి మనసులో మాటలను తెలుసుకోవటానికి ప్రయత్నిస్తారు
- పిల్లలు వైఫల్యం చెందితే నిందించరు. అది ఎదిగే ప్రక్రియలో ఒక భాగంగా భావిస్తారు. పిల్లలకు అండగా నిలబడతారు.

నెగ్లెట్‌ఫుల్ పేరెంట్స్

వీరు పిల్లలను అస్సలు పట్టించుకోరు. వారితో ఎక్కువ సమయం గడపరు. వీరు తమ వ్యవహారాలకు ఎక్కువ సమయం కేటాయిస్తూ ఉంటారు. అందువల్ల పిల్లల ఆలోచనలను తెలుసుకోలేకపోతారు.

లక్షణాలు ఇవే..

- పిల్లలను పట్టించుకోరు. వారిని ఎక్కువగా డిమాండ్ కూడా చేయరు.
- వీరు పట్టించుకోకపోవటం వల్ల పిల్లలు వారంతట వాళ్లే పెరుగుతూ ఉంటారు.
- పిల్లలకు ఎటువంటి గైడెన్స్ ఇవ్వరు.
- వారే ఆత్మనూన్యతతో బాధపడుతూ ఉంటారు.

అథారిటేరియన్ పేరెంట్స్

వీరు తమ పిల్లలు విపరీతమైన క్రమశిక్షణతో పెరగాలని భావిస్తారు. పిల్లల మాటలను ఏ మాత్రం వినరు. వారి అవసరాలను గుర్తించరు.

లక్షణాలు ఇవే

- వీరు పిల్లల నుంచి ఎక్కువ ఆశిస్తారు. ఎక్కువ బాధ్యత తీసుకోరు
- పిల్లల మనోభావాలు పట్టించుకోకుండా తమ మాట నెగ్గాలని భావిస్తారు
- 'నా మాటే శాసనం.. నేను చెప్పింది వినాల్సిందే' అని పదే పదే అంటూ ఉంటారు
- వీరిలో ఎటువంటి చర్చలు ఉండవు. వారు చెప్పింది చేయాల్సిందే!

ఏ స్టైల్ మంచిది?

ప్రతి స్టైల్‌లోను కొన్ని సమస్యలు ఉన్నాయి. కానీ పిల్లల పట్ల బాధ్యతగా ఉంటూ.. వారికి స్వేచ్ఛను ఇవ్వటమే మంచిదని మానసిక నిపుణులు పేర్కొంటున్నారు. పిల్లల అవసరాలను గమనించి దానికి తగ్గట్టుగా మసలుకుంటే- పిల్లలకు కూడా పరిస్థితుల ఆధారంగా ప్రవర్తించటం వస్తుందని వారు చెబుతున్నారు. ఉదాహరణకు పిల్లలకు జ్వరం వచ్చినప్పుడు- వారి పట్ల ప్రేమ చూపించి.. అవసరమైతే కొన్ని రూల్స్‌ను బ్రేక్ చేయటం మంచిదంటున్నారు. ఇదే విధంగా పిల్లల భద్రత విషయానికి వచ్చినప్పుడు కచ్చితంగా ఉండాల్సిన అవసరం కూడా ఉందంటున్నారు.

బిజినెస్

అల్ట్రాటెక్ చేతికి ఇండియా సిమెంట్స్

- రూ.3,954 కోట్లతో 32.72 శాతం వాటా కొనుగోలు
- మరో 26 శాతానికి త్వరలో ఓపెన్ ఆఫర్
- ఒక్కో షేరుకు రూ.390 చొప్పున ఆఫర్



న్యూఢిల్లీ: సిమెంట్ రంగంలో పోటీ ఊపందుకుంది. దక్షిణాది సిమెంట్ మార్కెట్‌పై పట్టుకోసం అదానీ గ్రూప్, ఆదిత్య బిర్లా గ్రూప్ పోటీ పడుతున్నాయి. ఈ పోటీలో భాగంగా ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్.. దక్షిణ భారత మార్కెట్లో ముఖ్యంగా తమిళనాడు సిమెంట్ మార్కెట్లో గట్టి పట్టున్న ఇండియా సిమెంట్స్ లిమిటెడ్ (ఐసీఎల్) కంపెనీని టేకోవర్ చేస్తోంది. ఈ ప్రయత్నంలో భాగంగా ముందుగా ఇండియా సిమెంట్స్ కంపెనీ ప్రధాన ప్రమోటర్ ఎన్.శ్రీనివాసన్ ఆయన కుటుంబసభ్యుల నుంచి రూ.3,954 కోట్లతో 32.72 శాతం వాటాను కొనుగోలు చేస్తోంది. ఇందుకోసం ఒక్కో ఐసీఎల్ షేరుకు రూ.390 చొప్పున చెల్లించనుంది. ఈ ఏడాది జూన్‌లోనూ అల్ట్రాటెక్ సిమెంట్.. ఐసీఎల్ ఈక్విటీలో 23 శాతం వాటాను డీమార్ట్ అధినేత, ఇన్వెస్టర్ ఆర్‌కే దమానీ నుంచి బ్లాక్ డీల్ ద్వారా కొనుగోలు చేసింది. తాజా డీల్‌తో ఐసీఎల్ ఈక్విటీలో అల్ట్రాటెక్ సిమెంట్స్ వాటా 55 శాతానికి పెరగనుంది.

త్వరలో ఓపెన్ ఆఫర్: ఐసీఎల్ ఈక్విటీలో మరో 26 శాతం వాటా కోసం త్వరలో ఓపెన్ ఆఫర్ ప్రకటించనున్నట్టు అల్ట్రాటెక్ సిమెంట్ ప్రకటించింది. ఇందుకోసం ప్రమోటర్లకు ఆఫర్ చేసిన విధంగానే ఒక్కో షేరుకు రూ.390 చొప్పున చెల్లిస్తామని తెలిపింది. గత శుక్రవారం బీఎస్ఈలో ఐసీఎల్ షేరు ముగింపు ధర కంటే ఇది 4.1 శాతం ఎక్కువ. ఐసీఎల్ ప్రధాన ప్రమోటర్ల నుంచి ఐసీఎల్ ఈక్విటీలో 32.72 శాతం వాటా కొనుగోలుకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నుంచి అనుమతి లభించిన వెంటనే అల్ట్రాటెక్ ఈ ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. రెగ్యులేటరీ సంస్థల నుంచి అన్ని అనుమతులు లభించి ఐసీఎల్ తమ చేతికి వచ్చేందుకు ఎంత లేదన్నా ఆరు నెలల సమయం పడుతుందని అల్ట్రాటెక్ తెలిపింది.

దక్షిణాదిపై పట్టు: పెన్నా సిమెంట్స్ టేకోవర్‌తో అదానీ సిమెంట్స్‌కు దక్షిణ భారత సిమెంట్ మార్కెట్‌పై గట్టి పట్టు ఏర్పడింది. దీంతో అల్ట్రాటెక్ సిమెంట్ కూడా ఈ మార్కెట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే దక్షిణ భారత్‌లో అతి సిమెంట్ కంపెనీ అయిన ఇండియా సిమెంట్స్‌ను కొనుగోలు చేస్తోందని భావిస్తున్నారు. అల్ట్రాటెక్ సిమెంట్‌కు దక్షిణ భారత్‌లోని ప్రధాన నగరాలకు చేరువలో పెద్ద సంఖ్యలోనే రెడీ టు మిక్స్ సిమెంట్ ప్లాంట్లు ఉన్నాయి. అయితే సిమెంట్ ఉత్పత్తి యూనిట్లు మాత్రం పెద్దగా లేవు. ఐసీఎల్ కొనుగోలుతో ఈ లోటు తీరనుంది. అల్ట్రాటెక్ కంపెనీకి ప్రస్తుతం దేశవ్యాప్తంగా 15.4 కోట్ల టన్నుల వార్షిక సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం ఉంది. ఇందులో 2.5 కోట్ల టన్నుల సామర్థ్యం మాత్రమే దక్షిణ భారత్‌లో ఉంది. తమిళనాడులోని రెడ్డిపాళ్యం, ఆంధ్రప్రదేశ్‌లోని తాడిపత్రి వద్ద మినహా కంపెనీకి ఎక్కడా సమగ్ర సిమెంట్ ప్లాంట్లు లేవు. అక్కడ కూడా సున్నపురాయి కొరతతో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెద్దగా విస్తరించలేకపోతోంది. ఇండియా సిమెంట్‌కు తెలుగు రాష్ట్రాల్లోని విష్ణుపురంతో పాటు తమిళనాడు, రాజస్థాన్, మహారాష్ట్రల్లో ఏటా 2.5 కోట్ల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న సిమెంట్ ప్లాంట్లు ఉన్నాయి. ఈ కొనుగోలుతో ఈ ప్లాంట్లన్నీ అల్ట్రాటెక్ చేతికి వస్తాయి. దీంతో దక్షిణాది మార్కెట్లో అల్ట్రాటెక్, అదానీ సిమెంట్‌తోనే కాకుండా స్థానిక మార్కెట్‌పై మంచి పట్టున్న ప్రాంతీయ బ్రాండ్లతోనూ గట్టిగా పోటీపడగలుగుతుందని భావిస్తున్నారు.

మరిన్ని టేకోవర్లు : దక్షిణ భారత మార్కెట్లో అల్ట్రాటెక్ సిమెంట్‌కు ఇప్పటికే ప్రీమియం బ్రాండ్‌గా పేరుంది. ఇప్పుడు ఇందుకు ఇండియా సిమెంట్ కూడా తోడైంది. కేశోరామ్ సిమెంట్ కూడా త్వరలో అల్ట్రాటెక్ సిమెంట్‌లో విలీనం కానుంది. ఇక సీకే బిర్లా గ్రూప్‌నకు చెందిన ఓరియంట్ సిమెంట్‌పైనా అల్ట్రాటెక్ సిమెంట్ కన్నేసినట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించి రెండు కంపెనీల మధ్య చర్చలు తుది దశకు చేరినట్టు సమాచారం. ఇదే నిజమైతే ఓరియంట్ సిమెంట్ కూడా కుమార మంగళం బిర్లా నాయకత్వంలోని ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన అల్ట్రాటెక్ గూటికి చేరినట్టే.

ఎందుకీ కొనుగోళ్లు ?

ఉత్తర భారత్‌తో పోలిస్తే దక్షిణ భారత్‌లో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్ రంగం మంచి ఊపు మీద ఉన్నాయి. అమరావతి, పోలవరంతో ఆంధ్రప్రదేశ్‌లో సిమెంట్‌కు మరింత గిరాకీ ఏర్పడింది. హైదరాబాద్ చుట్టూ ఏర్పాటు చేసే ప్రాంతీయ వలయ రహదారి (ఆర్ఆర్ఆర్)తో తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగం మరింత ఊపందుకోనుంది. వీటిని సొమ్ము చేసుకునేందుకు సిమెంట్ కంపెనీలు పోటీపడుతున్నాయి. అందులో భాగంగానే అదానీ, ఆదిత్య బిర్లా గ్రూప్‌లు టేకోవర్లతో సిమెంట్ రంగంలో తమ పట్టు పెంచుకుంటున్నాయని భావిస్తున్నారు.

తప్పుడు క్లెయిమ్స్ చేస్తే దండన తప్పదు

రిఫండ్స్ ఆలస్యం అవుతాయి: ఐటీ శాఖ

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను (ఐటీ) రిటర్న్‌లు ఫైల్ చేసే వారికి ఆదాయ పన్ను (ఐటీ) శాఖ గట్టి హెచ్చరిక చేసింది. రిఫండ్స్ కోసం ఖర్చులకు సంబంధించి తప్పుడు క్లెయిమ్‌లు చేసినా, ఆదాయాన్ని తక్కువగా చూపినా, మినహాయింపుల్ని ఎక్కువచేసి చూపినా శిక్ష తప్పదని హెచ్చరించింది. ఇలాంటి తప్పుడు క్లెయిమ్‌లతో రిఫండ్స్ చెల్లింపులూ ఆలస్యమయ్యే ప్రమాదం ఉందని తెలిపింది. ఆడిటింగ్ అవసరం లేని పన్ను చెల్లింపుదారులు ఈ నెలాఖరులోగా తమ ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేయాలి. కొంతమంది పన్ను చెల్లింపుదారులు రిఫండ్స్ కోసం తప్పుడు క్లెయిమ్స్ చేస్తున్నట్టు వార్తలు రావడంతో ఐటీ శాఖ ఈ హెచ్చరిక చేసింది.

ట్యాక్స్ క్లియరెన్స్ సర్టిఫికెట్‌పై వెనక్కి

విదేశాలకు వెళ్లే భారతీయులకు ట్యాక్స్ క్లియరెన్స్ సర్టిఫికెట్ తప్పనిసరి అనే అంశంపై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. పన్ను బకాయిలు ఉన్న వ్యక్తులు, పెద్ద మొత్తంలో పన్నులు ఎగవేసిన వారికి మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. విదేశాలకు వెళ్లే ప్రతి భారతీయుడు, ట్యాక్స్ క్లియరెన్స్ సర్టిఫికెట్ తీసుకోవాలన్న బడ్జెట్ ప్రతిపాదనపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దీంతో ప్రభుత్వం ఈ విషయంలో వెనక్కి తగ్గిందని భావిస్తున్నారు.

ఇన్వెస్కో మాన్యుఫ్యాక్చరింగ్ ఫండ్

ఇన్వెస్కో ఇండియా మ్యూచువల్ ఫండ్.. ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది తయారీ రంగ థీమ్‌తో కూడిన ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఈ ఫండ్‌కు నిఫ్టీ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ టీఆర్ఐ బెంచ్ మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. భారత తయారీ రంగంలో ఉన్న వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా ఈ ఫండ్ 50-60 స్టాక్స్‌ల్లో ఇన్వెస్ట్ చేయనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ఈ ఫండ్ ముగింపు తేదీ ఆగస్టు 8.

బజాజ్ ఫిన్‌సర్వ్ లార్జ్ క్యాప్ ఫండ్

బజాజ్ ఫిన్‌సర్వ్ ఏఎంసీ.. లార్జ్ క్యాప్ ఫండ్‌ను ప్రారంభించింది. మదుపరులకు దీర్ఘకాలంలో మెరుగైన రిటర్నులు అందించే విధంగా ఎంపిక చేసిన 25-30 స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేయటం ఈ ఫండ్ ప్రత్యేకత. ఈ ఫండ్‌కు నిఫ్టీ 100 టోటల్ రిటర్న్ ఇండెక్స్ (టీఆర్ఐ) బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.500. ఈ నెల 29న ప్రారంభం కానున్న ఈ ఫండ్ ఆగస్టు 12న ముగియనుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	476
చిత్తూరు	533	విశాఖపట్నం	485
		దజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	94	విజయవాడ	97
వరంగల్	94	గుంటూరు	100
కరీంనగర్	94	ఒంగోలు	100
మహబూబ్‌నగర్	94	చిత్తూరు	104
కర్నూలు	94	నెల్లూరు	104
విశాఖపట్నం	86	అనంతపురం	97
గోదావరి	97		

టెక్ వ్యూ

కీలక స్థాయి 25,000 చేరువలో...



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 24,500 వద్ద బలమైన కరెక్షన్ సాధించి 24,000 వరకు దిగజారింది. కనిష్ఠ స్థాయిల నుంచి బలమైన రికవరీ సాధించి, గురువారంనాడు బలంగా ముగిసింది. ఇది ట్రెండ్‌లో సానుకూలత సంకేతం. గత నాలుగు ట్రేడింగ్ రోజుల్లో ఎన్నో బలమైన కరెక్షన్లు ఎదుర్కొన్నప్పటికీ కీలకస్థాయి 24,400 కన్నా పైన బలంగా ముగియడం మార్కెట్లో బలాన్ని సూచిస్తోంది. చివరికి శుక్రవారం అంతకు ముందు వారం ముగింపుతో పోల్చితే 300 పాయింట్ల లాభంతో 24,830 వద్ద ముగిసింది. మిడ్‌క్యాప్ సూచీ కూడా వారంలో 1,400 పాయింట్ల మేరకు బలమైన కరెక్షన్ సాధించినా చివరికి 1,850 పాయింట్ల లాభంతో ముగిసింది. స్మాల్‌క్యాప్ సూచీ 800 పాయింట్ల మేరకు కరెక్షన్ సాధించి చివరికి 450 పాయింట్ల లాభంతో క్లోజైంది. నిఫ్టీ గత 12 వారాలుగా నిరంతర ర్యాలీలో ఉంది. టెక్నికల్‌గా మార్కెట్ అప్‌ట్రెండ్‌లోనే ఉన్నప్పటికీ మానసిక అవధి 25,000కి చేరువ అవుతున్నందు వల్ల కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ రావచ్చు. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం నిఫ్టీ మైనర్ నిరోధం 24,920 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం, మానసిక అవధి 25,000. ఇక్కడ కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఉండవచ్చు.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 24,700 వద్ద విఫలమైతే బలహీనతను సూచిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 24,500. మార్కెట్ ఇక్కడ నిలదొక్కుకోవాలి. విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 50,400 పాయింట్ల వరకు దిగజారినా మైనర్ రికవరీ సాధించింది. అయినా ముందు వారంతో పోల్చితే 970 పాయింట్ల నష్టంతో 51,300 వద్ద ముగిసింది. ఇతర ప్రధాన సూచీలతో పోల్చితే ఈ సూచీ పనితీరు సంతృప్తికరంగా లేదు. రికవరీ బాట పట్టినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం 51,800 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 52,300. మద్దతు స్థాయి 52,000. ఇక్కడ నిలదొక్కుకోవడంలో విఫలమైతే మరింత బలహీనపడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 51,400.

పాటర్న్: గత వారం ఈ సూచీ 25 డిఎంఏ వద్ద రికవరీ సాధించింది. మార్కెట్ ప్రస్తుతం 25,000 సమీపంలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిరోధం ఎదుర్కొంటోంది. మరింత పురోగమించాలంటే ఈ నిరోధాన్ని బ్రేక్ చేయాలి.

టైమ్ : ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	24,920, 25,000
మద్దతు	24,760, 24,700

ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లపై కన్నేయండి!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా కదలాడే అవకాశాలున్నాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలతో పాటు అమెరికా ఆర్థిక వ్యవస్థ కోలుకుందన్న వార్తలు పాజిటివ్ సెంటిమెంట్‌ను నింపుతున్నాయి. మరోవైపు దేశీయ సూచీలు బడ్జెట్ నష్టాల నుంచి కోలుకున్నాయి. మార్కెట్లలో ఊగిసలాటకు ఆస్కారం లేకున్నా మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది. శుక్రవారం నాటి జోరును కొనసాగిస్తే సూచీలు సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు చేరొచ్చు. ఈ వారం ఫార్మా, హెల్త్‌కేర్ రంగాలు బుల్లిష్‌గా ఉండే అవకాశం ఉంది. ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లు కూడా జోరును ప్రదర్శించే వీలుంది.

స్టాక్ రికమండేషన్స్

దివీస్ లేబొరేటరీస్: సుదీర్ఘకాలం పాటు డౌన్‌ట్రెండ్‌లో పయనించిన ఈ కౌంటర్‌లో ప్రస్తుతం అక్యుములేషన్ జరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.4,750 వద్ద కీలక రెసిస్టెన్స్‌ను బ్రేక్ చేసి చివరకు 6.02 శాతం లాభంతో రూ.4,792 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.4,700/4,750 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.4,950/5,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే 4,660 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సిప్లా: అప్‌ట్రెండ్‌లో చక్కని కన్సాలిడేషన్ తర్వాత ఈ కౌంటర్ జీవితకాల గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. టెక్నికల్‌గా, ఫండమెంటల్‌గా చాలా బలంగా ఉంది. పదేళ్లలోనే అత్యధిక త్రైమాసిక నికర లాభాన్ని నమోదు చేసింది. డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్ భారీగా పెరుగుతోంది. గత శుక్రవారం 5 శాతం లాభంతో రూ.1,575 వద్ద ముగిసింది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,550 శ్రేణిలో ఎంటరై రూ.1,770 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,515 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

భారతి ఎయిర్‌టెల్: ఈ టెలికాం కంపెనీ షేరు నిఫ్టీతో పోలిస్తే బలం ప్రదర్శిస్తున్నాయి. ప్రైస్ యాక్షన్ చాలా బాగుంది. తొలిసారి ఈ షేరు రూ.1,500 పై స్థాయిలో క్లోజైంది. క్రితంసారి ఆల్‌టైమ్ గరిష్ఠాన్ని చేరగానే షేరు పడిపోయింది. ఈసారి అలా జరగలేదు. డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్ పెరగటమే ఇందుకు కారణం. గత శుక్రవారం 4.5 శాతం లాభంతో రూ.1,514 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,500 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,590/1,640 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,475 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

అదానీ పోర్ట్: ఈ షేరు మంచి మూమెంటమ్‌ను కనబరుస్తోంది. ప్రైస్ యాక్షన్ నిలకడగా ఉంది. ఒడుదొడుకులు తక్కువగా ఉన్నాయి. గత శుక్రవారం 3.75 శాతం లాభంతో రూ.1,542 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.1,520 శ్రేణిలో ప్రవేశించి రూ.1,755 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,475 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మహానగర్ గ్యాస్: మార్కెట్ అంచనాలను మించి ఆర్థిక ఫలితాలు ప్రకటించటంతో ఈ షేరు పుంజుకుంది. వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. గత శుక్రవారం 5.3 శాతం లాభంతో రూ.1,846 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.1,800 వద్ద పొజిషన్ తీసుకుని రూ.1,990/2,040 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,760 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com +91 98855 59709

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

గోదావరిలో గల్లంతైన విజయ్ కుటుంబానికి 5 లక్షలు పరిహారం: సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): గోదావరిలో గల్లంతైన యువకుడి కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక సాయం ప్రకటించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా గంటిపెదపూడి వద్ద గోదావరి నదిలో జరిగిన బోటు ప్రమాదంలో పి.గన్నవరంకు చెందిన విజయ్ గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న సీఎం చంద్రబాబు, విజయ్ కుటుంబానికి రూ.5 లక్షలు సాయంగా ప్రకటించారు. నదిలో వరద ఉధృతి తగ్గేంత వరకు లంక గ్రామాల ప్రజలు, గోదావరి పరివాహక ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు.

విద్యా పథకాల పేర్లు మార్పు హర్షణీయం: పవన్

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): భావి తరాలకు స్ఫూర్తినందించే సమాజ సేవకులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తల పేర్లతో ప్రభుత్వ పథకాలను అమలు చేయడం హర్షణీయమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖలో పథకాలను డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, డొక్కా సీతమ్మ, అబ్దుల్ కలాం పేర్లతో అమలు చేయాలని నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు అభినందనలు తెలుపుతూ ఎక్స్ వేదికగా ఆయన పోస్టు చేశారు. 'గత ప్రభుత్వం పాలనలో అన్ని పథకాలకూ ముఖ్యమంత్రి తన పేరే పెట్టుకొన్నారు. ఆ దుస్సాంప్రదాయానికి మంగళంపాడి విద్యార్థుల్లో స్ఫూర్తిని కలిగించే వారి పేర్లతో పథకాలు అమలు మంచి పరిణామం. విద్యా కానుక పథకాన్ని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో అమలు చేయడం సముచితం. మధ్యాహ్న భోజన పథకానికి అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మ పేరు పెట్టడాన్ని స్వాగతించాలి. డాక్టర్ అబ్దుల్ కలాం పేరుతో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించడం యువతలో నూతనోత్తేజాన్ని కలిగిస్తుంది' అని పవన్ పేర్కొన్నారు.

పవన్ అన్న... మీ ఆలోచనలే ప్రేరణ: లోకేశ్

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభినందనలు తెలపడంపై మంత్రి లోకేశ్ ఎక్స్‌లో స్పందిస్తూ... 'డిప్యూటీ సీఎం అభినందనలు నూతనోత్తేజాన్ని నింపాయి. పథకాలకు స్ఫూర్తి ప్రదాతల పేర్లు పెట్టడానికి మీ ఆలోచనలు కూడా ప్రేరణగా నిలిచాయి. ధన్యవాదాలు పవన్ అన్న' అని పేర్కొన్నారు.

మను భాకర్ విజయానికి దేశం గర్విస్తోంది

▸▸ అభినందనలు తెలిపిన గవర్నర్, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు తొలి పతకాన్ని అందించిన మను భాకర్‌కు పలువురు ప్రముఖులు ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్... 'ఒలింపిక్స్‌లో మను భాకర్ విజయంపై దేశం గర్విస్తోంది. భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలను సాధించాలి' అని ఆకాంక్షించారు. సీఎం చంద్రబాబు... 'షూటింగ్‌లో ఒలింపిక్ పతకం సాధించిన తొలి భారత మహిళగా మను భాకర్ చరిత్ర సృష్టించారు' అని ప్రశంసించారు. మంత్రి లోకేశ్... 'మను భాకర్‌కు అభినందనలు. ఆమె కాంస్యం సాధించిన స్ఫూర్తితో మన క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధిస్తారని ఆకాంక్షిస్తున్నా' అని పేర్కొన్నారు.

జగన్ జైలుకు వెళ్లకుండా ఏ శక్తీ ఆపలేదు

▸▸ సంపాదనే లక్ష్యంగా ఐదేళ్లూ పాలించాడు: సత్యకుమార్



అనంతపురం(ఆంధ్రజ్యోతి), గుత్తి, జూలై 28: 'ఆర్థిక నేరారోపణల కేసుల్లో నిందితుడిగా ఉన్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జైలుకు వెళ్లకుండా ఏ శక్తీ ఆపలేదు. సంపాదనే లక్ష్యంగా జగన్ ఐదేళ్లూ పాలన సాగించాడు. ఆర్థిక భారం ఉన్నా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తోంది' అని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. అనంతపురం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో, గుత్తి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ నివాసంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందనీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా హత్యలు, దాడులు జరుగుతున్నాయని గగ్గోలు పెడుతూ ఢిల్లీలో నిరసనలు తెలపడం ఓ పెద్ద నాటకం. దానిని ఆయన రక్తికట్టించారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా ఉండేందుకే ఢిల్లీ డ్రామా ఆడారు. వైసీపీ శ్రేణులపై జరిగిన దాడుల వివరాలు ఇవ్వాలని శాసనసభలో ముఖ్యమంత్రి అడిగినా ఇప్పటివరకూ సమాధానం లేదు' అని మంత్రి విమర్శించారు.

జగన్ సాక్ష్యాధారాలతో వస్తే చర్చకు సిద్ధం: సవిత



మడకశిర, జూలై 28: హత్యా రాజకీయాలపై మాజీ సీఎం జగన్ సాక్ష్యాధారాలతో అసెంబ్లీ సమావేశాలకు వస్తే ప్రభుత్వం తరఫున తాము చర్చకు సిద్ధమని మంత్రి సవిత పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం గుండుమల గ్రామంలో మంత్రి మాట్లాడుతూ... 'దేశంలోనే అత్యధికంగా గంజాయి దొరుకుతున్న రాష్ట్రంగా గత ఐదేళ్లూ ఆంధ్రప్రదేశ్ గుర్తింపు తెచ్చుకొంది. గంజాయి మత్తులో జరిగిన గొడవలను కూడా జగన్... ప్రభుత్వ హత్యలుగా పేర్కొనడం విడ్డూరంగా ఉంది. జగన్ పాలన పుణ్యమా అని రాష్ట్రం ఎంత సంక్షోభంలో ఉందో అందరికీ తెలుసు. 45 రోజులుగా అన్ని శాఖల్లో తోడుతున్న కొద్దీ అప్పులు బయట పడుతున్నాయి' అని మంత్రి సవిత విమర్శించారు.

వైసీపీ హయాంలోని టీటీడీ చైర్మన్లు, సభ్యులపై విచారణ జరగాలి

▸▸ కమీషన్ల రూపంలో చేతులు మారిన 100 కోట్లు: భానుప్రకాశ్‌రెడ్డి



తిరుమల, జూలై 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన టీటీడీ బోర్డు చైర్మన్లు, సభ్యులపై విజిలెన్స్ విచారణ జరగాలని బీజేపీ నేత భానుప్రకాశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'గత బోర్డు తీసుకున్న ప్రతి నిర్ణయంపై భక్తుల్లో అనుమానాలు ఉన్నాయి. ప్రస్తుతం టీటీడీలో వివిధ విభాగాల అధికారులను విజిలెన్స్ అధికారులు ప్రశ్నిస్తున్నారు. నిజానికి చైర్మన్లు, సభ్యులపై విచారణ జరగాలి. అవసరం లేకున్నా.. వర్క్స్ కమిటీ అనుమతి లేకున్నా, ఎందుకు యుద్ధప్రాదిపతికన నిధులు కేటాయింపు కమీషన్ల కోసమే చేశారా? గత బోర్డులోని కొంతమంది సభ్యులకు కొన్ని తీర్మానాల గురించి కూడా తెలీదు. అసలు సూత్రధారులు, పాత్రధారులు బోర్డు చైర్మన్లు, సభ్యులే. రూ.100 కోట్లు కమీషన్ల రూపంలో చేతులు మారాయి. వారిపై క్రిమినల్ కేసులు పెట్టేందుకు న్యాయ సలహాలు తీసుకుంటున్నాం' అని భానుప్రకాశ్‌రెడ్డి తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల నియామక ప్రక్రియ రాజ్యాంగ విరుద్ధం: కేఆర్ సూర్యనారాయణ

అనంతపురం, జూలై 28(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ నియామక ప్రక్రియ మొత్తం పచ్చి మోసం, రాజ్యాంగ విరుద్ధం. దానిని ముఖ్యమంత్రి చంద్రబాబు సరిచేస్తారన్న నమ్మకం మాకు ఉంది' అని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ పేర్కొన్నారు. అనంతపురంలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ, ప్రభుత్వ ఉద్యోగుల సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'మాజీ సీఎం జగన్ అవగాహన లేమితో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. పోస్టులు భర్తీ చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తే... సచివాలయ వ్యవస్థతో ఉద్యోగాలు కల్పించానంటూ జగన్ మోసపూరిత వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికైనా సచివాలయ వ్యవస్థ అధీకృత శాఖను ఏర్పాటు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలి' అని సూర్యనారాయణ కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం: ఏపీజేఏసీ

విజయవాడ, జూలై 28(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పనిచేసే లక్షలాది మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ దామోదరరావు అన్నారు. నూతన ప్రభుత్వంలో వారి కష్టాలు తీరుతాయన్న నమ్మకంతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారన్నారు. ఏపీ కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ, 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో ఆదివారం రెవెన్యూ భవన్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సంఘ రాష్ట్ర అధ్యక్షులు కె.సుమన్ అధ్యక్షత వహించారు. బొప్పరాజు, పలిశెట్టి పాల్గొన్నారు.

న్యాయం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

చేపడుతోంది. అయితే, చివరిదాకా ఇదే దూకుడు కొనసాగిస్తుందా? బాధితులకు న్యాయం చేస్తుందా? వైసీపీ నేతల కబంధ హస్తాల్లో నలిగిపోతున్న వారి ఆస్తులను తిరిగి ఇప్పించగలుగుతుందా? అనేది మౌలిక ప్రశ్న. రాష్ట్రంలో గత కొద్దిరోజులుగా నాలుగైదు ప్రాంతాల్లో తమకు జరిగిన అన్యాయాలపై ప్రభుత్వానికి చెప్పుకోనేందుకు ప్రజలు బహిరంగంగా ముందుకొస్తున్నారు. మరీ ముఖ్యంగా పుంగనూరు, మదనపల్లి ప్రాంతాల బాధిత జనం ఇన్నాళ్లు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన అనుచరుల కాళ్లకింద నలిగిపోయి, ఇప్పుడు ఒక్కసారిగా ఎగిసిపడుతున్నారు. ప్రభుత్వం ఏదో న్యాయం చేస్తుందన్న ఆశతో ముందుకొస్తున్నారు. వేరే దర్యాప్తులు, విచారణలు అక్కరలేదు. ఈ బాధితుల గోడు విని వారికి న్యాయం చేసినా చాలు....అనేక కుట్రలు, కుతంత్రాలు, దౌర్జన్యాలు, బెదిరింపులు, అరాచకాలు, అన్యాయాలు బయటకొస్తాయి. అదొక్కటే కాదు...విశాఖ, భోగాపురం, కర్నూలు, గుంటూరు, విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాల్లో వైసీపీ నేతలు తమను ఎంత దారుణంగా తొక్కిపడేశారో, ఆస్తులను ఎలా స్వాహాచేశారో ప్రజలు బయటకొచ్చి చెబుతున్నారు. విచారణల పేరిట ఎవరినో వేధించాల్సిన అవసరం లేదు. విచారణ అనేది పట్టునడలకుండా, ప్రజల ఆస్తులను వెనక్కి తీసుకొచ్చి, వాటికి రక్షణ కల్పించడమే ప్రధాన ధ్యేయంగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. వైసీపీ దోచుకున్న భూములు తిరిగి వెనక్కి వస్తాయన్న కాస్త భరోసా ప్రభుత్వం కల్పిస్తే ఇంకా లక్షలాది మంది బాధితులు ముందుకొచ్చి తమకు జరిగిన అన్యాయాలను బహిరంగపర్చడానికి సిద్ధంగా ఉన్నారు. ఇందుకు ప్రభుత్వం ఏం చేయనుంది? ఏం చేయాలనుకుంటోంది? అని ప్రజలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకుని పరిష్కరించేందుకు ఒక నమ్మకమైన వ్యవస్థను ఏర్పాటుచేయాలని కోరుకుంటున్నారు. అప్పుడే మరిన్ని అక్రమాలు బయటకు వస్తాయని, లక్షలాది మందికి మేలు జరుగుతుందన్నది సర్వత్రా వినిపిస్తోన్న అభిప్రాయం. సోమవారం రెవెన్యూ శాఖపై సమగ్ర సమీక్ష చేపట్టబోతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో ఏ నిర్ణయం తీసుకోబోతున్నారన్నదానిపై ప్రజల ఆశలు ఆధారపడ్డాయి.

విన్నపాల వెల్లువ

జగన్ ప్రభుత్వంలో వైసీపీ నేతలు అనేకమంది భూచోళ్ల అవతారం ఎత్తారు. కంటికి కనిపించిన ప్రభుత్వ, ప్రైవేటు భూములను కాజేశారు. బాధితులు ప్రభుత్వానికి, పోలీసు యంత్రాంగానికి చెప్పుకొనే సాహసం అప్పట్లో చేయలేకపోయారు. భయంతో వణికిపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చింది. వైసీపీ నేతల భూ దందాపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించింది. ప్రజల నుంచి ఫిర్యాదులు, సూచనలు స్వీకరించేందుకు టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటుచేస్తామని చంద్రబాబు ఈనెల 15వ తేదీన భూములపై శ్వేతపత్రం విడుదల సందర్భంగా ప్రకటించారు. ఇంతలోనే ఉమ్మడి చిత్తూరు జిల్లా మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని రికార్డులకు అగంతకులు కుట్రపూరితంగా నిప్పుపెట్టారు. అక్కడ అసలేం జరిగిందో కనిపెట్టేందుకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా మదనపల్లికి వెళ్లారు. ఆయనను కలిసి తమ గోడు చెప్పుకొనేందుకు వైసీపీ బాధితులు తండోపతండాలుగా కదిలివచ్చారు, తొలిరోజు 700 మంది, రెండోరోజు 1500 మంది, మూడో రోజు 740 మంది ప్రజలు సిసోడియాను కలిసి బాధలు చెప్పుకొన్నారు.

ప్రజలకు న్యాయం చేస్తారా?

ఒక్క మదనపల్లి రెవెన్యూ డివిజన్‌లోనే వేలాది మంది వైసీపీ బాధితులు అధికార్ల ముందుకొచ్చి తమకు అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేశారు. సిసోడియా అక్కడి నుంచి అమరావతికి వచ్చినా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి బాధితులు వరుస కడుతున్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకూ ఇది పాకింది. మరి ప్రభుత్వం ఏం చేస్తుంది? మదనపల్లి భూములపై కఠిన చర్యలు తీసుకుంటుందా? ఇతర ప్రాంతాల్లోని వైసీపీ బాధితులకు భరోసా ఇస్తుందా? అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకొని ప్రజలకు అండగా నిలుస్తారా? లేక లేక హడావుడిగా విచారణ చేసి, ఆ తర్వాత చర్యల విషయం వదిలేస్తారా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. "భూ అక్రమార్కులను ప్రభుత్వం వదిలిపెట్టకూడదు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇక మరెవ్వరూ భూ కబ్జాలు, ఆక్రమణలకు పాల్పడకుండా గట్టి హెచ్చరికలు జారీ చేసేలా సర్కారు చర్యలు ఉండాలి. అంతేకానీ వేధించేలా ఉండకూడదు. అదే సమయంలో ప్రజల భూములను వెనక్కి ఇప్పించి వాటిని రక్షించేలా చర్యలు ఉండాలి. అప్పుడే ప్రజల మనసు కుదుటపడుతుంది. ప్రభుత్వం తమకు కొండంత అండగా నిలిచిందని ప్రజలు భరోసాతో ఉంటారు." అని సీనియర్ ఐఏఎస్ అధికారి చెప్పారు.

పెద్దిరెడ్డి కబంధ హస్తాల్లో...

సిసోడియా మదనపల్లిలో ఉన్న నాలుగు రోజుల వ్యవధిలో ప్రజల నుంచి వేలల్లో ఫిర్యాదులు స్వీకరించారు. భూములు కోల్పోయిన వారి గోడు విన్నారు. వారి నుంచి లిఖితపూర్వక విన్నపాలు స్వీకరించారు. వాటిని క్రోడీకరించి, 482 ఫిర్యాదులను తక్షణమే పరిగణనలోకి తీసుకున్నారు. మదనపల్లి డివిజన్‌లోని 24 మండలాల నుంచి వీటిని పరిగణనలోకి తీసుకున్నారు. ఇందులో మదనపల్లి మండలం నుంచి 179, పుంగనూరు మండలం నుంచి 48 ఫిర్యాదులు వచ్చాయి. వైసీపీ నేతలపైనే వచ్చిన ఫిర్యాదులు 229. ఇందులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వల్లే తమ భూములు కోల్పోయామని స్పష్టంగా 20 ఫిర్యాదులు వచ్చాయి. పెద్దిరెడ్డి కుటుంబీకులు తమ భూములు ఆక్రమించుకున్నారని, దౌర్జన్యంగా పంచాయితీలు చేసి లాక్కున్నారని 96 ఫిర్యాదులు వచ్చాయి. ఇక పెద్దిరెడ్డి అనుచరుల్లో ఒకరైన మాధవరెడ్డి దౌర్జన్యంగా భూములు లాక్కున్నారని తొమ్మిది మంది స్పష్టమైన ఆధారాలతో ఫిర్యాదులు ఇచ్చారు. మదనపల్లికి చెందిన వైసీపీ నేతలు దౌర్జన్యంగా భూములు లాక్కున్నారని 27 ఫిర్యాదులు వచ్చాయి. పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి భూ ఆక్రమణలకు పాల్పడ్డారని ఎనిమిది ఫిర్యాదులు వచ్చాయి. వీటిని సిసోడియా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నారు. వైసీపీ నేతల భూ దందాలో రెవెన్యూ అధికారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా వారికి సహకరించినట్లుగా ప్రజలు ఫిర్యాదులు చేశారు. వాటిని క్రోడీకరించగా, పలువురు తహసిల్దార్ల ప్రమేయం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ విషయాన్ని కూడా సిసోడియా తన ప్రాథమిక నివేదికలో పొందుపరిచారు.

సర్కారు చేతికి పెద్దిరెడ్డి గుట్టు?

▸▸ హైదరాబాద్‌లోని శశికాంత్ ఇంట్లో తనిఖీలు

▸▸ 4 ట్రంకు పెట్టెల్లోని కీలక ఫైళ్లు, డాక్యుమెంట్లు సీజ్

అమరావతి/తిరుపతి/రాయచోటి/మాదాపూర్, జూలై 28 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో భూ రికార్డుల దహనం కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అత్యంత సన్నిహితుడు, ఆయనకు వ్యక్తిగత సహాయకుడిగా పనిచేసిన శశికాంత్ (అలియాస్ శశి)ను అదుపులోకి తీసుకునేందుకు హైదరాబాద్‌లోని నివాసానికి వెళ్లిన పోలీసులకు అత్యంత కీలకమైన డాక్యుమెంట్లు లభించాయి. పది మంది పోలీసులు దాదాపు 8గంటల పాటు నిర్వహించిన సోదాల్లో మొత్తం నాలుగు ట్రంకుపెట్టెల్లో ఫైళ్లు, డాక్యుమెంట్లను గుర్తించారు. వాటితో పాటు ఒక ల్యాప్‌టాప్‌ను సీజ్ చేసి అమరావతికి తరలించారు. వాటిలో గనుల శాఖతో పాటు, మదనపల్లి, తిరుపతి, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ తదితర ప్రాంతాల భూముల ఫైళ్లు, రికార్డులు ఉన్నట్లు గుర్తించారని సమాచారం. ఫైళ్ల దహనం కేసులో ఈ పరిణామం చాలా కీలకమైనదిగా ప్రభుత్వం భావిస్తోంది. పెద్దిరెడ్డికి శశికాంత్ నమ్మిన బంటు. జగన్ ప్రభుత్వంలో గనులు, అటవీ శాఖలకు పెద్దిరెడ్డి మంత్రిగా ఉన్నప్పటికీ అసలు మంత్రిగా శశినే వ్యవహరించారని అధికార వర్గాలు చెబుతున్నాయి. గనుల శాఖలో విజిలెన్స్ దాడులు, వసూళ్లు, బదిలీలు, పదోన్నతుల వ్యవహారంలో గోల్‌మాల్, వ్యాపారులను బెదిరించడం, అడ్డగోలుగా లెటర్ ఆఫ్ ఇంటెంట్‌లు ఇప్పించారని ఆయనపై ఫిర్యాదులు ఉన్నాయి. పక్కా సమాచారంతో పోలీసులు హైదరాబాద్‌లోని అయ్యప్ప సొసైటీలోని ఆర్‌ఆర్ రెసిడెన్సీకి వెళ్లారు. ఈ విషయం తెలిసిన శశి తన ఫ్లాట్‌కు తాళం వేసి బయటకు వెళ్లిపోయారు. ఫ్లాట్ యజమాని, పామర్రు మాజీ ఎమ్మెల్యే సమక్షంలో పోలీసులు తాళాలు తెరిచారు. మరోవైపు ఓ బృందం శశి కోసం తీవ్రంగా గాలిస్తున్నట్లు తెలిసింది.

వైసీపీ నేతల ఇళ్లలో సోదాలు

తిరుపతి నగరం మంగళం రోడ్డులోని మాజీ మంత్రి పెద్దిరెడ్డి పీఏ తుకారాం నివాసంలో ఆదివారం పోలీసులు, సీఐడీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. 4గంటల పాటు క్షుణ్ణంగా సోదాలు చేసి 15 కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ కోసం ఆయన్ను అదుపులోకి తీసుకుని మదనపల్లె తరలించారు. మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి నేతృత్వంలో పోలీసులు, సీఐడీ సీఐ రామకిశోర్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, శనివారం అర్ధరాత్రి తంబళ్లపల్లె వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఇంట్లో సోదాలు జరిగినట్లు సమాచారం. ఆ సమయంలో ఎమ్మెల్యే ఇంట్లో లేరని తెలిసింది. ఇక్కడ పోలీసులకు ఎటువంటి రికార్డులు, డాక్యుమెంట్లు దొరకలేదని సమాచారం. ఆదివారం తెల్లవారుజామున 5గంటల సమయంలో వైసీపీకి చెందిన మదనపల్లె మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఇంటికి పోలీసులు వెళ్లారు. బెంగళూరులో ఉన్న ఆయన సాయంత్రం 5గంటల ప్రాంతంలో తిరిగి వచ్చారు. అప్పటినుంచి సోదాలు కొనసాగుతున్నాయి. కొన్ని డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. పరారీలో ఉన్న పెద్దిరెడ్డి ముఖ్య అనుచరుడు మాధవరెడ్డితో ఏమైనా భూ లావాదేవీలు జరిపారా? అనే కోణంలో ఈ సోదాలు జరుగుతున్నట్లు చెబుతున్నారు. శనివారం అర్ధరాత్రి నుంచి పలుచోట్ల ఏకకాలంలో ఈ సోదాలు కొనసాగుతున్నాయి. మరోవైపు మాధవరెడ్డి కోసం ప్రత్యేక బృందాలతో వేట కొనసాగుతోంది.

కబ్జాదారులపై కొరడా..!

(మొదటి పేజీ తరువాయి)

తెలిసింది. ఈ కమిటీ రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాలు, బాధితులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లి వారి విన్నపాలు స్వీకరించేలా ప్రతిపాదించారు. రాష్ట్రంలో వైసీపీ నేతల భూ అక్రమాలు, పేదలపై వారు చేసిన అరాచకాలపై సమగ్ర విచారణ ఉంటుందని చంద్రబాబు ఈ నెల 15వ తేదీన ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత కొద్దిరోజులకే ఉమ్మడి చిత్తూరుజిల్లా మదనపల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని రెవెన్యూ రికార్డులకు అగంతకులు నిప్పుపెట్టారు. భూ అక్రమాలు, దందాలు బయటకు రాకుండా ఉండేందుకే కుట్రపూరితంగా సబ్‌కలెక్టర్ ఆఫీసుకు నిప్పుపెట్టారని రెవెన్యూశాఖ స్పెషల్ సీఎస్ ఆర్.పి.సిసోడియా ప్రభుత్వానికి ఇప్పటికే ప్రాథమిక నివేదిక ఇచ్చారు. సోమవారం సీఎం వద్ద జరిగే సమావేశానికి మరో నివేదికను ఆయన ఇవ్వనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా గత ఐదేళ్లుగా సాగిన రాజకీయ నేతల భూ ఆక్రమణలు, దౌర్జన్యాలపై త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించనున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే, కమిటీకి సహకరించేందుకు, చట్టబద్ధంగా, అధికారికంగా కేసుల పరిష్కారానికి వీలుగా జోన్ల వారీగా క్వాజీ జ్యుడీషియల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదించనున్నట్లు సమాచారం. మరోవైపు, రాష్ట్రంలో అసైన్, చుక్కల భూముల పరిస్థితి, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లలో తీసుకురావాల్సిన మార్పులపై భూపరిపాలన ప్రధాన కమిషనర్ జయలక్ష్మి నివేదిక ఇవ్వనున్నారు. కొత్త ఫార్మాట్‌లో కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రతిపాదించనున్నట్లు తెలిసింది. గతంలో జగన్ ఫొటోలతో కూడిన సర్టిఫికెట్లు ఇచ్చేవారు. ఎన్నికల సమయంలో వాటిని నిలిపివేశారు. ఇప్పుడు జగన్ బొమ్మ ఉన్న సర్టిఫికెట్లను తొలగించి వాటి స్థానంలో హైసెక్యూరిటీ ఫీచర్లు ఉన్న సర్టిఫికెట్లు ఇచ్చేలా ప్రతిపాదనలు చేయనున్నారు.



ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్

శ్వేతపత్రాల్లో పరోక్ష అప్పుల వివరాలేవీ?

▸▸ రెవెన్యూ, శాంతిభద్రతలపై ప్రభుత్వం దృష్టి సారించాలి

▸▸ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేశ్ సూచన

▸▸ విశాఖలో జన చైతన్య వేదిక ముఖాముఖి కార్యక్రమం

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం చేసిన ఆర్థిక అవకతవకలకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేస్తున్న శ్వేతపత్రాల్లో పరోక్ష అప్పుల వివరాలు పేర్కొనలేదని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్ అన్నారు. 'ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి- తక్షణ కర్తవ్యాలు' అనే అంశంపై ఆదివారం గుంటూరులోని ఓ హోటల్‌లో జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న శ్వేతపత్రాల ప్రకారం రాష్ట్రానికి పది లక్షల కోట్ల అప్పు ఉందన్నారు. పరోక్ష అప్పులు మరో రెండు లక్షల కోట్ల వరకు ఉన్నాయన్నారు. వీటిలో ప్రభుత్వ ఆస్తులను తాకట్టుపెట్టి తెచ్చిన అప్పులు, రాష్ట్రంలో మద్యం ఆదాయాన్ని చూపించి తెచ్చిన రూ.16వేల కోట్లు, ప్రభుత్వశాఖలను గ్యారెంటీగా చూపించి తెచ్చిన అప్పులు ఉన్నాయని చెప్పారు. గడిచిన ఐదేళ్లలో మద్యం ఆదాయాన్ని ప్రభుత్వం భారీగా పెంచుకుందని, 2019లో మద్యం ద్వారా ప్రభుత్వానికి నాలుగు వేల కోట్ల ఆదాయం వస్తే, 2023 నాటికి అది రూ.16 వేల కోట్లకు పెరిగిందన్నారు. విజన్ ఉన్న చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం శుభపరిణామమని, కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్రానికి సత్సంబంధాలు ఉండటం వల్ల కూడా మేలు కలుగుతుందని చెప్పారు. తలసరి ఆదాయంలో దేశంలోనే చివరి స్థానంలో ఏపీ ఉండగా, తెలంగాణ మొదటిస్థానంలో ఉందన్నారు. విశ్వవిద్యాలయాలు సమాజానికి అద్దాల వంటివని, సమాజంలో వివిధ అంశాలపై విశ్లేషణ, పరిశోధనలు జరగాల్సిన అవసరముందని చెప్పారు. రాష్ట్రం సాంస్కృతిక ఎడారిగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీలో మతతత్వం లేకపోయినా కులతత్వం పెరిగిపోయిందని, సమాజంలో మత్తు పదార్థాలు, మద్యం వినియోగం పెరిగిపోయాయని చెప్పారు. వైసీపీ తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని రద్దుచేయడం కూటమి ప్రభుత్వం చేసిన మంచి పనిగా ఆయన అభివర్ణించారు. భూములకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని, శాంతిభద్రతలు, రెవెన్యూ విభాగాన్ని గాడినపెట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో ఉత్పత్తి పెరిగేలా సంస్కరణలు తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో 33 శాతం మంది బాలికలు పౌష్టికాహార లేమితో బాధపడుతున్నారని చెప్పారు. విద్య, వైద్య సదుపాయాల కల్పనకు కృషి జరగాలన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులను తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఏయూ దూరవిద్య కేంద్రం మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.హరిప్రకాశ్, మాజీ వీసీ ఆర్.సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

'క్రిటికల్ రివర్'పై విచారణ

▸▸ ఆస్తుల రిజిస్ట్రేషన్ సాఫ్ట్‌వేర్‌పై ప్రజల్లో వ్యతిరేకత.. సర్కారు దృష్టి

▸▸ ఎన్ఐసీని తప్పించడం వెనుక కుట్ర జరిగి ఉంటుందనే అనుమానాలు

▸▸ వేలిముద్రలు, ఆస్తుల వివరాల భద్రతపైనా పలు సందేహాలు

▸▸ క్రిటికల్ రివర్‌ను అడ్డంపెట్టుకుని ప్రజల స్థిరాస్తులపై జగన్ కన్ను

▸▸ అప్పటి ఐటీ సలహాదారు శేషిరెడ్డిదే 'క్రిటికల్ రివర్' సాఫ్ట్‌వేర్ కంపెనీ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ తర్వాత ప్రజలకు అసలు(ఒరిజినల్) పత్రాలకు బదులు కాపీ(జిరాక్స్) పత్రాలు చేతిలో పెట్టడం ఎన్నికలకు ముందు తీవ్ర వివాదామైన సంగతి తెలిసిందే. పైగా ప్రజల వేలిముద్రలను రిజిస్టర్‌లో కాకుండా కంప్యూటర్‌లో తీసుకోవడం కూడా దుమారం రేపింది. సదరు ఆస్తుల వివరాలను, స్థిరాస్తిదారుల వేలిముద్రలను 'క్రిటికల్ రివర్' అనే ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీకి చేరవేయడం పట్ల కూడా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు అధికారంలోకి రాగానే ముందుగా జిరాక్స్ పత్రాల స్థానంలో ఒరిజినల్ పత్రాలు ఇవ్వడం మొదలుపెట్టారు. అలాగే, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు పాతికేళ్లుగా టెక్నికల్ సపోర్ట్ అందిస్తున్న జాతీయ సమాచార కేంద్రా(ఎన్ఐసీ)న్ని పక్కన పెట్టి ప్రైవేటు రంగానికి చెందిన 'క్రిటికల్ రివర్'కు ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన కాంట్రాక్టు ఇవ్వడంపై చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించింది. దీనిలో జరిగిన అవకతవకలను గుర్తించేందుకు ఆ కంపెనీ వ్యవహారాలపై విచారణకు ఆదేశించింది. స్టాంపు పేపర్లు కొనుక్కునేది ప్రజలు. దానిపై స్థిరాస్తి వివరాలు రాయించుకునేది ప్రజలు, వాటిని చదివి, ఈసీలో చెక్ చేసి సంతకాలు పెట్టడం మాత్రమే ప్రభుత్వాధికారుల పని. కానీ, జగన్ హయాంలో తెచ్చిన జిరాక్సు రిజిస్ట్రేషన్ల విధానంలో స్టాంపు పేపర్లను ఎత్తేశారు. కంప్యూటర్‌లో ఫారం నింపి, దాన్ని రిజిస్ట్రేషన్‌కు పంపాలి. దానిపై రెండు పార్టీలు, సబ్‌రిజిస్ట్రార్లు సంతకాలు పెట్టి, స్కాన్ చేసి ఆ ఇమేజ్‌ని ఆ ఆస్తి కొనుగోలు చేసిన వారి ఫోన్‌కో, ఈ మెయిల్‌కో పంపుతారు. దాన్ని ప్రింట్ తీస్తే వచ్చే జిరాక్సులే జగన్ హయాంలో ఆస్తి పత్రాలుగా చలామణి అయ్యాయి. పైగా ప్రజల ఆస్తుల వివరాలను ప్రైవేటు కంపెనీ క్రిటికల్ రివర్‌కు చేరవేయడం తీవ్ర వివాదాస్పదమైంది.

35 కోట్లు ఖర్చు పెట్టి మరీ..

పాతికేళ్ల నుంచి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్ఐసీ టెక్నికల్ సేవలందిస్తోంది. జగన్ ఈ సేవల నుంచి ఎన్ఐసీని హఠాత్తుగా తప్పించి రూ.35 కోట్లు ఖర్చు చేసి 'క్రిటికల్ రివర్' అనే కంపెనీకి ఆ బాధ్యతలు అప్పగించారు. జగన్ హయాంలో ఐటీ సలహాదారుగా పనిచేసిన శేషిరెడ్డికి సంబంధించిన ఈ కంపెనీ... పేరుకి అమెరికా కంపెనీ అయినా దేశంలోని పలు రాష్ట్రాల్లో శాఖలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అనేక ప్రశ్నలు తెరమీదికి వచ్చాయి. ప్రజల వివరాలను ఈ కంపెనీకి నేరుగా పంపించడం వెనుక ఉద్దేశం ఏంటి? రిజిస్ట్రేషన్ చట్టానికి విరుద్ధంగా ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సాక్షులు అక్కర్లేదంటూ ఆదేశాలు ఇవ్వడం వెనుక మర్మమేంటి? ఆ కంపెనీకి చేరిన ప్రజల వేలిముద్రలు, ఆస్తుల వివరాలు భద్రంగా ఉన్నాయా? దుర్వినియోగమయ్యాయా? అన్న అనుమానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఎన్ఐసీని తప్పించి 'క్రిటికల్ రివర్' కాంట్రాక్టులు అప్పగించడం వెనుక ఉన్న కుట్రపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.

తనఖా పెట్టేందుకేనా?

ప్రభుత్వ కార్యాలయాలు, భూములు నుంచి రాష్ట్ర సచివాలయం వరకు అన్నింటినీ తాకట్టు పెట్టిన అప్పటి జగన్ ప్రభుత్వం ప్రజల స్థిరాస్తులను సైతం తనఖా పెట్టేందుకు ఒక విధానాన్ని తీసుకువచ్చిందనే విమర్శలు వచ్చాయి. ఒకవేళ ఈ ఎన్నికల్లో జగన్ పార్టీ గెలిచి అధికారంలోకి వచ్చి ఉంటే ప్రభుత్వ ఆస్తులతో పాటు జనాల ఆస్తులు కూడా తనఖాకు వెళ్లిపోయేవి. దీనికిగాను జగన్ పక్కాప్లాన్ సిద్ధం చేశారు. ఈ క్రమంలో తొలుత స్థిరాస్తి రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ఒరిజినల్ పత్రాలు ఇవ్వకుండా ఆపారనే విమర్శలు వచ్చాయి. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్టర్లలో నమోదు చేసుకుని భద్రపరిచే ప్రజల వేలిముద్రలను కంప్యూటర్‌లో తీసుకుని అక్కడే భద్రపరచడం మొదలుపెట్టారు. రిజిస్టర్లను పూర్తిగా ఎత్తేశారు. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ వ్యవహారాలకు ఇకపై 'సాక్షులు' అక్కర్లేదని కూడా ఆదేశాలిచ్చి మరో బాంబు పేల్చారు. ఒరిజినల్స్ ఉండవు, వేలిముద్రల రిజిస్టర్లు ఉండవు. ఏవైనా తేడాలొస్తే చెప్పడానికి సాక్షులు కూడా ఉండరు. ఇలా జనాల ఆస్తులను వాడుకునేందుకు జగన్ ప్రయత్నించారు. ఈ రిజిస్ట్రేషన్ పత్రాలను, వేలిముద్రలను జగన్ సన్నిహితుల కంపెనీ 'క్రిటికల్ రివర్' అనే కంపెనీకి చేరవేశారు.

గోధుమపిండి టెండర్లలో కిరికిరి!

▸▸ పౌరసరఫరాల శాఖ అధికారుల తీరుపై అనుమానాలు

▸▸ గతంలో సరఫరా చేసిన మిల్లర్లకే మళ్లీ టెండరు ఖరారు

▸▸ ఇంకా గత వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన అధికారులదే హవా



విశాఖపట్నం, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బియ్యం కార్డుదారులకు గోధుమపిండి పంపిణీ చేసేందుకు వీలుగా పిలిచిన టెండరు ఖరారులో పౌరసరఫరాల సంస్థ ఏకపక్షంగా వ్యవహరించిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో టెండర్లు దక్కించుకున్న వారికే మరోసారి అధికారులు అప్పగించారన్న వాదన వినిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మూడు జోన్‌ల పరిధిలో వచ్చేనెల 1నుంచి వచ్చే ఏడాది జూలై వరకు 20,302.224 టన్నుల గోధుమ పిండి సరఫరాకు ఈ నెల 3న పౌరసరఫరాల సంస్థ ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా స్వల్పకాలిక వ్యవధిలో టెండర్లు ఆహ్వానించింది. జోన్ల వారీగా సంస్థ గోధుమలు అందజేస్తే వాటిని పిండి ఆడించి కిలో ప్యాకెట్లుగా తయారుచేసి జిల్లాల్లోని ఎంఎల్ఎస్ పాయింట్లకు సరఫరా చేయాల్సి ఉంది. బిడ్ దాఖలకు ఈ నెల 11 సాయంత్రం 5గంటల వరకు గడువు ఇచ్చిన పౌరసరఫరాల సంస్థ అదేరోజు ప్రీక్వాలిఫికేషన్ ప్రక్రియ పూర్తిచేసింది తప్ప ఖరారు చేయలేదు. సాంకేతిక కారణాలతో టెండర్ల ప్రీక్వాలిఫికేషన్ ప్రక్రియ పూర్తిచేయలేదని 16న ఈప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో స్క్రోలింగ్ ఇచ్చింది. సాధారణంగా ప్రీక్వాలిఫికేషన్ ప్రక్రియ చేపట్టినపుడు బిడ్డింగ్‌లో పేర్కొన్న విధంగా సంబంధిత డాక్యుమెంట్లు లేకపోతే వెంటనే తెలియజేసి వాటిని సమర్పించేందుకు కొంత సమయం ఇచ్చి తరువాత కమర్షియల్ టెండరు కమ్ వేలం టెండరు ప్రక్రియ చేపడతారు. అయితే ఏ విషయం టెండరుదారులకు చెప్పకుండా ఈ నెల 22న ఉదయం 9గంటలకు టెండరుకమ్ వేలం ఉంటుందని 20వ తేదీ సాయంత్రం ఈప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో స్క్రోలింగ్ ఇచ్చారు. టెండర్లు వేసిన మిల్లర్లకు ముందుగా సమాచారం ఇవ్వలేదు. చివరకు ముగ్గురు టెండరుదారులు అనర్హులంటూ 22వ తేదీ ఉదయం 7.51 గంటలకు ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించారు. అదే సమయంలో మూడు జోన్లకు గోధుమపిండి సరఫరా కోసం ముగ్గురిని ఖరారు చేశారు. గత ప్రభుత్వంలో గోధుమపిండి సరఫరా చేసిన ఇద్దరికి తిరిగి టెండరు ఖరారయింది. అది కూడా పౌరసరఫరాల సంస్థ ఎండీ బదిలీ అయిన సమయంలో సంస్థ అధికారులు చక్రం తిప్పారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. టెండరులో పాల్గొన్న మరో ముగ్గురు పిండిమిల్లుల యజమానులను ఎందుకు అనర్హులుగా ప్రకటించారో చెప్పలేదు. దానిపై ప్రశ్నిస్తే అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారని ఏపీ మిల్లర్ల సంఘం ప్రతినిధి రాముడు ఆరోపించారు. టెండరులో పాల్గొన్న ఒక మిల్లుకు చెందిన ఈఎండీ ఇచ్చారని, మరో మిల్లు చెల్లించిన రూ.1.17కోట్లు ఈఎండీ ఇవ్వలేదని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సంస్థలో చక్రం తిప్పిన కొందరు అధికారులే ఇంకా హవా కొనసాగిస్తున్నారనే విషయాన్ని పౌరసరఫరాల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని మిల్లర్లు నిర్ణయించారు.




శెభాష్ రామయ్యా!

- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటి విధులు
- లైన్‌మన్‌ను అభినందించిన గొట్టిపాటి
- తోటి ఉద్యోగులకు స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసలు

అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు అల్లూరి జిల్లాలోని మన్యంపాడు, దేవరపల్లికి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఈ సమయంలో ఈపీడీసీఎల్ లైన్‌మన్ రామయ్య వరదను సైతం లెక్కచేయకుండా కరెంటు వైర్ల సాయంతోనే ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటి విద్యుత్తు పునరుద్ధరణ విధులు నిర్వర్తించారు. ఆయన చేసిన సాహసం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ విషయం విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి వెళ్లింది. వెంటనే స్పందించిన రవికుమార్... వాట్సప్, ఎక్స్ వేదికగా రామయ్యను అభినందించారు. సంక్షోభాలను సానుకూలంగా మలచుకోవడంలో టీడీపీ అధినేత చంద్రబాబు పెట్టింది పేరని గుర్తుచేశారు. అదే తరహాలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును కూడా లెక్కచేయకుండా లైన్‌మన్ రామయ్య విద్యుత్తు పునరుద్ధరణ పనులు చేసి ప్రజాజీవనానికి అసౌకర్యం లేకుండా చేశారని గొట్టిపాటి ప్రశంసించారు. తోటి ఉద్యోగులకు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు.



పట్టిసీమ నుంచి 5,310 క్యూసెక్కుల విడుదల

పోలవరం, జూలై 28: ఏలూరు జిల్లా పోలవరం మండలంలోని పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ప్రాజెక్టు కుడి కాల్వకు 5,310 క్యూసెక్కుల జలాలు విడుదల చేసినట్టు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు ఆదివారం తెలిపారు. ఈ ఏడాది జూన్ 14 నుంచి ఇప్పటి వరకు 8.1632 టీఎంసీల నీటిని కృష్ణా డెల్టాకు విడుదల చేసినట్టు తెలిపారు. గోదావరి నీటిమట్టం 24.180 మీటర్లకు పైబడి ఉందని 15 మోటార్లు 15 పంపులతో నీటి విడుదల చేస్తున్నట్టు తెలిపారు.

చెదురుమదురు వర్షాలు

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు మోస్తరుగా ఉన్నాయి. దీనికితోడు రుతుపవనద్రోణి తూర్పు భాగం ఒడిశాలో బాలాసోర్ మీదుగా తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు విస్తరించింది. ఈ ప్రభావంతో ఆదివారం రాష్ట్రంలో చెదురుమదురు వర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల ఎండ తీవ్రత పెరిగింది. రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తాలో పలుచోట్ల, దక్షిణకోస్తా, రాయలసీమలో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. కాగా.. బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడేవరకు పరిస్థితి ఇలాగే ఉంటుందని పేర్కొంది.

మినీ గల్ఫ్‌గా రాజోలు దీవి..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి వేల సంఖ్యలో గల్ఫ్‌తో పాటు ఇతర దేశాలకు ఉపాధి కోసం వెళుతుంటారు. మినీ గల్ఫ్‌గా పేరొందిన రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు, మామిడికుదురు మండలాల నుంచి గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లే వారి సంఖ్య అధికం. గత కొన్ని సంవత్సరాల క్రితం అరబిక్ దేశాల్లో ద్రవ్యోల్బణం రేటు అధికంగా ఉండటంతో అక్కడికి వెళ్లిన వారిలో చాలామంది ఆర్థికంగా స్థితిమంతులు కావడం నిజం! కష్టాలు అనుభవిస్తున్న వారు ఉండటమూ అంతే నిజం!

ఎడారి జీవితం!


గల్ఫ్ దేశంలో వలస కార్మికులు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధాలు లేకుండా చీకటి బతుకులు వెళ్లదీస్తున్నారు. తినడానికి తిండిలేక గొర్రెలకు పెట్టే ఆహారాన్ని తింటూ పొట్ట గడుపుకునే వారందరో ఉన్నారు. ఎడారి నుంచి పారిపోయే అవకాశం లేక అలాగే మగ్గిపోతున్నారు. గల్ఫ్ ఏజెంట్లు కోనసీమ జిల్లాలో ఊరికొకరి వంతున పుట్టుకొచ్చారు. అమాయక గ్రామీణ ప్రాంత మహిళలకు గల్ఫ్ దేశాల్లో ఉపాధి పట్ల ఆసక్తి కల్పించి వారిని అక్కడికి పంపించి మురికి కూపంలోకి నెట్టుతున్నారు. ఇటువంటి సంఘటనలపై కోనసీమ జిల్లాల్లో ముఖ్యంగా రాజోలు దీవిలో పలు పోలీసుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. మరికొందరిని ఉపాధి పేరుతో డబ్బులు తీసుకుని మోసాలు చేసే బోగస్ ఏజెంట్లు పైనా కేసులు ఉన్నాయి.

పాస్‌పోర్టు లాగేసుకుని...

ఇళ్లల్లో పనిచేసేందుకు వెళ్లే కార్మికుల వెతలు అన్నీఇన్నీకావు. గల్ఫ్‌లో యజమానులను కపిల్ అని పిలుస్తుంటారు. వీసాపై వెళ్లిన వెంటనే కపిల్ అక్కామా(యజమాని అనుమతి ముద్ర) వేస్తేనే ఆ దేశంలో ఉండేందుకు వీలవుతుంది. కొంతమంది యజమానులు మానవతా దృక్పథంతో కార్మికులను బాగానే చూస్తుంటారు. మరికొంతమంది మాత్రం నరకయాతన పెడుతుంటారు. పాస్‌పోర్టు తీసేసుకుంటారు. దాంతో గత్యంతరం లేక కష్టమైనా, నష్టమైనా అక్కడే పనిచేయాల్సి వస్తోంది. తిండి సరిగా పెట్టక, జీతాలు ఇవ్వక చాలా ఇబ్బందులకు గురి చేస్తారు. కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడనీయరు. పాస్‌పోర్టు కపిల్ వద్ద ఉండిపోవడంతో అలాగే కాలం గడపాల్సిన పరిస్థితులు ఏర్పడుతుండటంతో కుటుంబ సభ్యులతో సమాచారం తెగిపోతుంది. యజమానుల చిత్రహింసలు భరించలేక చాలా మంది పారిపోతూ బయటకు వచ్చేస్తుంటారు. అయితే వారి వద్ద పాస్‌పోర్టు లేకపోవడంతో అక్కడి పోలీసులు వెంటనే అరెస్టు చేసి జైల్లో పెడతారు.

మరణాలు ఎక్కువే..

గల్ఫ్ దేశాల్లో ఇటీవల కాలంలో భారతీయుల మరణాలు



ఎక్కువగా సంభవిస్తున్నాయి. కొంతమంది అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా, మరి కొంతమంది హత్యలకు కూడా గురవుతారు. చాలామంది అనారోగ్యంతో మృతి చెందుతున్నారు. వీరిలో కొన్ని మృతదేహాలు స్వగ్రామం చేరుతుండగా, పాస్‌పోర్టు లేని మృతదేహాలు అనాథ శవాలుగా అక్కడే ఉండిపోవడం కడు దయనీయం.

ఇలా చేస్తే మేలు!

గుర్తింపు లేని ఏజెంట్లు చాలామంది ఉన్నారు. వీసా, టికెట్లు, విమానం ఎక్కించేందుకు వీరంతా మొత్తం ఖర్చులు మాట్లాడుకుని వారిని విదేశాలకు పంపిస్తుంటారు. హైదరాబాద్, చెన్నై విమానాశ్రయాల ద్వారా ఏజెంట్లు గల్ఫ్ పంపిస్తుంటారు. ఒక్కోసారి టికెట్లు ఒత్తిడి అయినా పుషింగ్ ద్వారా పంపిస్తుంటారు. ఇలా ఏజెంట్ల చేతుల్లో చాలా మంది మోసపోతున్నారు. కొన్నింటికి కేసులు నమోదవుతున్నా, ఎన్నో కేసులు బయటకు చెప్పకోలేక అలాగే ఉండిపోతున్నాయి. గుర్తింపుగల ఏజెంట్లను ఆశ్రయించమని పోలీసులు ప్రకటిస్తున్నా జనం పట్టించుకోవడం లేదు. ఏజెంట్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, గుర్తింపు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలి. వీసా వచ్చిన వెంటనే అది అసలుదో... నకిలీయో ఇట్టే తెలుసుకోవచ్చు వీసాను స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి చూపించాలి. తద్వారా అధికారులు ఎంబసీతో సంప్రదింపులు జరిపి దాని వివరాలు తెలుపుతారు. అరబిక్, ఇంగ్లీషు భాషలో ఉంటుంది కాబట్టి పూర్తి సమాచారం అందిస్తారు. వీసా వచ్చిన వెంటనే ప్రతి ఒక్కరూ పూర్తి సమాచారం తెలుసుకోవాలి.

కళ్లు పోయినా పట్టించుకోలేదు



దుబాయ్‌లో తొమ్మిదేళ్లపాటు పని చేశా. ఫ్యాక్టరీలో పనిచేసే సమయంలో కెమికల్ కళ్లల్లో పడింది. రెండు కళ్లూ కనిపించకుండా పోయాయి. కంపెనీ ఎటువంటి సమాధానం చెప్పలేదు. చెకప్ కోసం సొంత డబ్బులతో వైద్యం చేయించుకోలేక ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల స్వస్థలానికి వచ్చేశాను. గల్ఫ్‌లో కొన్నాళ్ల పాటు కష్టపడితే నా కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగుంటుందని వెళ్తే ఇప్పుడు ఇంటికొచ్చిన తరువాత ఎటువంటి ఉపాధి పనులకూ వెళ్లలేని నిస్సహాయ పరిస్థితిలో పడిపోయాను.

-గనిశెట్టి రామాంజనేయులు, అంతర్వేది

లోకేశ్‌కు రుణపడి ఉంటాం



బతుకుదెరువు కోసం గల్ఫ్ వెళ్లిన నేను ఏజెంట్ మోసంతో సౌదీ అరేబియా ఎడారిలో నరకయాతన అనుభవించా. అధిక ఉష్ణోగ్రతతో రక్తపు వాంతులై ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. నా పరిస్థితిపై సోషల్ మీడియాలో వీడియో పెట్టడంతో మంత్రి నారా లోకేశ్ ఎంతో సహృదయంతో స్పందించారు. అక్కడున్న ఎన్నారై, టీడీపీ ప్రతినిధుల ద్వారా క్షేమంగా స్వదేశానికి తీసుకువచ్చారు. నేను, నా కుటుంబ సభ్యులు కూటమి ప్రభుత్వానికి, మంత్రి నారా లోకేశ్‌కు రుణపడి ఉంటాం.

-సరెళ్ల వీరేంద్రకుమార్, గల్ఫ్ బాధితుడు, ఇసుకపూడి గ్రామం, అంబాజీపేట మండలం

ఏజెంట్ చేతిలో మోసపోయా


గోడు వెళ్లబోసుకుంటున్న గల్ఫ్ బాధితురాలు నిర్మల

- గల్ఫ్‌లో నరకం అనుభవించా!
- కాలు విరిగినా యజమాని కనికరించలేదు
- కొట్టి మరీ పనిచేయించుకున్నారు
- గల్ఫ్ బాధితురాలు నిర్మల.. ఎట్టకేలకు స్వదేశానికి..

పంజాగుట్ట, జూలై 28 (ఆంధ్రజ్యోతి): 'ఇంట్లో పరిస్థితులు బాగాలేక, కుమారుడికి మంచి చదువులు చదివిద్దామని ఆశపడి తణుకుకు చెందిన ఏజెంట్ సంజయ్ అనే వ్యక్తి ద్వారా రెండేళ్ల క్రితం ఒమాన్ రాజధాని మస్కట్‌కు వెళ్లాను. అక్కడ ఇంటి పని, పిల్లలను చూసుకునే పనికి కుదిరాను. కొద్ది రోజులు బాగానే ఉన్నా తరువాత నుంచి యజమాని అఘాయిత్యాలు పెరిగిపోయాయి. తిండి కూడా సరిగ్గా పెట్టకుండా కొట్టి మరీ పనిచేయించేవారు. ఆఖరికి కాలు విరిగినా కనికరించలేదు'.. ఇదీ ఏపీలోని డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గొల్లకుట్టివారి పాలేనికి చెందిన నిర్మల అనే బాధితురాలి ఆవేదన ఇది. బీసీ యువసేన జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీ రామకృష్ణారెడ్డి సహకారంతో గల్ఫ్ చెర నుంచి బయట పడిన ఆమె.. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయనతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఏజెంట్ చేతిలో మోసపోవడం వల్లే ఇన్ని కష్టాలు అనుభవించానని నిర్మల చెప్పారు. ఈ క్రమంలో తాను కింద పడడంతో కాలు విరిగిందని, నడవలేని స్థితిలో ఆసుపత్రిలో చూపించమని తమ యజమానిని వేడుకున్నా పట్టించుకోలేదని, పైగా కొట్టి మరీ పని చేయించుకున్నారని తెలిపారు. అక్కడి నుంచి వేరే ప్రాంతానికి మార్చి ఒక గదిలో బంధించారని, అదే గదిలో ఉంటున్న మరో మహిళ సెల్ ఫోన్‌తో కుటుంబ సభ్యులకు తన గోడు తెలిపానని చెప్పారు. చివరికి బీసీ యువసేన నేత మురళీ రామకృష్ణా రెడ్డికి ఫోన్ చేయగా మస్కట్‌లో ఉంటున్న బొంతు నాగరాజు, రాజీ, తదితరులు అక్కడికి వచ్చి తనను విడిపించారన్నారు. పాస్ పోర్ట్ లేకపోవడంతో భారత్ ఎంబసీతో మాట్లాడి సంబంధిత పత్రాలు సమకూర్చారని, బీసీ యువ సేన ప్రతినిధులు, మస్కట్‌లో ఉన్న వారు సుమారు రూ.1.50 లక్షలు అందించగా, ఊర్లో ఉన్న ఇంటిని తనఖా పెట్టి తండ్రి రాంబాబు రూ. 50 వేలు పంపించడంతో తాను ఈ నెల 27న విమానంలో నగరానికి వచ్చినట్టు తెలిపారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని అనేక మంది ఏజెంట్ల మాయమాటలతో మోసపోయి గల్ఫ్‌లో నరకం అనుభవిస్తున్నారని తెలిపారు. ఆ నరకం నుంచి బయటికి రావడానికి ఎంతోమంది ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఒమాన్ రాజధాని మస్కట్ నుంచి నిర్మలను కాపాడడం సంతృప్తినిచ్చినా, ఇంకా 15 మంది మహిళలు అక్కడ చిక్కుకుని ఉన్నారని తెలిపారు. వారిని ఇండియాకు రప్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, దాతలు సహకరించాలని కోరారు.

వడివడిగా గోదావరి

ధవళేశ్వరం వద్ద పెరుగుతున్న వరద

- బ్యారేజీ వద్ద 15.80 అడుగుల నీటిమట్టం
- ఇక్కడ రెండో ప్రమాద హెచ్చరిక అమలులో..
- 17.75 అడుగులకు చేరితే మూడో హెచ్చరిక
- భద్రాచలం వద్ద వేగంగా తగ్గుతున్న వరద

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)


పోలవరం ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డులో నీట మునిగిన కడెమ్మ వంతెన

గోదావరి.. వడివడిగా, ఉధృతంగా పరుగులు పెడుతోంది. దీంతో తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం భారీగా పెరిగింది. ఆదివారం రాత్రి 11 గంటలకు బ్యారేజీ నీటిమట్టం 15.80 అడుగులకు చేరింది. బ్యారేజీ నుంచి 16,14,844 క్యూసెక్కుల వరద నీరు సముద్రంలోకి వెళుతోంది. ఇక్కడ నీటిమట్టం 17.75 అడుగులకు చేరినా.. వరద 17 లక్షల క్యూసెక్కులకు చేరినా మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. ప్రస్తుతం రెండో ప్రమాద హెచ్చరిక అమలులో ఉంది. పోలవరం స్పిల్‌వే నుంచి అధికంగా వరద పోటెత్తుతోంది. రాజమహేంద్రవరం అఖండ గోదావరి కూడా ఉధృతంగా ఉంది. లంకల్లోని గ్రామాల ప్రజలు చాలావరకూ పునరావాస కేంద్రాల్లో తల దాచుకుంటున్నారు. ములకల్లంక ప్రజలు మాత్రం ఇంకా బయటకు రావడం లేదు. వారంతా పడవల మీద రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లాలో స్లూయిజ్‌లు దెబ్బతిన్నడం వల్ల సీతానగరం మండలం బొబ్బిలంక వద్ద గోదావరి నీరు వెనక్కి వస్తోంది. ఇప్పటికే బురద కాలువ వల్ల తీవ్రంగా దెబ్బతిన్న పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. భద్రాచలం వద్ద మాత్రం వరద భారీగా తగ్గడం గమనార్హం. శనివారం అర్ధరాత్రి 53.90 అడుగులకు పెరిగిన నీటిమట్టం తెల్లవారుజాము నుంచి తగ్గడం మొదలైంది. ఆదివారం రాత్రి 11 గంటలకు సుమారు ఆరు అడుగులపైగా తగ్గి 47.40 అడుగులకు చేరింది.

బాధితులకు ప్రభుత్వం సహాయం

వరదలు, భారీ వర్షాలకు ముంపునకు గురైన రైతులు, బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. తూర్పుగోదావరి జిల్లాలో 1,421 కుటుంబాలకు పునరావాస పరిహారం కింద 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో పామాయిల్, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు పంపిణీ చేశారు. జిల్లాలో 529 కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.3 వేల చొప్పున ఆర్థిక సహాయం చేశామని అధికారులు తెలిపారు.

సందర్శకుల సందడి

సుమారు 11 రోజులుగా గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ ప్రవాహ వేగాన్ని చూసేందుకు సందర్శకులు ఎగబడుతున్నారు. రాజమహేంద్రవరం పుష్కర్ ఘాట్ నుంచి గౌతమీ ఘాట్, సరస్వతీ ఘాట్ వరకూ వందల సంఖ్యలో జనం కనిపిస్తున్నారు.

పోలవరం వద్ద పెరిగిన వరద

ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. ఇక్కడ నీటిమట్టం 24.757 మీటర్లకు చేరుకోగా 12,53,682 క్యూసెక్కుల వరద జలాలను దిగువకు విడుదల చేసినట్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరదను 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. నీటిమట్టం పెరగడంతో పోలవరం ప్రాజెక్టుకి వెళ్లే ప్రధాన మార్గమైన కడెమ్మ వంతెన నీట మునిగి వంతెనపై మూడడుగుల ఎత్తున వరద ప్రవహిస్తోంది. పోలవరం ప్రాజెక్టుకి రాకపోకలు నిలిచిపోవడంతో అధికారులు యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేశారు. కుక్కునూరు మండలంలోని పలు గ్రామాల్లోకి గోదావరి వరదనీరు చొచ్చుకురావడంతో ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కుక్కునూరు -భద్రాచలం రోడ్డు నీట మునిగింది. కుక్కునూరు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే బోట్లపై వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేలేరుపాడు మండలంలో 34 గ్రామాల్లోకి వరద నీరు చేరింది. మరోవైపు గోదావరితోపాటు శబరి, సీలేరు నదులు ఉగ్రరూపం దాల్చడంతో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్‌లోని చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 83,314 మంది వరద బారిన పడ్డారు. వారంతా వలసపాకలు, ప్రభుత్వ భవనాల్లో తలదాచుకుంటున్నారు. వివిధ గ్రామాలకు చెందిన 54 రహదారులు జలమయమయ్యాయి.

మాచేనమ్మ ఆలయంలోకి వరద నీరు

గోదావరి వరద కొంత తగ్గుముఖం పట్టడంతో రెండు రోజులు క్రితం పశ్చిమగోదావరి జిల్లా లంక వాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి గోదావరి మళ్లీ ఉగ్రరూపం దాల్చడంతో ఆచంట మండలంలోని అయోధ్యలంక, పుచ్చల్లంక, మర్రిమూల, పెదమల్లం లంక, పల్లిపాలెం లంక గ్రామాలు నీట మునిగాయి. పెదమల్లం మాచేనమ్మ ఆలయంలోకి వరద నీరు చేరింది. ఆలయానికి వచ్చిన భక్తులు అనేక మంది గట్టుపైనే వంటలు చేసుకున్నారు. నరసాపురం వద్ద వశిష్ఠ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. ఎగువ నుంచి వరద రావడంతో నరసాపురం వద్ద గోదావరి నీట మట్టం గంటగంటకూ పెరుగుతోంది. ఇప్పటికే పిండాల రేవు, బాపు ఘాట్, వలంధర్ రేవులు నీట మునిగాయి. వలంధర్ రేవు వద్ద గోదారి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తున్నది. యలమంచిలి మండలం కనకాయలంక, పెదలంక గ్రామాల్లో ఆదివారం మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటించి బాధితులను పరామర్శించారు. మర్రిలంక ప్రాంతానికి మంత్రి బోటుపై వెళ్లి వరదల్లో చిక్కుకున్న సుమారు 100కు పైగా పశువులను మరపడవల ద్వారా రైతులతో కలిసి సురక్షిత ప్రాంతానికి తరలించారు.


వరద ధాటికి ముంపునకు గురైన అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మండల కేంద్రమైన కూనవరం


పశ్చిమ గోదావరి జిల్లా కనకాయలంక, పెదలంక గ్రామాల్లో బాధితులను పరామర్శించి వరద సాయం అందించేందుకు పడవపై వెళ్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

జగన్ పాపాలపై ప్రజలు చర్చించాలి

- అందుకే శ్వేతపత్రాలు విడుదల చేశాం
- ప్రతి నెలా 1నే పెంచిన పింఛన్లు ఇస్తున్నాం
- ఆగస్టు 15న 100 అన్నక్యాంటీన్లు ప్రారంభం
- ప్రజలు ఓపిక పట్టాలి.. ఆదుకుంటాం:మంత్రి అచ్చెన్న
- మంత్రులతో కలసి ముంపు ప్రాంతాల్లో పర్యటన


తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులోని తాళ్లపాలెంలో కలెక్టర్ ప్రశాంతితో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

రాజమహేంద్రవరం, జూలై 28(ఆంధ్రజ్యోతి): "మాజీ సీఎం జగన్ తన హయాంలో చేసిన పాపాలు, అరాచకాలు, దోపిడీలతోపాటు ప్రభుత్వ సంస్థలను కూడా తాకట్టు పెట్టి మొత్తం రూ.12 లక్షల కోట్ల అప్పులుచేసి, రాష్ట్రాన్ని అధోగతి పాల్జేశారు. ఈ విధ్వంసకర విధానాలపై రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజలు చర్చించాలి. అర్థం చేసుకోవాలి. ఆలోచించాలి" అని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. గత పాలనలో జరిగిన విధ్వంసాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చెప్పేందుకే సీఎం చంద్రబాబు ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశారని తెలిపారు. రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, కందుల దుర్గేశ్, కలెక్టర్ పి. ప్రశాంతి, వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావులతో కలిసి ఆదివారం ఆయన వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గంలోని ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల్లోని ఎర్రకాలువ ముంపునకు గురైన పొలాలను పరిశీలించి రైతుల గోడు విన్నారు. ముఖ్యంగా రాజానగరం మండలంలోని సీతానగరం, రాజమండ్రి రూరల్‌లో ముంపు ప్రాంతాలను పరిశీలించారు. తర్వాత నిడదవోలు మండలం తాళ్లపాలెంలో అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనతో విసిగిపోయిన ప్రజలు చంద్రబాబు, పవన్, మోదీలను చూసి ఎన్‌డీఏ కూటమికి అధికారం ఇచ్చారని తెలిపారు. "మేం బాధ్యతగా వ్యవహరించాలి. కానీ, ఖజానాలో చిల్లిగవ్వలేదు. అధికారం చేపట్టి 48 రోజులైంది. గత ప్రభుత్వ విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని రంగాల పరిస్థితిపై సమీక్షిస్తున్నారు. మరోపక్క డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సమీక్షలు చేస్తున్నారు. మంత్రులు వారి వారి శాఖలను సమీక్షిస్తున్నారు. నేను ఆరుసార్లు ఎమ్మెల్యే అయ్యాను. రెండుసార్లు మంత్రి అయ్యాను. గత ప్రభుత్వం చేసిన పాలనగానీ, గత సీఎంలాంటివాడిని కానీ నేనెప్పుడు చూడలేదు. ఇక చూడబోం కూడా. అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నమైపోయాయి. ఆర్థిక వ్యవస్థ అథఃపాతాళానికి పోయింది. అన్ని శాఖలను అడ్డుపెట్టి గత సీఎం అప్పులు చేశారు. దీన్ని ప్రజలు అర్థం చేసుకోవాలి. చేతిలో చిల్లిగవ్వలేకపోయినా బాధ్యతగల ప్రభుత్వంగా తొలి రోజే చంద్రబాబు ఐదు సంతకాలు పెట్టారు. రూ.3 వేల పింఛనును రూ.4 వేలు చేసి, ఏప్రిల్ నుంచే దానిని అమలుచేసి, జూలైలో రూ.7 వేల వంతున పంపిణీ చేశారు. ప్రతి నెల 1నే ఇంటింటికీ పంపిణీ చేస్తున్నాం" అని వివరించారు.

ప్రజలు ప్రశాంతంగా ఉన్నారు

తమ భూమి తమకు దక్కుతుందా, లేక ఎవరైనా అప్పులు తెచ్చేసుకుంటారా అని ప్రజలు, రైతాంగానికి కంటిమీద కునుకులేకుండా చేసిన లాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేశామని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. "అన్నమోరామచంద్ర అని అలమటించే పేదలకు అన్నం కూడా దక్కకూడదని ఆ.. దుర్మార్గుడు అన్నక్యాంటీన్లను రద్దు చేశారు. ఆగస్టు 15న 100కు తగ్గకుండా అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తున్నాం. దుర్మార్గుడైన గత పాలకుడు రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి కూడా పూర్తిగా డబ్బు ఇవ్వలేదు. రూ.1,685 కోట్లు బాకీ పెట్టారు. చంద్రబాబు నాబార్డు నుంచి రూ.1000 కోట్లు అప్పుతెచ్చి రైతులకు ఇచ్చారు. ఇంకా రూ.685 కోట్లు బాకీ ఉంది. వారం, పది రోజుల్లో రైతుల బ్యాంక్ ఖాతాల్లో వేస్తాం" మంత్రి తెలిపారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

భారీవర్షాలు, వరదల వల్ల ముంపునకు గురైన ప్రాంతాల్లో బాధితులు, రైతులకు తమ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. "గత ప్రభుత్వం బాధితులను కనీసం పట్టించుకోలేదు. పరామర్శించలేదు. మేం అధికారంలోకి రాగానే.. భారీ వర్షాలు వస్తున్నాయని, నదులు పొంగుతాయని విపత్తుల శాఖ ద్వారా ప్రజలను ముందే అప్రమత్తం చేశాం. కానీ, గత ప్రభుత్వం చేసిన ఇరిగేషన్ విధ్వంసం వల్ల చాలా గ్రామాలు మునిగిపోయాయి. కుటుంబానికి రూ.3 వేల ఆర్థిక సాయం, బియ్యం, ఆయిల్, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు వంటివి పంపిణీ చేస్తున్నాం. ఒక్క బాధితుడిని కూడా వదల్లేదు. అందుకే ఒక్క విమర్శ కూడా రాలేదు" అని ఆయన వివరించారు.

'ఎర్రకాలువ'కు శాశ్వతంగా పరిష్కారం

ఎర్రకాలువ వరద వల్ల సుమారు 20 మండలాల్లోని వేలాది ఎకరాల పంట నష్టపోతున్నామని, ఏటా ఈ సమస్య సాధారణంగా మారిందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. వరద తగ్గిన వెంటనే పంటలు వేసుకునేందుకు వీలుగా ఎర్రకాలువకు తాత్కాలిక రిపేర్లు చేస్తామని మంత్రి చెప్పారు. తర్వాత శాశ్వత పరిష్కారం కోసం ఏం చేస్తే బాగుంటుందో నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు తెలిపారు.

జగన్.. ఇంత పిరికితనమా!

సిగ్గు సిగ్గు


- ప్రతిపక్ష హోదాకే కాదు... ఎమ్మెల్యేకీ అర్హులు కారు
- అసెంబ్లీకి పోని మీరు తక్షణమే రాజీనామా చేయాలి: షర్మిల డిమాండ్



అమరావతి, జూలై 28(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిపై పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మరోసారి తీవ్ర వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. 'సిగ్గు సిగ్గు... మాజీ సీఎం జగన్! ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగుపెడతా అనడం మీ అజ్ఞానానికి నిదర్శనం' అంటూ షర్మిల మండిపడ్డారు. ఆదివారం ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. 'అసెంబ్లీకి పోననడాన్ని మించిన పిరికితనం, చేతకానితనం, అహంకారం ఎక్కడా కనపడవు, వినపడవు. మోసం చేయడం మీకు కొత్తేమీ కాదు జగన్. కానీ మిమ్మల్ని ఎన్నుకుని, అసెంబ్లీకి పంపిన ప్రజలను ఇలా వెర్రిగా, వింతగా మోసం చేయడం, ఓట్లు వేసిన ప్రజలను అవమానించడం మీకే చెల్లింది. అసెంబ్లీకి పోకుండా ప్రజాస్వామ్యాన్ని హేళన చేయడం దివాలాకోరుతనం. ఎమ్మెల్యే అంటే మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ... మెంబర్ ఆఫ్ మీడియా అసెంబ్లీ కాదు. ఎమ్మెల్యేగా గెలిచింది చట్టసభల్లో ప్రజల గొంతుక అవ్వడానికా లేక మీడియా ముందు సొంత డబ్బా కొట్టుకోవడానికా? ఐదేళ్ల పాలన అంతా అవినీతి, దోపిడీ అని, రాష్ట్రాన్ని మీరు అప్పుల కుప్ప చేసి పెట్టారని, నిండు సభలో అధికారపక్షం శ్వేతపత్రం విడుదల చేస్తుంటే... తాపీగా ప్యాలెస్‌లో కూర్చుని మీడియా మీట్లు పెట్టడానికి కాదు ప్రజలు మిమ్మల్ని ఎమ్మెల్యేను చేసింది. ప్రజలకు అన్యాయం జరిగితే అధికారపక్షాన్ని ఫ్లోర్ ఆఫ్ ది హౌస్‌లో ప్రశ్నించే బాధ్యత మీది కాదా? అసెంబ్లీకి పోనని చెప్పే మీరు, ప్రతిపక్ష హోదాకే కాదు, ఎమ్మెల్యే హోదాకు కూడా అర్హులు కారు. ప్రజాతీర్పును గౌరవించకుండా, అసెంబ్లీకి పోను అంటూ గౌరవ సభను అవమానించిన వాళ్లకు ఎమ్మెల్యేగా ఉండే అర్హత లేదు. ఎమ్మెల్యేగా ఆయన రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది' అని షర్మిల పేర్కొన్నారు.

కరువు తీరేలా వరద

- శ్రీశైలం, తుంగభద్రకు కొనసాగుతున్న జలాలు
- నేడు శ్రీశైలం 6 గేట్లను ఎత్తనున్న మంత్రి నిమ్మల


శ్రీశైలం జలాశయంలోకి చేరిన వరద

కర్నూలు/శ్రీశైలం, జూలై 28(ఆంధ్రజ్యోతి): రాయలసీమ కరువు తీరేలా కృష్ణా, తుంగభద్ర నదులు ఉప్పొంగుతున్నాయి. కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు వరద పరవళ్లు తొక్కుతోంది. శ్రీశైలం జలాశయం గరిష్ఠ నీటి మట్టానికి చేరుతుండగా హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా జలాలు ఎత్తిపోసి సీమలోని కరువు పల్లెలకు నీటిని మళ్లించాలని కర్నూలు, అనంతపురం జిల్లాల రైతులు కోరుతున్నారు. శ్రీశైలం జలాశయానికి తెలంగాణలోని జూరాల ప్రాజెక్టు దాటి కృష్ణా వరద 3,29,044 క్యూసెక్కులు, కర్నూలు జిల్లా సుంకేశుల బ్యారేజీ ద్వారాలు దాటుకొని తుంగభద్ర నది వరద 1,40,478 క్యూసెక్కుల(4,69,522 క్యూసెక్కులు) ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. రోజుకు సగటున 40 టీఎంసీల వరద చేరుతోంది. శ్రీశైలం గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 215 టీఎంసీలకు గాను.. ఆదివారం నాటికి 871.90 అడుగుల వద్ద 149.776 టీఎంసీల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఏపీ, తెలంగాణ విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా 62,847 క్యూసెక్కులు దిగువ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్(పీఆర్‌పీ) ద్వారా రాయలసీమ కాలువలకు 15 వేల క్యూసెక్కుల వరద జలాలు వదిలితే.. తెలంగాణ ప్రభుత్వం కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 1,600 క్యూసెక్కుల మేర ఎత్తిపోస్తోంది. ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల సంయుక్త జలాశయం తుంగభద్రకు వరద రోజురోజుకూ పెరుగుతోంది. 1,27,100 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదైంది. గరిష్ఠ నీటి మట్టం 1,633 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 1,631 అడుగులు 98.218 టీఎంసీలు నిల్వ చేసి 1,50,798 క్యూసెక్కులను డ్యాం నుంచి విడుదల చేస్తున్నారు. కర్నూలు జిల్లా సుంకేశుల బ్యారేజ్‌కు 1.43 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది.

శ్రీశైలం నుంచి నేడు నీటి విడుదల

శ్రీశైలం జలాశయానికి భారీ వరద పోటెత్తింది. దీంతో శ్రీశైలం జలాశయం రేడియల్ క్రస్టుగేట్లను ఎత్తేందుకు జలవనరులశాఖ ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు. సోమవారం ఉదయం మంత్రి నిమ్మల రామానాయుడు డ్యామ్ 6 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేయనున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.